
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00

సంపుటి: 16 | సంచిక: 58



ఆదివారం 12-11-2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి దీపావళి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాజస్తాన్‌లో అమానుషం

రాజస్తాన్‌లోని దౌసాలో ఓ కీచక ఎస్సై అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

వివరాలు 6లో ▸



లాలూ సన్నిహితుడి అరెస్ట్

'ల్యాండ్ ఫర్ జాబ్స్' కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ, ఆయన కుమారుడు తేజస్వీ సన్నిహితుడు అమిత్ కట్యాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది.

వివరాలు 6లో ▸



అయోధ్యలో 22 లక్షల దీపాలు

అయోధ్యలోని సరయూ నదీ తీరంలో 22 లక్షల దీపాలతో జరిగిన దీపోత్సవం గిన్నిస్ రికార్డు సృష్టించింది.

వివరాలు 6లో ▸



గాల్లో వేలాది ప్రాణాలు!

ఇజ్రాయెల్ అష్టదిగ్బంధం దెబ్బకు కనీస సౌకర్యాలన్నీ నిలిచిపోవడంతో గాజాలో 20 ఆస్పత్రులు పూర్తిగా స్తంభించిపోయాయి.

వివరాలు 6లో ▸

విజయవాడలో జరిగిన మైనారిటీల సంక్షేమ దినోత్సవ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



మనసున్న ప్రభుత్వమిది

పేదల బతుకులు మార్చేందుకు నిండు మనసుతో పని చేస్తున్నాం

మైనారిటీల సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వాలనే మనసు గత పాలకులకు లేదు
- ఇవాళ మైనారిటీలకు ఉప ముఖ్యమంత్రి పదవి.. అన్ని విధాలా భరోసా
- ప్రజలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని తపనపడే వాడే నిజమైన నాయకుడు
- 53 నెలల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఇతర వర్గాల పేదలకు నేరుగా రూ.2.40లక్షల కోట్లు
- డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి ఒక్క ముస్లిం మైనారిటీలకు మాత్రమే రూ.23,176 కోట్లు
- పేద అక్కచెల్లెమ్మల పిల్లలు పెద్ద చదువులు చదవాలన్నది నా తాపత్రయం
- నాడు, నేడు ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్.. ఇప్పుడు అప్పులూ తక్కువే
- గత ప్రభుత్వంలో ఈ డబ్బులన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? తేడా గమనించండి..

2 లో



ఫ్యాక్ట్‌చెక్

సచివాలయాలపైనా ఏడుపే..

- సీఎం కుర్చీలో చంద్రబాబు లేరన్న అక్కసుతో విషం కక్కుతున్న 'ఈనాడు'
- సచివాలయాలకు నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనడం శుద్ధ అబద్ధం
- కంప్యూటర్లు, ప్రింటర్లు ప్రభుత్వ డబ్బులతోనే కొనడం వాస్తవం కాదా..
- ప్రత్యేక కార్యక్రమాలకు వేరుగా నిధులు విడుదల చేయలేదా?

- ఫుల్ అవుట్ 6లో



హంస వాహనంపై వీణాపాణి

■ తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవ రోజైన శనివారం రాత్రి వీణాపాణిగా హంస వాహనంపై అమ్మవారు భక్తులను కటాక్షించారు. అంతకుముందు పెద్దశేష వాహనంపై శ్రీబద్రినారాయణుడి అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు.

- వివరాలు 5లో



గిరిజన వర్సిటీ మాస్టర్ ప్లాన్ రెడీ

■ ఉమ్మడి విజయనగరం జిల్లా మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లోని 562 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. తొలివిడతగా కేటాయించిన రూ.300.50 కోట్ల వ్యయంతో వర్సిటీకి ప్రాథమికంగా అవసరమైన నిర్మాణాలు చేపట్టనున్నారు.

- వివరాలు 4లో

చంద్రమోహన్ ఇక లేరు..

శనివారం ఉదయం కన్నుమూసిన సినీ 'ఆల్‌రౌండర్'



- కొన్నాళ్లుగా గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు చికిత్స
- పరిస్థితి విషమించడంతో అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస
- 900కుపైగా సినిమాల్లో నటన.. తొలి చిత్రానికే నంది అవార్డు
- తొలి తరం హీరో నుంచి నేటి తండ్రి క్యారెక్టర్ దాకా విభిన్నమైన పాత్రలు
- నటనతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయిన చంద్రమోహన్
- నివాళులు అర్పించిన ప్రముఖులు
- రేపు మధ్యాహ్నం అంత్యక్రియలు

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్ సంతాపం

4 లో

ఓన్లీ చంద్రమోహన్

- ఫ్యామిలీలో

సాక్షి, హైదరాబాద్: కథానాయకుడిగా, సహాయ నటుడిగా, హాస్యనటుడిగా, కొన్ని చిత్రాల్లో ప్రతినాయకుడిగానూ నటించిన 'ఆల్ రౌండర్' చంద్రమోహన్ (82) ఇక లేరు. కొన్నాళ్లుగా ఆయన గుండె, కిడ్నీ సంబంధిత, మధుమేహం వ్యాధులతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికాగా.. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 9.45కు చంద్రమోహన్ తుదిశ్వాస విడిచారు. తర్వాత ఆయన భౌతికకాయాన్ని

మిగతా 4వ పేజీలో ▶

ఎస్సీ వర్గీకరణకు త్వరలో కమిటీ

మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ హామీ



భావోద్వేగానికి గురైన మందకృష్ణ మాదిగను ఓదారుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం
- ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది
- ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది.. న్యాయపరమైన చిక్కులు అధిగమించేందుకు చర్యలు చేపడతామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోరిక అత్యంత న్యాయమైనదని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. మూడు దశాబ్దాలుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) చేస్తున్న ఉద్యమం సరైనదని, త్వరలో మాదిగల ఆకాంక్షను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాదిగ ఉప కులాల

మిగతా 4వ పేజీలో ▶



జగనన్న విద్యా దీవెనకు ఉమ్మడి ఖాతాలు

- తల్లితోపాటు విద్యార్థి కూడా కలిసి బ్యాంకు ఖాతా తెరవాలి
- ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం

- వివరాలు 4లో

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి!

- నివేదిక సమర్పించనున్న దేశాయ్ కమిటీ
- ఆ వెంటనే అసెంబ్లీ ఆమోదం
- అమలు చేస్తే దేశంలో తొలి రాష్ట్రంగా రికార్డు
- త్వరలోనే గుజరాత్‌లో కూడా!

- వివరాలు 6లో

క్రిస్‌సిటీ నిర్మాణానికి దిగ్గజ సంస్థల పోటీ

- తుది బిడ్డింగ్ పోరులో నిలిచిన 3 ప్రముఖ నిర్మాణ సంస్థలు
- రూ.1,021 కోట్లతో 'క్రిస్'సిటీ నిర్మాణానికి ఏపీఐఐసీ టెండర్లు
- కృష్ణపట్నం వద్ద తొలిదశలో క్రిస్ సిటీ కింద 2,500 ఎకరాల అభివృద్ధి



సాక్షి, అమరావతి: చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో కృష్ణపట్నం వద్ద అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక నగరం 'క్రిస్'సిటీ నిర్మాణానికి దిగ్గజ సంస్థలు పోటీపడుతున్నాయి. తొలిదశలో రూ.1,503.16 కోట్లతో 2,500 ఎకరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులివ్వడంతో ఈపీసీ విధానంలో రూ.1,021.41 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించింది. తుది బిడ్డింగ్‌లో మూడు కీలక సంస్థలు అర్హత సాధించినట్లు ఏపీఐఐసీ వీసీఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈ టెండర్ల మదింపు జరుగుతోందని, అర్హత సాధించిన తర్వాత వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా ప్రణాళికలు సిద్ధంచేసినట్లు ఆయన తెలిపారు. చెన్నై–బెంగళూరు కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం వద్ద 10,834.5 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్)తో కలిసి ఏపీఐఐసీ నిక్‌డిక్ట్–కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (క్రిస్‌సిటీ) పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటు చేసింది. పూర్తిస్థాయిలో తొలిదశ అందుబాటులోకొస్తే 78,900 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

సెలవు

దీపావళి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

ఇదండీ సంగతి



ఆ 21 కులాలు రాష్ట్రమంతటా బీసీలే

- వాటి ఉప కులాలకు సైతం ప్రాంతం, భౌగోళిక పరిమితి తొలగింపు
- ఆ కులాల వారికి బీసీ ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు లేకుండా ఆదేశాలు
- 2008లో పలు కులాలకు ప్రాంతాలవారీగా బీసీ అవకాశం ఇచ్చిన వైఎస్సార్
- తాజాగా రాష్ట్రమంతటా పరిధి విస్తరిస్తూ సీఎం జగన్ ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం



సాక్షి, అమరావతి: కొన్ని ప్రాంతాలకే వెనుకబడిన తరగతులు (బీసీ)గా పరిమితమైన 21 కులాలు, వాటి ఉప కులాలకు ప్రాంతం, భౌగోళిక పరిమితులను తొలగించి రాష్ట్ర మంతటా బీసీలుగానే పరిగణిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము ఉత్తర్వులు జారీ చేశారు. వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్న 138 కులాల్లో 31 కులాలు వాటి కార్యకలాపాలపై ప్రాంతం, భౌగోళిక పరిమితులను కలిగి ఉన్నాయి. వాటిలో పది బీసీ కులాలు తెలంగాణాలో, 21 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 21 కులాలను కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో బీసీలుగా పరిగణిస్తున్నారు. ఈ విషయంలో వచ్చిన అనేక అభ్యర్థనలను పరిశీలించిన ప్రభుత్వం ఈ 21 కులాలకు ప్రాంతం, భౌగోళిక పరిమితిని తొలగించడం ద్వారా

మిగతా 2వ పేజీలో ▶

చకచకా డిజిటలైజేషన్

ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 32 వేల ఐఎఫ్‌పీలు, 22 వేల టీవీలు, 5 లక్షల ట్యాబ్స్ అందుబాటులోకి..

- డిసెంబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు పంపిణీ
- ఇక పాఠశాల విద్యలో నూరుశాతం డిజిటలైజేషన్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థిపై చేసే ఖర్చు భవిష్యత్ పెట్టుబడిగా భావించి, అన్ని సదుపాయాలను అందిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే 30,715 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ)లు అందించగా, ఈ డిసెంబర్‌లో ఇచ్చే 32 వేల స్క్రీన్లతో కలిపి మొత్తం 63 వేలు అందుబాటులోకి రానున్నాయి. స్మార్ట్ టీవీలు 33 వేలకు చేరడంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను డిజిటలైజేషన్ పూర్తవుతుంది. మరోపక్క ట్యాబ్స్ పంపిణీ 10 లక్షలకు పైగా చేరుకుంటుంది. దీంతో దేశంలోనే ప్రభుత్వ విద్యలో పూర్తిస్థాయి డిజిటల్ టెక్నాలజీని అనుసరించే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. అన్ని ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు, ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీల అమరిక డిసెంబర్ 21 నాటికి పూర్తి కానుంది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖలోని నాడు–నేడు కమిషనరేట్ అధికారులు ప్రణాళికసిద్ధం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో 4,800 ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి వరకు సెక్షన్‌కు ఒకటి చొప్పున 30,715 ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తెచ్చి డిజిటల్ బోధన చేపట్టారు. ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు ఒక స్మార్ట్ టీవీ చొప్పున 10,038 స్మార్ట్ టీవీలను సరఫరా చేసిన విషయం తెలిసిందే. రెండో దఫాలో 32 వేల ఐఎఫ్‌పీలు, 22 వేల స్మార్ట్ టీవీలను పాఠశాలలకు అందించనుంది.



విద్యా తేజం.. ఆంధ్రా విశ్వవిద్యాలయం

ఆంధ్రా వర్సిటీకి తొలిసారిగా ఏ డబుల్ ప్లస్ గ్రేడ్

- కీలకమైన గ్రేడ్ కేటాయించిన నాక్
- 3.74 స్కోర్‌తో దేశంలో టాప్ 3 వర్సిటీల్లో ఒకటిగా గుర్తింపు
- ఏయూలో రెండు రోజుల పాటు పర్యటించిన బృందం
- విద్య, ఆహ్లాదం, మౌలిక వసతులపై సంతృప్తి
- 36 యూజీ, 118 పీజీ, 57 పీహెచ్‌డీ, 11 డిప్లొమా కోర్సులతో టాప్ వర్సిటీల్లో ఒకటిగా ఏయూ

4 లో

క్లుప్తంగా...

ఈ దీపావళి.. ప్రజలందరిలో వెలుగులు నింపాలి
గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: దీపావళిని పురస్కరించుకుని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'దీపావళి పండుగ శుభ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. దివ్య దీపాల వెలుగు ప్రజలందరికీ శాంతిని, శ్రేయస్సును, ఆనందాన్ని కలిగిస్తాయని ఆశిస్తున్నాను. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీక. శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యాలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు ఇలాంటి పండుగలు మనకు స్ఫూర్తినిస్తాయి. దీపావళి దీపాల కాంతి మనందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను' అని గవర్నర్ పేర్కొన్నారు.

తెలుగు ప్రజలకు సీఎం దీపావళి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీపావళి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీపావళి అంటేనే కాంతి వెలుగు, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ అని సీఎం వైఎస్ జగన్ గుర్తు చేశారు. దీపావళి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని.. ప్రతి ఇంటా ఆనంద కాంతులు విరజిల్లాలన్నారు.

22న ఎన్‌డబ్ల్యూడీఏ పాలకమండలి సమావేశం

సాక్షి, అమరావతి: జాతీయ జలవనరుల అభివృద్ధి మండలి (ఎన్‌డబ్ల్యూడీఏ) 72వ పాలక మండలి (గవర్నింగ్ బాడీ) సమావేశం ఈ నెల 22న జరగనుంది. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరాతో పాటు అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు పాల్గొంటారు. గోదావరి–కావేరి అనుసంధానంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పేదలకిచ్చే రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర పంపిణీ విధానం, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా నిత్యావసర సరుకుల ఇంటింట పంపిణీపై శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ.. ప్రతినెలా రేషన్ సరుకులు పేదలందరికీ సక్రమంగా పంపిణీ జరగాలని.. ఈ విషయంలో ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే అందుకు జేసీ (సివిల్ సప్లైస్)పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గిరిజన లేదా మారుమూల ప్రాంతాల్లో ఇరుకు రోడ్ల వల్ల మొబైల్ డిస్పెన్సింగ్ వాహనాలు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే వీలు లేకుంటే ఆయా ప్రాంతాల్లో వీధి చివర నిర్దేశిత ప్రాంతం నుండి ప్రతినెలా సరుకులు పంపిణీ చేయాలన్నారు.

ఏపీలో కేజీబీవీ ప్రమాణాలు భేష్
ప్రముఖ విద్యావేత్త సుబీర్ శుక్లా అభినందన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ) సేవలు, టీచర్ల ఎంపిక, శిక్షణ బాగున్నాయని ప్రముఖ విద్యావేత్త, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రధాన సలహాదారు, సమగ్ర శిక్ష ఎడ్యుకేషన్ క్వాలిటీ అడ్వైజర్ సుబీర్ శుక్లా అభినందనలు తెలిపారు. కేజీబీవీల్లో కొత్తగా నియమితులైన టీచర్లకు విశాఖపట్నం, విజయవాడలో నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సుబీర్ శుక్లా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కేజీబీవీల ఉపాధ్యాయుల ఎంపిక అద్భుతంగా ఉందని, అత్యున్నత విద్యావంతులు, మంచి ప్రమాణాలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారని ప్రశంసించారు. టీచర్ల పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా బేబీ కేర్ సెంటర్ (క్రెచ్) ఏర్పాటు చేసిన సమగ్ర శిక్ష అధికారులను అభినందించారు. 'మూడు రోజుల శిక్షణ కోసం నేను వచ్చింది లాంఛనమే అయినా.. ఇక్కడి పరిస్థితులు, వాతావరణం అద్భుతంగా ఉన్నాయి. మంచి నైపుణ్యం కలిగిన టీచర్లను ఎంపికచేశారు. శిక్షకులు సైతం లోతైన పరిజ్ఞానాన్ని టీచర్లకు అందించారు. విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది. టీచర్లలో నేర్చుకోవాలనే ఆసక్తి, అవగాహన తీరు అద్భుతంగా ఉన్నాయి.' అని సుబీర్ తెలిపారు.


షేక్ అబ్దుల్ గఫర్


పఠాన్ మహ్మద్ ఖాన్


పఠాన్ కరీముల్లా ఖాన్


సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ


మహ్మద్ గౌస్ ఖాన్ అరీఫ్


మహ్మద్ అజ్మత్ అలీ


బాబా ఫక్రుద్దీన్


సీఎం జగన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్‌ఏ సత్తార్ సాహెబ్

మనసున్న ప్రభుత్వమిది..

సాక్షి, అమరావతి: 'ఈ ప్రభుత్వంలో ఒక జగన్ కనిపిస్తాడు. జగన్‌కు ఇటు వైపు, అటు వైపు డిప్యూటీ సీఎంలుగా ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక బీసీ, ఒక మైనార్టీ కనిపిస్తారు. మీ బిడ్డ సీఎంగా ప్రమాణం చేసిన మొదటి రోజు నుంచీ వీళ్లందరూ నా పక్కనే కనిపిస్తున్నారు. ఈ ప్రభుత్వం ఒక్క జగన్‌దే కాదు.. మనందరిది. మనసున్న ప్రభుత్వం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమాలను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా 1947 నుంచి 1958 వరకు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు స్థాపించిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన జయంతిని నేషనల్ ఎడ్యుకేషన్ డే గా జరుపుకుంటున్నామన్నారు. మైనారిటీస్ సంక్షేమ దినోత్సవంగా (మైనార్టీస్ డే) కూడా జరుపుకుంటున్నట్లు 2008లో అప్పటి ముఖ్యమంత్రి, మన ప్రియతమ నాయకుడు, దివంగత రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ప్రకటించారని గుర్తు చేశారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ముస్లింలలో పేదలందరికీ రిజర్వేషన్లు అమలు చేసిన నాయకుడు దివంగత మహానేత రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. నాన్న ముస్లిం సోదరుల పట్ల, మైనార్టీల సంక్షేమం పట్ల ఒక అడుగు వేస్తే.. ఆయన బిడ్డగా, మీ అన్నగా, మీ వాడిగా రెండడుగులు ముందుకు వేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

గతానికి, ఇప్పటికి మధ్య తేడా గమనించండి

- గత ప్రభుత్వంలో మైనార్టీలకు మంత్రి పదవి కూడా ఇవ్వని మనసు లేని ముఖ్యమంత్రి ఉండే వారు. మన ప్రభుత్వంలో రెండు దఫాలు మంత్రి మండలి కూర్పులో ఏకంగా డిప్యూటీ సీఎం హోదాలో నా మైనార్టీ సోదరుడు ఈ రోజు నా పక్కనే ఉన్నాడు. రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం వచ్చాక అనేక గొప్ప మార్పులు చోటుచేసుకున్నాయి.
- ఈ రోజు ముస్లిం సోదరులకు రాజకీయ, ఆర్థిక, మహిళా, విద్యా సాధికారత విషయంతో పాటు వారికి సంక్షేమం అందించే ఏ విషయంలోనైనా ముందున్నాం. మన పార్టీ నుంచి దేవుడి దయతో నలుగురు మైనార్టీలను ఎమ్మెల్యేలుగా గెలిపించుకోగలిగాం. మరో నలుగురిని ఎమ్మెల్సీలుగా కూర్చోబెట్టగలిగాం. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా నా సోదరి జకియాఖానం శాసన మండలి ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. నా అక్కచెల్లెమ్మలు, ముస్లిం సోదరుల బాగోగులు చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత బాగా అడుగులు వేస్తోందో చెప్పడానికి ఇదొక గొప్ప నిదర్శనం.
- ఎంపీపీలు, జడ్పీ చైర్మన్, మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్, ఏఎంసీ.. ఇలా ఏ నామినేటెడ్ పదవులు తీసుకున్నా.. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏకంగా 50 శాతం పదవులు ఇవ్వాలని.. అందులో కూడా 50 శాతం నా అక్కచెల్లెమ్మలకే ఇవ్వాలని చట్టం చేశాం.


సీఎం వైఎస్ జగన్‌ను సత్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా తదితరులు

> భారతదేశం అంటేనే ఏడు రంగుల ఇంద్ర ధనస్సు. మన దేశంలో అనేక రాష్ట్రాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, అనేక కులాలు, అభిప్రాయాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా, అందరం కలిసికట్టుగా.. ఇంద్ర ధనస్సుగా ఒక్కటిగా ఉంటున్నాం.. ఎప్పుడూ ఉంటాం అన్నది భారతదేశ చరిత్ర. భిన్నత్వంలో ఏకత్వంతో పాటు ఒకరినొకరు గౌరవించుకోవడం మన బలం. అల్ప సంఖ్యలో ఉన్న వారికి అండగా నిలబడటం మన బలం. మెజారిటీ, మైనార్టీల మధ్య అన్నదమ్ముల ఆత్మీయత, అనుబంధం పెంచటం ఒక వైఎస్సార్ బలం.. ఒక జగన్ బలం.. వెరసి మన అందరి బలం.
>
> గత 53 నెలల్లో దేశంలో ఎప్పుడూ జరగని విధంగా, మన రాష్ట్రంలో ముందెన్నడూ చూడని విధంగా ఈ ప్రభుత్వం ప్రతి అడుగులోనూ పేదల కోసం పరితపిస్తూ పరిపాలన సాగిస్తోంది. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ నిరుపేదలంటూ గతంలో ఓనర్ షిప్ (బాధ్యత) తీసుకున్న పరిస్థితులు లేవు. ఇప్పుడు మీ బిడ్డ ప్రభుత్వంలో ఈ వర్గాల వారందరినీ నా కుటుంబంగా భావిస్తున్నా. వీరికి అన్ని విధాలా భరోసా ఇస్తూ అడుగులు ముందుకు వేస్తున్నా. – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఈ రోజు, ఆ రోజు ఇదే బడ్జెట్.. ఇదే రాష్ట్రం. అప్పులు కూడా అప్పటి కన్నా ఇప్పుడే తక్కువ. మారిందల్లా ముఖ్యమంత్రి మాత్రమే. ఈ 53 నెలల కాలంలో లంచాలు, వివక్షకు తావు లేకుండా మీ బిడ్డ బటన్ నొక్కితే నేరుగా రూ.2.40 లక్షల కోట్లు (డీబీటీ) అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వెళ్లాయి. మరి అప్పట్లో ఈ రూ.2.40 లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి పోయాయన్నది ఆలోచించండి. పేదవాళ్లు వెళ్తున్న స్కూళ్లు, ఆస్పత్రులు కూడా మార్పు చేస్తున్నాం. గుడ్‌మార్నింగ్ చెబుతూ ప్రతి నెల 1వ తేదీన అవ్వాతాతలకు వారి ఇంటి వద్దే పెన్షన్ ఇచ్చే గొప్ప పాలన జరుగుతున్న రోజులకు, నాటి రోజులకు మధ్య తేడా గమనించండి.

విజయవాడ నుంచే హజ్ యాత్ర

- గతంలో హజ్ యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్ నుంచి వెళ్లే పరిస్థితి. విజయవాడ నుంచి నేరుగా వెళ్లేలా ఎంబార్కేషన్ పాయింట్‌గా ప్రకటించాం. ఆ తర్వాత హజ్ యాత్రకు హైదరాబాద్ కంటే విజయవాడ నుంచి విమాన టిక్కెట్ రూ.80 వేలు ఎక్కువగా వేశారని డిప్యూటీ సీఎం అంజాద్ చెప్పాడు. మనం ఇవ్వాలంటే అవుతుందా.. అని అడిగాడు. ఇక్కడ ఉన్నది మనందరి ప్రభుత్వం కాబట్టి.. కచ్చితంగా తోడుగా ఉంటామని చెప్పాను.
- రూ.14 కోట్లు ఎక్కువ అవుతుందంటే వెంటనే చెక్కు ఇచ్చి కార్యక్రమాన్ని కొనసాగించాం. నేను అడిగిందల్లా ఒక్కటే.. హజ్ యాత్రకు వెళ్లినప్పుడు మీ బిడ్డ ప్రభుత్వం కోసం దువా చేయండి అని. ఈ రోజు మైనార్టీలందరినీ కూడా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్న ప్రభుత్వం మనది.
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం పెంచాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పాస్టర్‌లకు కూడా రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్న ప్రభుత్వం కూడా మనదే. వక్ఫ్ బోర్డు, ముస్లిం మైనార్టీ, చర్చిలకు సంబంధించిన ఆస్తుల సంరక్షణ కోసం ఏకంగా జీవో నెంబరు 60 జారీ చేశాం. వీటి రక్షణ కోసం ఒక జీవో ఇచ్చి జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు వేసిన తర్వాత సచివాలయంలో ఉన్న ప్లానింగ్ సెక్రటరీలకు ఇన్‌ఛార్జ్ ఫర్ ప్రొటెక్షన్ బాధ్యతలు అప్పగిస్తూ అడుగులు వేసిన ప్రభుత్వం మనది. దేవుడు దయ, మీ అందరి చల్లని దీవెనలు మీ బిడ్డ ప్రభుత్వానికి ఉండాలని మనసారా కోరుకుంటున్నా.

మైనార్టీలకు 53 నెలల్లో రూ.23,176 కోట్లు

- నా ముస్లిం మైనార్టీలనే తీసుకుంటే.. ఈ 53 నెలల కాలంలో డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.23,176 కోట్లు ఇవ్వగలిగాం. వైఎస్సార్ పెన్షన్ కానుక, అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నావడ్డీ ఇలా ఏ పథకం తీసుకున్నా నా అక్కచెల్లెమ్మల ముఖాల్లో సంతోషం చూసే విధంగా అడుగులు వేయగలిగాం. గత పాలనలో కేవలం రూ.2,665 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. తేడా మీరే గమనించాలి.
- ప్రతి అడుగులో, ప్రతి పనిలో, వేసే ప్రతి మొలక చెట్టు కావాలని, ప్రతి ముస్లిం కుటుంబం కూడా బాగు పడాలని, వారి పిల్లలు గొప్పగా ఎదగాలనే తపనతో అడుగులు పడ్డాయి. ఈ మధ్య కాలంలో షాదీ తోఫా పథకాన్ని తీసుకొచ్చాం. నా అక్కచెల్లెమ్మల పిల్లలు బాగా చదవాలని, వారిని చదివించే విధంగా ప్రోత్సహించేందుకు షాదీ తోఫా కోసం పదోతరగతి పాస్ కావాలన్న నిబంధన పెట్టాం. ఆ నిబంధన పెట్టినప్పుడు ఎన్నికలకు వెళ్తున్నాం.. మనం ఇలాంటి కండిషన్లు ఎందుకు పెట్టడం.. తీసేద్దాం అని కొందరు అన్నారు. అప్పుడు నేను ఒకటే చెప్పాను. నాయకుడు అన్నవాడు ఆలోచన చేయాల్సింది ఎన్నికల గురించి కాదు.. రేపొద్దున వీళ్ల జీవితాల్లో వెలుగు ఎలా నింపాలని, వారి భవిష్యత్ కోసం ఆలోచనలు జరగాలని చెప్పాను.
- ఈ రోజు మనం పదోతరగతి సర్టిఫికెట్ తప్పనిసరి అని చెప్పడంతో పాటు రూ.లక్ష పెళ్లి చేసుకునేటప్పుడు ఇస్తామని చెబుతున్నాం. అప్పుడు దానికోసం కచ్చితంగా పదోతరగతి వరకు చదివించే దిశగా తల్లిదండ్రులు అడుగులు వేస్తారు. ఆ పిల్లలు కూడా చదవడం మొదలు పెడతారు. ఆ పిల్లలు చదువుల కోసం అమ్మఒడి పథకం ద్వారా అడుగులు ముందుకు వేయించగలుగుతాం. నాడు–నేడు ద్వారా స్కూళ్లను మార్పు చేస్తున్నాం. ఇంగ్లిషు మీడియం, 6వ తరగతి నుంచి ప్రతి తరగతిలో ఐఎఫ్‌పి డిజిటల్ స్క్రీన్లు, బైలింగువల్ టెక్స్ట్ బుక్స్, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు ఇస్తున్నాం. ఇవన్నీ రాబోయే రోజుల్లో మన పిల్లల భవిష్యత్ బాగుండేలా ఊతమిస్తాయి.
- ఉన్నత విద్యకు వచ్చేసరికి పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ (విద్యా దీవెన), వసతి దీవెన ఇస్తున్నాం. ఏ పేద తల్లి తన పిల్లలను చదివించేందుకు అప్పులపాలయ్యే పరిస్థితి రాకుండా ప్రతి అడుగులోనూ చేయిపట్టుకుని నడిపించే గొప్ప కార్యక్రమం చేస్తున్నాం. అందులో మరో అడుగు కళ్యాణమస్తు (బీసీ, ఎస్సీ, ఎస్టీల్లోని పేదల కోసం), షాదీతోఫా పథకాలని గొప్పగా చెప్పగలను.
- మనందరి ప్రభుత్వం వచ్చాక ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించాం. రాష్ట్రంలోని అన్ని వర్గాల మైనార్టీల కోసం సబ్ ప్లాన్ అమలు చేస్తున్నది కూడా మన ప్రభుత్వమే. దీనికోసం ఏకంగా ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ కాంపోనెంట్ చట్టం– సబ్‌ప్లాన్‌ను తీసుకువచ్చాం.

అవార్డుల ప్రదానం

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన అవార్డులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. మౌలానా ఆజాద్ జాతీయ అవార్డు–2023 డాక్టర్ ఎస్ఏ సత్తార్ సాహెబ్ (వైఎస్సార్ కడప), డాక్టర్ అబుల్ హక్ అవార్డు–2023 బాబా ఫక్రుద్దీన్ (అన్నమయ్య జిల్లా), పఠాన్ కరీముల్లా ఖాన్ (చిత్తూరు)కు అందించారు. జీవిత సాఫల్య (లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్) అవార్డు2023ను మహ్మద్ అజ్మత్ అలీ (కర్నూలు), మహ్మద్ నజీర్ (గుంటూరు), మహ్మద్ హఫీజుర్ రెహ్మాన్ (నంద్యాల), పఠాన్ మహ్మద్ ఖాన్ (మదనపల్లె), షేక్ అబ్దుల్ గఫర్ (కర్నూలు), సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ (తిరుపతి), మహ్మద్ గౌస్ ఖాన్ అరీఫ్ (వైఎస్సార్ కడప)కు అందజేశారు. 37 మంది రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయులకు, 51 మంది ఉర్దూ విద్యార్థులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చేతుల మీదుగా అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానమ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, మైనార్టీస్ కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్ అహ్మద్, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, ఉర్దూ అకాడమి చైర్మన్ హెచ్.నదీమ్ అహ్మద్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఖాదర్ బాషా, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీలు రుహుల్లా, తలశిల రఘురాం, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



మళ్లీ నువ్వే కావాలి జగనన్న అంటూ సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లింలు

మహనీయుల ఆదర్శంతో ప్రజా రంజక పాలన

భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వంటి ఎంతో మంది మహనీయులను ఆదర్శంగా తీసుకుని సీఎం జగన్ కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రజా రంజక పాలన అందిస్తున్నారు. జగన్ మంత్రివర్గంలో తొలి ముస్లిం ఉప ముఖ్యమంత్రిగా, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రిగా పని చేస్తుండటం నా అదృష్టం. నాడు వైఎస్సార్ ముస్లింలకు రిజర్వేషన్లు తీసుకురావడంతో ఎంతో మంది ఉద్యోగ అవకాశాలు పొందారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ ముస్లిం మైనార్టీలకు రాజకీయ సాధికారత కల్పించారు. ఐదుగురిని ఉప ముఖ్యమంత్రులుగా చేస్తే, అందులో నేనూ ఒకడిని. నలుగురు ముస్లిం ఎమ్మెల్సీలలో మహిళకు తొలిసారి అవకాశం ఇచ్చారు. ముస్లిం సోదరులు నలుగురిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించారు. ముస్లింలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు.

– అంజాద్ బాషా, ఉప ముఖ్యమంత్రి




సీఎం జగన్ ఆదేశంతో ముసలయ్యకు రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న ముసలయ్య


సీఎం వైఎస్ జగన్‌కు తన కుమార్తె అనారోగ్య సమస్యను చెబుతున్న సుకీర్తి తల్లి కరుణ


సీఎం జగన్ ఆదేశంతో కరుణకు రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్


సీఎం జగన్‌కు తన కుమారుడి అనారోగ్యాన్ని వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్ తల్లి నాగమణి


సీఎం జగన్ ఆదేశంతో నాగమణికి రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కి తన కుమారుడి పరిస్థితిని వివరిస్తున్న జగదీశ్ తల్లి ఉష


సీఎం జగన్ ఆదేశంతో ఉషకు రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్

సీఎం జగన్ ఆపన్న హస్తం

- కష్టాలు చెప్పుకొన్న వ్యాధిగ్రస్తులకు భరోసా
- గంటల వ్యవధిలో ఆర్థిక సాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరానికి వచ్చిన ఆయన.. తిరిగి వెళుతున్న సమయంలో స్టేడియం వద్ద పలువురు వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు కలిసి తమ పిల్లల అనారోగ్య సమస్యలు చెప్పుకుని ఆదుకోవాలని వేడుకున్నారు. వారి సమస్యలు విన్న సీఎం వైఎస్ జగన్.. తక్షణమే వారికి ఆర్థిక సాయం అందించాలని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షల చెక్కును అందించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ చేతుల మీదుగా ఈ సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మాచవరానికి చెందిన సాయితేజ తండ్రి ముసలయ్య, విద్యాధరపురానికి చెందిన జగదీష్ తల్లి టి.ఉష, బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కండ్రిక గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తల్లి నాగమణి, విజయవాడ దుర్గాపురానికి చెందిన సుకీర్తి చికిత్స కోసం తల్లి కరుణలు చెక్కులు అందుకున్నారు.

ఆ 21 కులాలు రాష్ట్రమంతటా బీసీలే

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం అంతటా బీసీలుగా గుర్తించే అవకాశం దక్కింది. ఆ కులాలకు ఇకపై రాష్ట్రవ్యాప్తంగా బీసీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కల్లుగీతపై ఆధారపడిన శెట్టి బలిజ కులానికి మాత్రం రాయలసీమ ప్రాంతంలో ఇది వర్తించదు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు చెందిన అనేక కులాలకు కొన్ని ప్రాంతాల్లో బీసీ రిజర్వేషన్లు పొందేలా 2008లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవకాశం కల్పిస్తే, ఇప్పుడు 21 కులాలకు, వాటి ఉప కులాలకు రాష్ట్రమంతటా బీసీలుగా పరిగణిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆ 21 కులాలు ఇవీ..

- బీసీ–ఏ గ్రూప్‌లో ఆరు కులాలు, వాటి ఉపకులాలు ఉన్నాయి. అవి కురకుల, పొండర, సామాంతుల (సామంత, సౌంటియా), పాల ఏకరీ, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నయనివారు, పాలేగారు, తొలగరి, కవలి, ఆసాదుల, కెవుట (కెవుటో, కెవిటి) కులాలు ఉన్నాయి.
- బీసీ–బీ గ్రూపులో నాలుగు కులాలు, వాటి ఉప కులాలు ఉన్నాయి. వాటిలో అచ్చుకట్లవాండ్లు, గౌడ (ఈడిగ, గౌడ, గమల్లా), కలాలీ, గౌండ్ల, శెట్టి బలిజ (రాయలసీమ మినహా అంతటా), కుంచిటి వక్కలింగ (వక్కలింగ, కుంచిటిగ), గుడ్ల (గుడ్లయ) కులాలు ఉన్నాయి.
- బీసీ–డీ గ్రూపులో 11 కులాలు, వాటి ఉప కులాలు ఉన్నాయి. వాటిలో మున్నూరు కాపు, పోలినాటి వెలమ, సదర, అరవ, అయ్యరక, నగరాలు, ముదలర్, ముదిలియర్, బెరి వైశ్య (బెరి శెట్టి), అతిరాస, కుర్మి, కలింగ కోమటి(కలింగ వైశ్య) కులాలు ఉన్నాయి.

సకాలంలో గమ్యం చేరుకునేలా రైళ్ల నిర్వహణ

పండుగల సీజన్ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించిన దక్షిణ మధ్య రైల్వే

సాక్షి, హైదరాబాద్: దీపావళి, ఛత్ పూజల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచు కుని వివిధప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వెయిటింగ్ జాబితాలో ఉన్న ప్రయాణికుల కోసం జనసాధారణ రైళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా, సకాలంలో గమ్యం చేరేవిధంగా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. పండుగల సీజన్ను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లలో ప్రత్యేక రైళ్లలో సుమారు 26 లక్షల అదనపు బెర్త్లతో ప్రయాణసదుపాయాలను కల్పించినట్లు వివరించారు. ప్రయాణికుల అదనపు రద్దీని అధిగమించేందుకు నిరంతరం పర్యవేక్షించాలని, రైళ్లను సమయానుకూలంగా నడిపేందుకు సకాలంలో చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు.

చేనేతకు సర్కారు ఊతం

- చేనేత వస్త్రాల ఉత్పత్తికి అవసరమైన నూలు సరఫరా
- ముడి పదార్థాల కొనుగోలు పథకంలో సాయం
- నాలుగేళ్లలో చేనేత సహకార సంఘాలకు ఇచ్చిన రుణాలు రూ.250 కోట్లు
- వ్యక్తిగతంగా నేతన్నలకు మరో రూ.122 కోట్ల రుణాలు
- నేతన్న నేస్తం కింద అందించిన ఆర్థిక సాయం రూ.969.77 కోట్లు
- పెన్షన్ కానుక రూపంలో చెల్లించిన మొత్తం రూ.1,254.42 కోట్లు



సాక్షి, అమరావతి: చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఊతమిస్తోంది. ఈ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలకు నేరుగా ఆర్థిక సాయం అందిస్తోంది. చేనేతలకు రుణ పరపతి, ముడి సరుకులకు పెట్టుబడి, నైపుణ్య శిక్షణ, ఉత్పత్తుల తయారీతోపాటు విక్రయాలకు క్లస్టర్ల ఏర్పాటు, మేలైన మార్కెటింగ్ వ్యవస్థతో అండగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర సంస్థలు, బ్యాంకర్ల సహకారాన్ని సైతం నేతన్నకు అందేలా చూస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో ఒక్కొక్కరికీ రూ.24 వేల చొప్పున ఐదు పర్యాయాలుగా మొత్తం రూ.969.77 కోట్లు అందించిన విషయం తెల్సిందే. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద చేనేత కార్మికులు ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున 2019 జూన్ నుంచి 2023 జూలై వరకు మొత్తం రూ.1,254.42 కోట్లు అందించారు.

రుణాల రూపంలోనూ చేయూత

చేనేతలకు ముద్ర రుణాలివ్వడంతో పాటు మగ్గాల ఆధునీకీకరణ, మెరుగైన నైపుణ్యం కోసం క్లస్టర్లను ఏర్పాటు చేశారు. మరోవైపు చేనేత రంగంలో కీలకమైన నూలు పోగుల కొనుగోలుకు జాతీయ చేనేత అభివృద్ధి సంస్థ (ఎన్హెచ్డీసీ) ద్వారా రాష్ట్రంలో 416 ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సంఘాలకు రూ.250.01 కోట్లు అందించారు. ఇదికాకుండా చేనేత కార్మికులకు వ్యక్తిగతంగాను, స్వయం సహాయక సంఘాల ద్వారా నాలుగేళ్లలో రూ.122.50 కోట్ల విలువైన నూలును అందించడం విశేషం.

చేనేత సహకార సంఘాలకు నూలు కోసం అందించిన మొత్తం

ఏడాది	సంఘాల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	87	31.97
2020-21	102	49.76
2021-22	124	78.51
2022-23	102	89.77

వ్యక్తిగత, స్వయం సహాయక సంఘాల ద్వారా ఇచ్చిన రుణాలు

ఏడాది	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	18.65
2020-21	16.76
2021-22	32.59
2022-23	54.50

నీటి ఎద్దడి గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులు

- ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు
- మొత్తం ఖర్చులో 65 శాతం నీటి ఎద్దడి మండలాల్లో భూగర్భ జలాల పెంపునకే..
- పథకం ద్వారా అనుమతించే 266 పనుల్లో 58 పనులతో ప్రత్యేక జాబితా

సాక్షి, అమరావతి: నీటి ఎద్దడి ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో మూడింట రెండొంతుల పనులు నీటి సంరక్షణకు సంబంధించినవే చేపట్టాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని రాష్ట్రాలకూ ఆదేశాలిచ్చింది. ఉపాధి హామీ పథకం ద్వారా అనుమతించే మొత్తం 266 పనుల్లో ప్రత్యేకించి 58 పనులను నీటి సంరక్షణ పనుల కేటగిరిలో చేర్చారు. భూగర్భ జలాలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో మండలం ప్రాతిపదికన ఈ పథకం ద్వారా చేసే మొత్తం ఖర్చులో 65 శాతం తక్కువ కాకుండా ఈ 58 పనులకు మాత్రమే ఖర్చు పెట్టాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. వర్షం నీటి నిల్వలకు ఆస్కారం ఉండే నీటి చెరువులకు మరమ్మతులు, చెక్ డ్యాంలు, చెరువు కట్టల బలోపేతం, వ్యక్తిగత, కమ్యూనిటీ స్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం వంటివి ఆ 58 పనుల కేటగిరిలో ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో మొదట నుంచి.. ఈ పథకం ద్వారా చేసే మొత్తం ఖర్చులో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల వారీగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన పనులపై 60 శాతం తక్కువ కాకుండా ఖర్చు చేయాలని.. నీటి సంరక్షణ పనులకూ 65 శాతం తక్కువ కాకుండా ఖర్చు చేయాలన్న నిబంధనలున్నాయి. అదే సమయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కేటగిరి పనులు.. నీటి సంరక్షణ పనులు ఉమ్మడిగా 208 పనులను ఒకే జాబితాగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సూచించడంతో.. ఇన్నాళ్లు ఆ ఉమ్మడి జాబితాల్లో చేపట్టే పనులన్నీ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ, నీటి సంరక్షణ కేటగిరిల్లోనూ అమలు చేసినట్టు చూపించుకునే వెసులుబాటు రాష్ట్రాలకు ఉంది.

266 పనుల వర్గీకరణ

అయితే తాజాగా ఉపాధి హామీ పథకం ద్వారా అనుమతించే మొత్తం 266 పనుల్లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కేటగిరిలో 150 పనులను ప్రత్యేకంగా చేర్చి, నీటి సంరక్షణకు 58 పనులు, మిగిలిన 58 పనులను మౌలిక వసతుల కేటగిరిలో చేర్చారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు తప్పనిసరిగా 60 శాతం ఖర్చు చేయాలన్న నిబంధనను తాజాగా జిల్లా ప్రాతిపదికగా అమలు చేయాలని, అలాగే నీటి సంరక్షణ కోసం 65 శాతం తక్కువ కాకుండా చేయాల్సిన పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కేవలం మండలానికే పరిమితం చేసింది. దీని ద్వారా భూగర్భ జలాలు తక్కువగా ఉండే మండలాల్లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పనులకన్నా.. నీటి సంరక్షణ పనులకే ప్రాధాన్యం ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. మన రాష్ట్రంలో మొత్తం 661 మండలాలుండగా.. వాటిలో ఏడు జిల్లాల పరిధిలోని 68 మండలాలను భూగర్భ జలాలు తక్కువగా ఉండే సున్నిత ప్రాంతాలుగా గ్రామీణాభివృద్ధి శాఖ పేర్కొంది.

ఇదేంది 'రొయ్యో'

- వ్యాధులు చుట్టుముడుతున్న వైనం
- వణికిస్తున్న వైట్గట్, వైట్స్పాట్
- రొయ్యల ఎదుగుదలలో మందగమనం
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన
- ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగు

కైకలూరు: శీతాకాలం రొయ్యల సాగు రైతుల పాలిట శాపంగా మారుతోంది. ఉష్ణోగ్రతల తగ్గుదల రొయ్యల పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వనామీ రొయ్యల సాగులో చలికాలం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల రాత్రి సమయంలో 18 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోవడం అధికారులు గుర్తించారు. ఇదిలా ఉంటే 2022 అక్టోబరన్ 17 నుంచి రొయ్యల ధరలను పెంచడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆక్వా ప్రాసెసింగ్ సంస్థల నిర్వాహకులు, వ్యాపారుల మధ్య ఒడంబడిక కుదిర్చి కనీస మద్దతు ధరను ప్రకటించింది. పండుగల పేరు చెప్పి ధరలు తగ్గాయని వ్యాపారుల చెబితే నమ్మి తక్కువకు విక్రయించవద్దని మత్స్యశాఖాధికారులు సూచిస్తున్నారు.

ఏటా రూ.38 వేల కోట్ల ఆదాయం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఏటా రూ.38 వేల కోట్ల ఆదాయం రొయ్యల సాగు ద్వారా వస్తుంది. ప్రధానంగా వనామీ సాగును రైతులు చేస్తున్నారు. పూర్వం చేపల సాగు అధికంగా ఉండగా తర్వాత కాలంలో రొయ్యల సాగు విస్తీర్ణం పెరిగింది. ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ (అప్సడా) ద్వారా ప్రభుత్వం రొయ్యల ధరల నియంత్రణకు కమిటీని ఏర్పాటుచేసింది. ఆక్వా జోన్ల పరిధిలోని చెరువులకు సబ్సిడీ విద్యుత్ను అందిస్తూ సాగును ప్రోత్సహిస్తోంది.

ఆక్సిజన్ సమస్య

శీతాకాలంలో రొయ్యల సాగు విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో రొయ్యల్లో బ్యాక్టీరియా లోడ్ పెరగడంతో పాటు తెల్లమచ్చల వ్యాధి, వైట్గట్, విబ్రియోసిస్, రన్నింగ్ మోర్టాలిటీ సిండ్రోమ్(ఆర్ఎంఎస్), డబ్ల్యూఎస్ఎస్వీ, పాకుడు వ్యాధి, మొప్ప వ్యాధులు వచ్చే అవకాశాలు అధిక శాతం ఉన్నాయి. ఇప్పటికే వైట్ గట్, వైట్ స్పాట్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. రొయ్యలకు 32 డిగ్రీల సెంటీగ్రేట్ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. శీతకాలంలో రాత్రి సమయం ఎక్కువగా ఉండటంతో ఆక్సిజన్ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా రొయ్యల చెరువుల్లో వైట్ గట్ వ్యాపిస్తోంది. రొయ్యలు విరోచనాలతో కూడిన తెల్లటి రెట్టను విడుస్తున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

- పగటిపూట ఏరియేటర్లు ఎక్కువగా తిప్పాలి.
- విటమిన్ 'సీ', ఫీడ్ ప్రొబయోటిక్స్ను అందుబాటులో ఉంచుకోవాలి.
- రొయ్యల చెరువులో 29 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండాలి.
- 18 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉంటే మేతలను నిలుపుదల చేయాలి.
- బోర్ వాటర్ను ఉపయోగించడం ఉత్తమం.
- ఎక్కువ లోతులో నీటిని చెరువుల్లో నింపాలి. దీని వల్ల త్వరగా నీటి ఉష్ణోగ్రత తగ్గదు.
- ప్రధానంగా సీడ్ (రొయ్య పిల్ల) కొనుగోలు సమయంలో నాణ్యమైన పిల్లలను ఎంపిక చేసుకోవాలి.
- శక్తిహీనంగా మరణించడానికి సిద్ధంగా ఉన్న రొయ్యలు, నీటిలో తేలుతున్న ఆహార విసర్జాలను గమనించాలి.
- రొయ్యల్లో రంగు, మొప్పలు, అన్నవాహిక, నల్లటి, తెల్లటి చుక్కలు, రొయ్య కవచం వదులు వంటి మార్పులను జాగ్రత్తగా పరిశీలించాలి.
- చెరువు రొయ్యల్లో తేడాలను గమనిస్తే ల్యాబ్లో పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారించుకోవాలి.



ఎరియేటర్లు ఎక్కువగా తిప్పాలి



శీతకాలంలో పగటి సమయం కంటే రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. రొయ్యలు 18 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉంటే ఆహారం తీసుకోవు. దీని వల్ల స్లో గ్రోత్ ఏర్పడుతోంది. రొయ్యలు వ్యాధుల బారినపడతాయి. మేతలు తీసుకోవు. మత్స్యశాఖ లాబోరేటరీల్లో తక్కువ ధరలకు పరీక్షలు చేస్తున్నారు. పీసీఆర్ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రొయ్యల రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–బి.రాజ్కుమార్, ప్రభుత్వ ఆక్వా ల్యాబ్ ఏడీ, కైకలూరు

ప్రత్యేక అధికారిని నియమించాలి



రొయ్యల మేతల్లో నాణ్యత ప్రమాణాలను కంపెనీలు పాటించడం లేదు. కొందరు సొంత పరిజ్ఞానంతో మేతలు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించాలి. మేతల కంపెనీల యజమానులు లాభాలు ఆర్జిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో రొయ్యల రైతులు నష్టాల పాలవుతున్నారు. నియంత్రణ చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలి.

–దండు రంగరాజు, రొయ్యల రైతు, కైకలూరు



వి.కోట మండలం తోటకనుమ వద్ద ట్రెల్లీస్ విధానంలో సాగు చేసిన డ్రాగన్ఫ్రూట్ తోట (ఇన్సెట్) తోటలో విరగ్గాసిన డ్రాగన్ ఫలాలు



పాతికేళ్ల పసిడి పంట

విదేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇప్పుడు మన ముంగిట్లో వాలింది. రైతు ఇంట పాతికేళ్ల బంగారు పంటగా మారింది. ఒకసారి సాగు చేస్తే 25 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది. చీడపీడల బెడద, నీరు, కూలీల ఖర్చు తక్కువ కావడంతో రైతాంగం ఈ డ్రాగన్పై మక్కువ చూపుతోంది. ఈ పంటకు మార్కెటింగ్ సదుపాయమూ ఉంది. అన్ని పండ్ల కంటే ధరలు అధికంగా ఉండడంతో రైతులకు లాభార్జన సులభతరమవుతోంది. దీంతోపాటు పోషకాలను పుష్కలంగా కలిగి ఉన్న ఈ పండు సాగుపై ప్రత్యేక కథనం.

పలమనేరు : రకరకాల వాణిజ్య పంటలు, మామిడి తోటల కంటే రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాన్ని అందించే కొత్త వంగడాలవైపు జిల్లాలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇన్నాళ్లు తైవాన్, వియత్నాం దేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లోనూ పండుతోంది. దీంతో మనకూ అందుబాటులోకి వచ్చేసింది. నాటిన తొలి ఏడాది మూడు నుంచి రూ.4 లక్షల పెట్టుబడి పెడితే రెండేళ్లలో ఆ మొత్తం వచ్చేస్తోంది. ఆపై 25 ఏళ్లపాటు ఏటా రైతులకు ఆదాయం వస్తుండడంతో ఇప్పుడు రైతులు డ్రాగన్ సాగుపై మక్కువ చూపుతున్నారు. పైగా ఈ పంటకు చీడపీడల బెడదలు కూలీల సమస్య తక్కువ. ముఖ్యంగా తక్కువ నీటి సౌకర్యమున్న రైతులకు వరం. రైతు పండించిన పంటకు తోటల వద్దే మార్కెటింగ్ సౌకర్యం ఉంది. మరోవైపు స్విగ్గీ, బిగ్బ్యాస్కెట్, రిలయన్స్ తదితర ఆన్లైన్ సంస్థలు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నాయి.

మంచి పోషకాలు కలిగిన ఫలం

డ్రాగన్ ఫ్రూట్కు విదేశాల్లో ధనికుల ఫలం అనే పేరుంది. కానీనేడు స్థానికంగా ఈ సాగు మొద లు కావడంతో తోటల వద్దే ఫలాలను విక్రయిస్తున్నారు. పండ్ల మార్కెట్లలోనూ ఇవి విరివిగా లభ్యమవుతున్నాయి. ఇందులో మధుమేహం, క్యాన్సర్, మంచిగా జీర్ణం, గుండెకు సంబంధించి, మంచి చర్మకాంతికి, జుట్టు పెరిగేందుకు, ఎముకల పుష్టికి మేలు చేస్తుందట.

- జిల్లాలో విస్తరిస్తున్న డ్రాగన్ఫ్రూట్ సాగు
- ఓ సారి నాటితే 25 ఏళ్లపాటు దిగుబడి
- తొలి రెండేళ్లలోనే పంట పెట్టుబడి చేతికి
- ప్రముఖ ఆన్లైన్ సంస్థల్లోనూ మంచి గిరాకీ

జిల్లాలో తొలిసారిగా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ములకల చెరువు, కలిచెర్ల, కంభంవారిపల్లి మండలాల్లో కొందరు ఔత్సాహిక రైతులు రెండేళ్లక్రితం డ్రాగన్ ఫ్రూట్ను సాగుచేశారు. అయితే మొట్టమొదట వీకోటకు చెందిన మోహన్రావు తన మూడెకరాల పొలంలో 8వేల మొక్కలను ట్రెల్లీస్ విధానంలో నాటారు. ఆయన సియాన్ రెడ్ అనే రకాన్ని హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ నుంచి 8వేల మొక్కలను తెప్పించారు. మొక్కకు రవాణా చార్జీలతో కలిపి రూ.76 ఖర్చయింది. ఆ లెక్కన 8 వేల మొక్కలకు రూ.6 లక్షలు, మొక్కకు ఊతంగా నిర్మించిన 420 సిమెంట్ స్తంభాలు రూ.550 చొప్పున రూ.2.3 లక్షలైంది. దీంతోపాటు ఎరువులు, దున్నకం, కూలీలు ఖర్చులతో మూడెకరాలకు రూ.10 లక్షలు ఖర్చయింది. అంటే ఎకరానికి రూ.3.3 లక్షలన్నమాట. పంటకు సత్తువగా గొర్రె, కోడి ఎరువు, ఆరు బస్తాల సింగిల్ సూపర్ఫాస్ఫేట్, ట్రైకో ధర్మావరిడి, సుడోమస్లను కలిపి మొక్కకు మక్కిరి మిశ్రమ ఎరువును మాత్రమే వాడారు. పంట నాటాక ఆరు నెలలకు అంటే జనవరిలో నాటితే జూన్లో పుష్పాలొచ్చాయి. ఆపై 21 రోజులకు తొలి కోత వచ్చింది. తొలికోతలో మూడెకరాలకు రెండు టన్నులు, రెండో కోతలో ఐదు టన్నులు, మూడో కోతలో 13 టన్నుల దిగుబడిని సాధించారు. మొత్తం మీద ఇప్పటికి 30 టన్నుల దాకా దిగుబడి వచ్చింది.

తోటవద్దకే వ్యాపారులు

తోట వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు ఆన్లైన్ వ్యాపార సంస్థలైన స్విగ్గీ, రిలయన్స్మార్ట్, బిగ్ బ్యాస్కెట్, రత్నజీత్ సూపర్ మార్కెట్ల నుంచి వీటికి మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం 400 గ్రాములున్న పండ్లు కిలో రూ.130 వరకు, 250 గ్రాములకంటే తక్కువున్న ఫలాలు కిలో రూ.70 వరకు ధరలు పలుకుతున్నాయి.

ట్రెల్లీస్ విధానంలో మొక్కల సాగు

ఇప్పటి వరకూ అనంతపూర్, కడప జిల్లాలో మొదలైన ఈ పంట మూడేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలోని కంభంవారిపల్లి మండలం చీనేపల్లిలో రైతు శ్రీనాథరెడ్డి, కలిచెర్లలో రహంతుల్లా, ములకల చెరువులో ఓ రైతు డ్రాగన్ఫ్రూట్ను సాగుచేశారు. స్తంభాలపై పాత బైక్టైర్లను వాడి ఎకరానికి రెండు వేల మొక్కలను సాగు చేశారు. అయితే ప్రస్తుతం ట్రెల్లీస్ విధానం ద్వారా ఎకరానికి రెండున్నర వేల నుంచి మూడు వేల మొక్కలను నాటుకోవచ్చు. దీంతో అదనపు దిగుబడి రావడంతో అధిక ఆదాయం వస్తోంది.

ముందు అధ్యయనం చేశా



నేను మూడెకరాల మెట్ట పొలంలో డ్రాగన్ ఫ్రూట్ను సాగుచేశా. ప్రస్తుతం కోతలు సాగుతున్నాయి. తోటవద్దే కాకుండా ఆన్లైన్ వ్యాపార సంస్థలకు విక్రయిస్తున్నా. ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. సముద్రమట్టానికంటే 1250 అడుగుల ఎత్తులో ఉన్నాం. దీంతో పంట ఉత్పత్తులు బాగున్నాయి. నేను పంటకు పెట్టిన పెట్టుబడి రెండేళ్లలో వచ్చేస్తుంది. ఆపై 25 ఏళ్ల వరకు తోటను బాగా చూసుకుంటే ఏటా దక్కేది లాభాలే కదా.

– డా.మోహన్రావు, రైతు, వీకోట

కొత్త పంటల సాగుతో మేలు



ఆహార, వాణిజ్య పంటలను పండించి గిట్టుబాటు గాని రైతులు ఇప్పుడు విభిన్నంగా ఆలోచిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రపంచంలోని పలు రకాల కొత్త వంగడాలు, పంటల సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో డ్రాగన్ఫ్రూట్ సాగుపై రైతులు ఆసక్తిని చూపడం మంచి పరిణామం. దీంతో పంట పెట్టుబడి తొలి ఏడాది ఎక్కువగా ఉన్నప్పటికీ ఆపై రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాలుంటాయి.

– మధుసూదన్రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు



వంచకుడై ధనము సంపాదించిన వానికంటె,
యథార్థముగా ప్రవర్తించు దరిద్రుడు వాసి.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం,
దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.1.47 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** స్వాతి రా.3.01 వరకు, తదుపరి విశాఖ,
వర్జ్యం: ఉ.7.35 నుండి 9.16 వరకు,
దుర్ముహూర్తం: సా.3.52 నుండి 4.35 వరకు, **అమృతఘడియలు:** సా.5.43 నుండి 6.54 వరకు, నరకచతుర్దశి, దీపావళి పండగ.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం : 5.22
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సచిన్ పైలట్ (కాంగ్రెస్ లీడర్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాజస్థాన్‌లో గత 25 ఏళ్లలో వరుసగా రెండోసారి బీజేపీ గెలవకపోబట్టి సరిపోయింది. లేకుంటే పాతికేళ్ల పాటు అశోక్ గెహ్లోతే కాంగ్రెస్ సీఎంగా ఉండిపోయేవారు. ఇప్పటి ఎన్నికలను కూడా కలుపుకొంటే ఈ 72 ఏళ్ల వయసులో సీఎంగా ఆయన తన 26వ ఏట లోకి ప్రవేశిస్తూ ఉండేవారు!

ఇరవై ఏళ్లకు మించి పార్టీ అధ్యక్షురాలిగా కొనసాగడానికి సోనియాజీ అయినా కాస్త మొహమాట పడ్డారు కానీ, 25 ఏళ్లుగా – పదవిలో ఉన్నా, లేకున్నా – సీఎం సీటును అంటిపెట్టుకునే ఉన్న గెహ్లోత్‌కి చిన్న ఫీలింగ్ కూడా ఏమీ ఉన్నట్లు లేదు! 'మళ్లీ నేనే సీఎం' అంటున్నారు.

అసలు మొట్టమొదట తన 47 ఏళ్ల లేబ్రాయంలో తనెలా సీఎం అయిందీ ప్రతి ఐదేళ్లకొకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ చెబుతుంటారు గెహ్లోత్. సోనియాజీ పార్టీ అధ్యక్షురాలు అవగానే తీసుకున్న తొలి నిర్ణయం తనను సీఎం చేయడమేనట!

"అప్పుడసలు నేను సీఎం క్యాండిడేట్‌ని కూడా కాదు. అయినప్పటికీ సోనియాజీ



పట్టుబట్టి, 'నేను చేయలేను మేడమ్' అంటున్నా వినకుండా నన్ను మందలించి మరీ సీఎంని చేశారు.." అని చెప్పుకోవటాన్ని ఆయన ఎంతగానో ఇష్టపడతారు.

ఇప్పుడు కొత్తగా మరొకటి మొదలు పెట్టారు. సీఎం సీటును వదిలేద్దామని తను ఎంత అనుకున్నా, సీఎం సీటు తనను ఎంతకూ వదలడం లేదట. ఇకముందు కూడా వదలదట! "అందుకే రాజస్థాన్‌లో వరుసగా రెండోసారి కాంగ్రెస్‌ను గెలిపించి ఆ చరిత్రాత్మక విజయాన్ని సోనియాజీకి గిఫ్ట్‌గా ఇస్తాను.." అని గెహ్లోత్ అంటున్నారు! ఆయనొక్కరే గెలిపిస్తారా రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ని వరుసగా రెండోసారి? గెలిపించడానికి పార్టీలో ఇంకెవరూ లేరా?!

నేనంటే పడని వాళ్లకు టికెట్ ఇచ్చి, నా వెంట ఉండే వాళ్లను పార్టీ వదిలి వెళ్లేలా చేసి.. "సచిన్‌కి, నాకు మధ్య విభేదాల్లేవ్.." అని చెప్పుకుంటున్నారు గెహ్లోత్!

విభేదాలు లేకుంటే... "నేను ఇవ్వొద్దని చెప్పినా శాంతి ధరీవాల్‌కి టికెట్ ఎందుకు ఇచ్చినట్లు? విభేదాలు లేకుంటే.. జ్యోతీ ఖండేల్‌వాల్‌కు, పండిట్ సురేష్ మిశ్రాకు ఎందుకు టికెట్ ఇవ్వనట్లు?

టికెట్ ఇవ్వలేదని జ్యోతి, మిశ్రా ఇద్దరూ బీజేపీలోకి వెళ్లిపోయారు. ముందు మిశ్రా వెళ్లిపోయారు. తర్వాత జ్యోతి వెళ్లిపోయారు. వెళ్లిపోయే ముందు మిశ్రాజీ నాతో అన్న మాట చాలా పదునుగా ఉంది.

"ఏం చెయ్యమంటారు సచిన్‌జీ? పార్టీలో మీ మాటకే విలువ లేనప్పుడు నాకు వేరే దారి ఏముంటుంది చెప్పండి?" అన్నారాయన!

అదే మాటను జ్యోతి వేరేలా అన్నారు. "పార్టీ కోసం ఎవరు ఎంత చేస్తున్నారన్నది కాంగ్రెస్‌కి లెక్క కాదు. పార్టీలో ఎవరు, ఏ లీడర్ వైపు ఉన్నారన్నది ముఖ్యం. ఆ లీడరంటే పైవారికి పడకపోతే ఇక ఆ లీడర్ వైపు ఉన్నవారికి పార్టీలో చిన్న పని కూడా దొరకదు..." అని ఆమె ఆవేదన చెందారు.

"కలిసి పని చేస్తున్నాం..." అని చెబుతూనే, గెహ్లోత్ తను చేసేది తను చేసుకుపోతున్నారు. సీఎం కుర్చీని పట్టుకుని వేళ్లాడుతూనే, కుర్చీనే తనను సీఎం అనే తాడుతో గట్టిగా కట్టేసుకుంది అని చెబుతున్నారు!


ఈ ఉదయం కొంతమంది అభ్యర్థులు నన్ను కలిసేందుకు వచ్చారు. "దీపావళి శుభాకాంక్షలు సచిన్‌జీ..." అంటూ.. "నిజమైన దీపావళి మీరు వేరే పార్టీ పెట్టినప్పుడే సచిన్ జీ..." అన్నారు! నన్నెంతగానో అభిమానించే నా అనుచరులు వాళ్లంతా.

"ఖర్గేజీ కాదు, గెహ్లోత్ కాదు... మీరే మా నాయకుడు సచిన్‌జీ..." అని కూడా వారు అన్నారు!! వారికి నాపై అంత అభిమానం ఉన్నప్పుడు... నాలో కొంచెమైనా ఆత్మాభిమానం లేకపోతుందా?

నవ్వాను. ఆలింగనం చేసుకున్నాను.

"దీపావళి శుభాకాంక్షలు ఆత్మీయులారా..." అని చెప్పాను.

పల్లవి... కాంగ్రెస్, చరణం... చంద్రబాబు!



జనతంత్రం



వర్ధెల్లి మురళి

తెలంగాణా కాంగ్రెస్ పార్టీ స్వరం మారుతున్నది. గాత్రంలో కొత్త గమకాలు పుట్టుకొస్తున్నాయి. లక్ష్యసిద్ధి కోసం బొంత పురుగునైనా ముద్దాడాలనేది కేసీఆర్ నుడివిన సూక్తి. దాన్ని మరింత ముందుకు తీసుకొనిపోతూ భస్మాసురుడి కౌగిట్లో చేరడానికి సిద్ధపడింది... గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కూటమి కట్టి తెలుగుదేశం పార్టీ పోటీ చేసింది. కనాకష్టంగా 3 శాతం ఓట్లు సంపాదించింది. ఆ మూడు శాతం ముచ్చట కోసం కాంగ్రెస్ పార్టీ తన తెలంగాణ రిమోట్ కంట్రోల్‌ను చంద్రబాబు చేతిలో పెట్టినట్టు కనిపిస్తున్నది.

కాంగ్రెస్ గెలుపు కోసం తెలుగుదేశం పోటీ నుంచి తప్పుకున్నది. ఈ సంగతి స్వయంగా చంద్రబాబే తనకు చెప్పినట్టు అప్పటి తెలంగాణా యూనిట్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టంగా చెప్పారు. పైకి కనిపించే దృశ్యం ఇది. దీపం ముందు శలభంలా కాంగ్రెస్ కోసం తెలుగుదేశం ఒక సారో పాత్రలో కనిపిస్తున్నది. కానీ సారం మాత్రం అది కాదు. పోచమ్మ గుడి ముందు కట్టేసిన బలి పొట్టేలు కాంగ్రెస్ పార్టీయే! లేని విశ్వసనీయతను చంద్రబాబుకు కట్టబెట్టడం కోసం, ఆయనకు తెలంగాణలో 'హోమ్లీ ఫీలింగ్'ను కలుగజేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం తనను తాను హననం చేసుకోవడానికి కూడా అది వెనుకాడటం లేదు.

తెలంగాణ ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకొని 'ఇండియా టుడే' జాతీయ న్యూస్ ఛానల్ వాళ్లు హైదరాబాద్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా ఇతర పార్టీల నాయకులతోపాటు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన రెండు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. వీటిపై తెలంగాణాలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. '1995లో చంద్రబాబు ప్రారంభించిన ఐటీ, ఫార్మా, ఔటర్ రింగ్ రోడ్, మెడికల్ హబ్ వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ కొనసాగించింద'ని ఆయన చెప్పారు. ఇదొక చర్చనీయాంశం.

భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) పద్ధతులతో రాచకొండ ప్రాంతంలో ఒక కొత్త నగరాన్ని 50 వేల ఎకరాల్లో నిర్మించడం రెండో వివాదాస్పద వ్యాఖ్య. చంద్రబాబు విఫల ప్రయోగం అమరావతిని ఈ సమీకరణ గుర్తుకు తెస్తున్నది. ఏదో యథాలాపంగా రేవంత్ రెడ్డి నోటి వెంట ఈ మాటలు వచ్చి ఉంటాయనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే రేవంత్ రెడ్డి వైపు నుంచి ఆ తర్వాత ఎటువంటి వివరణ రాలేదు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులెవరూ ఖండించలేదు. ఒక్క రేవంత్ రెడ్డికి మాత్రమే రెండు చోట్ల, అందులో ఒకటి ముఖ్యమంత్రి స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా రేవంత్ వ్యాఖ్యల్లో అభ్యంతరాలు కనిపించలేదు.

ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగానికి పాదు చేసిందెవరు? ఎనభయ్యో దశకం నాటి నుంచే తెలుగునాట సమాచార రంగంలో యెల్లో మీడియా గుత్తాధిపత్యాన్ని సంపాదించింది. అప్పటి నుంచి యెల్లో మీడియాకు తాను వలచింది రంభ, తాను మునిగింది గంగ! తెలుగు ప్రజలందరూ ఇటువంటి అభిప్రాయాలనే కలిగివుండి తీరాలి. వేరే మార్గం లేదు! ఆ దశలో చంద్రబాబు అనే కొయ్యగుర్రాన్ని సృష్టించి పరుగులరాణి పంచకల్యాణిగా లోకానికి పరిచయం చేశారు. 'ఐటీ రంగ సృష్టికర్త అతనే' అని డప్పు వేయించారు. ఈ డప్పుల మోత ఎంత ఉన్మాద స్థాయికి చేరిందంటే – చివరికి చంద్రబాబే అవన్నీ నమ్మి, తనను తాను ఐన్‌స్టీన్‌కు అన్నయ్యగా, న్యూటన్‌కు పాఠం చెప్పిన గురువుగా భ్రమపడేంతగా! రెండు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ సెల్‌ఫోన్, కంప్యూటర్ వగైరా వగైరాలను తానే కనిపెట్టాననే అపస్మారక మాటల నుంచి ఆయన బయటపడలేక పోవడానికి యెల్లో మీడియా డప్పుల మోతే కారణం.

వాస్తవానికి హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ఆద్యులెవరు? భవిష్యత్తులో ఐటీ రంగం పోషించబోయే పాత్రను అర్థం చేసుకున్న దార్శనికుడు... నాటి ప్రధాని పీవీ నరసింహారావు. 'సాఫ్ట్‌వేర్ పార్క్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. సహజంగానే ఆయనకు హైదరాబాద్‌పై ఉండే మక్కువతో మొదటి పార్క్‌ను హైదరాబాద్‌కు కేటాయించారు. ఇప్పుడు 'సైబర్ టవర్స్'గా మనం పిలుచుకుంటున్న భవంతికి 1993లోనే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి (కాంగ్రెస్) శంకుస్థాపన చేశారు. దాన్ని మరుగుపరిచి, ఆ ప్రాంతంలో తనకు కావలసిన వారు, బినామీలు భూములు కొనుగోలు చేసేంత వరకు మూడు నాలుగేళ్ల పాటు చంద్రబాబు జాగు చేశారు. ఈ ఆలస్యం కారణంగా ఐటీలో తొలిస్థానంలో ఉండవలసిన హైదరాబాద్‌ను బెంగళూరు అధిగమించింది. ఆ రకంగా హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చేసింది ద్రోహం!

వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తిన

వాస్తవానికి హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ఆద్యులెవరు? భవిష్యత్తులో ఐటీ రంగం పోషించబోయే పాత్రను అర్థం చేసుకున్న దార్శనికుడు... నాటి ప్రధాని పీవీ నరసింహారావు. 'సాఫ్ట్‌వేర్ పార్క్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. సహజంగానే ఆయనకు హైదరాబాద్‌పై ఉండే మక్కువతో మొదటి పార్క్‌ను హైదరాబాద్‌కు కేటాయించారు. ఇప్పుడు 'సైబర్ టవర్స్'గా మనం పిలుచుకుంటున్న భవంతికి 1993లోనే నాటి ముఖ్యమంత్రి ఎన్. జనార్దన్ రెడ్డి (కాంగ్రెస్) శంకుస్థాపన చేశారు. దాన్ని మరుగుపరిచి, ఆ ప్రాంతంలో తనకు కావలసినవారు, బినామీలు భూమలు కొనుగోలు చేసేంత వరకు మూడు నాలుగేళ్ల పాటు చంద్రబాబు జాగు చేశారు. ఈ ఆలస్యం కారణంగా ఐటీలో తొలిస్థానంలో ఉండవలసిన హైదరాబాద్‌ను బెంగళూరు అధిగమించింది. ఆ రకంగా హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చేసింది ద్రోహం!
వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తిన కూర్చున్నా ధోకా లేదంటారు. వర్తమాన చరిత్రను రికార్డు చేసే వార్తాపత్రికలకు చంద్రబాబు కావల్సినవాడయ్యారు. కనుక ఐటీని కనిపెట్టినవాడనే భుజకీర్తులను ఆయనకు తగిలించారు. 'కామమ్మ మొగుడంటే కామోసు' అనుకున్నట్టు ఆయన నిజంగానే తాను ఐటీ ఫౌండర్‌నని నమ్మడం మొదలుపెట్టారు.

కూర్చున్నా ధోకా లేదంటారు. వర్తమాన చరిత్రను రికార్డు చేసే వార్తాపత్రికలకు చంద్రబాబు కావల్సినవాడయ్యారు. కనుక ఐటీని కనిపెట్టినవాడనే భుజకీర్తులను ఆయనకు తగిలించారు. 'కామమ్మ మొగుడంటే కామోసు' అనుకున్నట్టు ఆయన నిజంగానే తాను ఐటీ ఫౌండర్‌నని నమ్మడం మొదలుపెట్టారు. కానీ కాంగ్రెస్ పార్టీ వారైనా వాస్తవాలను వెలుగులోకి తెచ్చి ఆ క్రెడిట్‌ను తీసుకోవాలి కదా? విచిత్రంగా కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్ వాళ్లే దీన్ని గుర్తించి క్రెడిట్‌ను కాంగ్రెస్‌కు ఇస్తున్నారు. కానీ కాంగ్రెస్ వాళ్లు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. ఈ గజమాల చంద్రబాబు మెడలోనే ఉండాలని తెగ ఉబలాటపడుతున్నారు. దాని కొనసాగింపే నిన్నటి 'ఇండియా టుడే' సమావేశంలో రేవంత్ చెప్పిన మాటలు.

చంద్రబాబు ప్రారంభించిన ఐటీతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును కూడా తాము కొనసాగించామని రేవంత్ చెప్పారు. సైబర్ టవర్స్‌కు కాంగ్రెస్ వాళ్లు శంకుస్థాపన చేస్తే, ఆలస్యం చేసైనా చంద్రబాబు నిర్మించి ప్రారంభించాడు. ఐటీ ప్రారంభంలో చంద్రబాబు పాత్ర కూడా ఉన్నదని చెబితే ఎంతో కొంత అతుకుతుంది. ఔటర్ రింగురోడ్డును బాబు తలకు ఎట్లా చుట్టేస్తారు? 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దాని ప్రకారం మియాపూర్ నుంచి శంషాబాద్ వరకు 150 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించాలి. మియాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు అప్పటికే రోడ్డు ఉన్నది. దాన్ని కొంచెం వెడల్పు చేస్తే సరిపోతుంది. అక్కడ నుంచి శంషాబాద్ వరకు 150 అడుగుల వెడల్పుతో 27 కి.మీ. రోడ్డును కొత్తగా వేయాలి. ఇది ప్రకటన మాత్రమే! కాగితం కదిలిందీ లేదు. సర్వే జరిగిందీ లేదు. ఈ నోటిఫికేషన్ కూడా హైదరాబాద్ పడమటి ప్రాంతాన్ని మాత్రమే కవర్ చేస్తుంది.

నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలనే ప్రతిపాదన వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవం పోసుకున్నది. 500 అడుగుల వెడల్పుతో, 175 కి.మీ. పొడవునా నిర్మించాలని సంకల్పించి, సర్వేలను ముగించి, శరవేగంగా భూసేకరణను కూడా పూర్తి చేసింది ఆయన హయాంలోనే! ఈ భూసేకరణ సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వంతో రామోజీరావు కయ్యానికి దిగి, 'పెద్దలా? గద్దలా..?' పేరుతో విషప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన భూముల్లో కొద్ది భాగం రోడ్డు కోసం సేకరించవలసి వచ్చింది. దాన్ని మినహాయించాలంటే రోడ్డు వంకర తిరగాలి. సాంకేతికంగా ఇది సాధ్యమయ్యే పని కాదు గనుక ఆయన సలహాను వైఎస్సార్ ప్రభుత్వం మన్నించలేకపోయింది. దాంతో ప్రభుత్వంపై ఆయన యుద్ధాన్ని ప్రకటించారు. భూసేకరణ దశలోనే జరిగిన ఈ రభస ఇప్పటికే చాలామందికి గుర్తే!

భూసేకరణ పూర్తి చేయడమే గాక రోడ్డు నిర్మించడంలో కూడా 90 శాతాన్ని రాజశేఖరరెడ్డి పూర్తి చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వం మిగతా భాగాన్ని పూర్తి చేసి సుందరీకరణ, విద్యుదీకరణ వంటి పనులను చేపట్టింది. వాస్తవాలు ఇలా వుంటే ఔటర్ రింగ్ రోడ్డులో ఎటువంటి పాత్ర లేని చంద్రబాబు ఖాతాలో దాన్ని వేయడం యెల్లో మీడియాకు, తెలుగుదేశం వీరాభిమానులకు మాత్రమే సాధ్యమయ్యే సాహసం. ఈ సాహస పోటీలో వాళ్లను తలదన్నేలా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నది. తాము మాత్రమే సొంతం చేసుకోవాల్సిన ప్రతిష్ఠలో అర్ధ భాగాన్ని చంద్రబాబుకు సమర్పించేందుకు వారు సిద్ధపడుతున్నారు.

మహాభారతంలో ద్రోణాచార్యుడు, పాంచాల రాజైన ద్రుపదుడు బాల్యస్నేహితులు. కష్టాల్లో ఉన్న ద్రోణుడు ఒకసారి సాయం కోసం ద్రుపదుడి దగ్గరకు వెళ్లాడట. ద్రుపదుడు అవమానించి పంపాడు. ఆ కోపాన్ని చానాళ్లపాటు ద్రోణుడు కడుపులో దాచుకున్నాడు. కురు, పాండవ రాకుమారులకు విద్య నేర్పిన తర్వాత కడుపులోని అక్కసును వాళ్ల ముందు ద్రోణాచార్యుడు వెళ్లగక్కాడు. వెంటనే అర్జునుడు బయల్దేరి ద్రుపదుణ్ణి బంధించి తెచ్చి గురువు ముందు నిలబెడతాడు. ఆ విధంగా గురుదక్షిణ చెల్లిస్తాడు. చంద్రబాబు తాను వేసుకున్న విజనరీ ముసుగుకు అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఘోర అవమానం జరిగింది. ఆ ప్రాజెక్టు ఆచరణ సాధ్యమయ్యేది కాదన్న అభిప్రాయం రోజురోజుకూ బలపడుతున్నది. తనను నమ్మి పెట్టుబడులు పెట్టిన కష్టమర్ల నుంచి ఒత్తిడి ఎదురవుతున్నది. ఈ దశలో ప్రాజెక్టు ఆచరణ సాధ్యమేనన్న ఊరట దొరకాల్సిన అవసరం బాబుకు ఏర్పడి ఉండవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఓ గ్రీన్ ఫీల్డ్ సిటీ ఏర్పాటును ప్రకటిస్తే చంద్రబాబుకు బోలెడంత ఊరట. తన విజన్‌ను పక్క రాష్ట్రాలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఓ గ్రీన్ ఫీల్డ్ సిటీ ఏర్పాటును ప్రకటిస్తే చంద్రబాబుకు బోలెడంత ఊరట. తన విజన్‌ను పక్క రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పుకోవచ్చు. కేవలం ప్రకటన చాలు. ఆ తర్వాత కొంచెం ప్రచారం చాలు. అంతకు మించి అది ముందుకు కదిలే అవకాశాలు లేవు. ఈ ప్రకటనతో లాభపడే మొదటి వ్యక్తి రామోజీరావు. ఔటర్ రింగ్ రోడ్డుకూ, రాచకొండ గుట్టలకు మధ్యన రామోజీ ఫిలిం సిటీ ఉంటుంది. పక్కనే రాచకొండ నగరం ప్రచారంతో తన ఫిలిం సిటీ భూముల విలువ పెరుగుతోంది. ఒకప్పుడు లక్ష నాగళ్లతో ఫిలిం సిటీని దున్నేయాలన్న నినాదాల బదులు లక్షల కోట్ల విలువైన ల్యాండ్ బ్యాంక్‌గా అది మారుతోంది. ఆ భూముల చట్టబద్ధత, వివాదాలు వగైరా వేరే అంశం.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సారథి రేవంత్ రెడ్డికి పూర్వాశ్రమంలో చంద్రబాబు గురువు. చంద్రబాబుకు రామోజీ గురువు. రాచకొండ నగర ప్రకటన ఈ గురుపరంపర కోరిన దక్షిణ కావచ్చు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానానికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకూ ఎందుకు పట్టడం లేదు? ఎవరి అవసరాలు వారివి!

కూడా అనుసరిస్తున్నాయని చెప్పుకోవచ్చు. కేవలం ప్రకటన చాలు. ఆ తర్వాత కొంచెం ప్రచారం చాలు. అంతకు మించి అది ముందుకు కదిలే అవకాశాలు లేవు. ఈ ప్రకటనతో లాభపడే మొదటి వ్యక్తి రామోజీరావు. ఔటర్ రింగ్ రోడ్డుకూ, రాచకొండ గుట్టలకూ మధ్యన ఫిలిం సిటీ ఉంటుంది. పక్కనే రాచకొండ నగరం ప్రచారంతో తన ఫిలిం సిటీ భూముల విలువ పెరుగుతోంది. ఒకప్పుడు లక్ష నాగళ్లతో ఫిలిం సిటీని దున్నేయాలన్న నినాదాల బదులు లక్షల కోట్ల విలువైన ల్యాండ్ బ్యాంక్‌గా అది మారుతోంది. ఆ భూముల చట్టబద్ధత, వివాదాలు వగైరా వేరే అంశం.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సారథికి పూర్వాశ్రమంలో చంద్రబాబు గురువు. చంద్రబాబుకు రామోజీ గురువు. రాచకొండ నగర ప్రకటన ఈ గురుపరంపర కోరిన దక్షిణ కావచ్చు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానానికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకూ ఎందుకు పట్టడం లేదు? ఎవరి అవసరాలు వారివి! గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు భారీగా ఆర్థిక సాయాన్నందించినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అంతకు ముందు జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఖర్చు బాధ్యతను ఆయన తీసుకున్నందువల్లనే పొత్తు కుదిరిందన్న విషయం కూడా విదితమే. ఇప్పుడు కూడా ఆ బాధ్యతను కర్ణాటక కాంగ్రెస్‌తో పాటు బాబు వర్గం కూడా తీసుకున్నట్టు సమాచారం.

ఇటీవల కొందరు సినీ ప్రముఖులు, వ్యాపారులు, ఇతర రంగాల వారూ సుమారు 150 మంది హైదరాబాద్‌లోని ఓ క్లబ్‌లో సమావేశమై రాజకీయ చర్చలు జరిపినట్టు సమాచారం వచ్చింది. వీరిలో కొందరు అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో భూములు కొనుగోలు చేసినవారున్నారు. ఇంకొందరు తెలుగుదేశం పార్టీతో వ్యాపార, సామాజిక సంబంధాలున్నవారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలనీ, అందుకు అవసరమైన 'సహకారాన్ని' అందించాలనీ కూడా వారు తీర్మానించినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా వారు ఆశించేది కూడా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని కొంచెం పైకి లేపే జాకీ కావాలి. అమరావతి వెంచర్‌లో చిన్నపాటి కదలికైనా రావాలి. కర్ణుడి చావుకు ఆరు కారణాలన్నట్టు రాచకొండ ప్రకటనకు కూడా ఇటువంటి అనేక కారణాలుండవచ్చు. నగర రియల్ ఎస్టేట్ అవసరాలకు అత్యంత చేరువలో ట్రిపుల్ వన్ జీవో పరిధిలో లక్ష ఎకరాలు సిద్ధమవుతున్న సమయంలో డిమాండ్‌ను మించిన సప్లై అందుబాటులోకి వచ్చింది. రాచకొండ సిటీ ఆచరణాత్మకమవుతుందని ఎవరూ భావించడం లేదు. భావించాల్సిన అవసరం కూడా లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కావలసింది అరచేతిలో వైకుంఠం చూపడమే! అమరావతిలో బాబు చూపిన వైకుంఠం వికటించింది. ఇప్పుడు కాంగ్రెస్ 'హస్తం'లో దాన్ని కొత్తగా చూపించాలి. మెడికల్ బెయిల్ మీద హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు తక్షణ మిషన్ ఇదే! క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం నాలుగు వారాల సమయం కావాలని బాబు న్యాయవాదులు గట్టిగా వాదించి 28వ తేదీ దాకా మెడికల్ బెయిల్ తెచ్చుకున్నారు. తెలంగాణలో ఎన్నికల ప్రచార ఘట్టం ఆ రోజున పూర్తవుతుంది.

vardhelli1959@gmail.com

ఇరాక్‌తో ఒకలా! ఇజ్రాయెల్‌తో మరోలా!!

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

పాలస్తీనాలో భాగమైన గాజా రాజ్యరహిత పరిస్థితి... దాన్ని పాలిస్తున్న హమాస్‌ను తీవ్రవాదంలోకి నెట్టింది. ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా బందీలను వదలమన్న ఐక్యరాజ్య సమితి 194వ తీర్మానాన్ని ఇజ్రాయెల్ ఖాతరు చేయలేదు. పైగా పాలస్తీనాను ఆక్రమించింది. తీవ్ర నిరసనలతో 2023 అక్టోబర్ ఏడున హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇజ్రాయెల్ గాజాపై ప్రతీకార యుద్ధానికి దిగింది. ఈ చర్యను అనేక దేశాలు ఖండించాయి.

గతంలో భద్రతా మండలి 1441వ తీర్మానాన్ని 2002 నవంబర్ 8న ఏకగ్రీవంగా ఆమోదించింది. అనేక తీర్మానాల్లో నిర్ధారించినట్లు తన నిరాయుధీకరణ బాధ్యత నిర్వహణకు సద్దాం హుస్సేన్‌కు ఈ తీర్మానం తుది అవకాశాన్నిచ్చింది. 687వ తీర్మాన యుద్ధ విరమణ ఆదేశాన్ని ఇరాక్ పాటించలేదనీ, విధ్వంసక నిషిద్ధ ఆయుధాలను సంపాదించి, నిషేధిత క్షిపణులను తయారు చేసిందనీ, 1990–91లో కువైట్ ఆక్రమణలో తన సైనిక దోపిడీకి పరిహారం నిరాకరించిందనీ ఆరోపించింది. ఇరాక్ తప్పుడు వ్యాఖ్యానాలు, సమర్థనలు, ఈ తీర్మాన అమలు వైఫల్యం ఇరాక్ బాధ్యతల ఉల్లంఘన అని హెచ్చరించింది.

ఈ తీర్మానంలో ఇరాక్‌పై యుద్ధ ప్రసక్తి లేదు. ఐరాస పర్యవేక్షణ, పరిశీలన, తనిఖీ కమిషన్, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలను ఇరాక్ అనుమతించాలని పేర్కొన్నారు. 2002 సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్ ఐరాస సాధారణ సభలో ఇరాక్ తప్పులను చదివారు. ఆ తప్పులు: ఐరాస భద్రతా సమితి 1373వ (ఉగ్రవాద నిరోధక) తీర్మానాన్ని ఇరాక్ ఉల్లంఘించింది. ఇరాన్, ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలపై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలకు మద్దతిస్తోంది. అఫ్గానిస్తాన్ నుంచి తప్పించుకున్న అల్ ఖైదా ఉగ్రవాదులు ఇరాక్‌లో ఉన్నారు. ఐరాస మానవ హక్కుల కమిషన్ 2001లో ఇరాక్‌లో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలను గమనించింది. ఇరాక్‌లో జీవ, రసాయన ఆయుధాలు, దీర్ఘ లక్ష్య క్షిపణుల తయారీ, ఉపయోగం ఐరాస తీర్మానాల అతిక్రమణ. ఐరాస పథకం ఆహారానికి చమురు డబ్బుతో ఇరాక్ ఆయుధాల కొనుగోలు.

భద్రతా మండలిలో వీటో హక్కు, శాశ్వత సభ్యత్వమున్న రష్యా, చైనా, ఫ్రాన్స్‌లకు ఇరాక్‌పై అమెరికా యుద్ధానికి దిగుతుందన్న అనుమానముంది. తీర్మానంలో తీవ్ర పరిణామాలు, పాదార్థిక ఉల్లంఘనలు వంటి పదాలు యుద్ధానికి దారితీయరాదని, ఇరాక్‌పై చర్యకు మరొక తీర్మానం అవసరమని రష్యా, ఫ్రాన్స్‌లు వాదించాయి. 1441వ తీర్మాన ముసాయిదాను తయారుచేసిన అమెరికా,



ఇంగ్లండ్‌లు, తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన ఏకైక అరబ్బు దేశం సిరియా, ఈ తీర్మాన లక్ష్యం ఇరాక్ నిరాయుధీకరణని, దానికి ఇరాక్ సహకరించకపోతే భద్రతా మండలి తర్వాతి కార్యక్రమాన్ని నిర్ణయించాలని అన్నాయి. ఇరాక్ 2002 నవంబర్ పదమూడున తీర్మానాన్ని అంగీకరించింది. అమెరికా (ఐరాస) తీర్మాన ఆరోపణలు రుజువు కాలేదని ఐరాస తనిఖీ అధికారులు 2002 నవంబర్‌లో నివేదించారు. అదే ఏడాది డిసెంబర్‌లో ఇరాక్ 12 వేల పేజీల ఆయుధ నివేదికను ఇచ్చింది. ఏ ఐరాస సభ్య దేశమూ యుద్ధానికి అనుకూలం కాదు.

అమెరికా, ఇంగ్లండ్‌లు చాలా తారుమారు పనులు చేశాయి. ఒకటి రెండు దేశాలు ఐరాస భద్రతా మండలిని ఆదేశించలేవని ఐరాస సభ్య దేశాలు ప్రకటించాయి. ఇరాక్‌పై యుద్ధం అసమ్మతమని న్యాయ కోవిదులు తమ అభిప్రాయాలను తెలిపారు. అయినా 2003 మార్చి 19న అమెరికా ఇరాక్‌పై యుద్ధానికి దిగింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలండ్‌లు ఇరాక్‌పై యుద్ధం చేశాయి. 2003 మే వరకు వరకు యుద్ధం సాగింది. ఇరాక్ సర్వనాశనమైంది. సద్దాం హుస్సేన్‌ను బంధించి ఉరిదీశారు. ఐరాస ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ ఇరాక్‌పై యుద్ధం చట్టవ్యతిరేకమనీ, ఐరాస వ్యవస్థాపక ఒప్పంద ఉల్లంఘననీ 2004 సెప్టెంబర్‌లో ప్రకటించారు.


యుద్ధనివారణ కోసం ఐరాస సభ్య దేశాలు ఒక దేశంపై మరొక దేశం దాడిని ఆపాలన్నది రెండవ ప్రపంచ యుద్ధ విధ్వంసం తర్వాత ఏర్పడ్డ ఐరాస ప్రధాన లక్ష్యం. ఇజ్రాయెల్ ఐరాస సభ్య దేశం. పాలస్తీనా, వాటికన్ నగరం ఐరాస పరిశీలన దేశాలు. యుద్ధ నిరోధంలో పాలస్తీనా కంటే ఇజ్రాయెల్‌పై ఎక్కువ బాధ్యత ఉంది.

అంతర్జాతీయ మానవత్వ చట్టాలను పాటించి, మానవత్వంతో గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలనీ, ప్రజలకు అత్యవసర ఆహార, ఔషధాలను అందించాలనీ, బందీలను వదలాలనీ ఐరాస సర్వసభ్య సాధారణ సభ 2023 అక్టోబర్ 27న తీర్మానించింది. ఈనాటికీ ఈ తీర్మానాన్ని ఇజ్రాయెల్ అమలు చేయలేదు. యుద్ధాన్ని ఆపలేదు. అమెరికా... ఇజ్రాయెల్ పక్షం వహిస్తోంది. కనీసం తాత్కాలిక విరామాన్ని పాటించమని అమెరికా మిత్ర దేశాలే కోరాయి. ఐరాస 1441వ తీర్మాన చట్టవ్యతిరేక దుర్వినియోగానికి, ఐరాస ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడ్డ అమెరికా, అలాగే ఇరాక్‌పై యుద్ధంలో పాల్గొన్న ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలండ్‌లు నేటి ఐరాస తీర్మానాన్ని ఎందుకు అమలు చేయించవు? ఇరాక్‌ను కక్షతో శిక్షించిన అమెరికా మానవత్వంతో ఇజ్రాయెల్‌ను ఎందుకు దండించదు?

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 9490 20 4545

అభేదం

సహజ కవి, భక్త కవి బమ్మెర పోతన పరమ శివ భక్తుడు. అయినా మహా భాగవత రచన చేయాలనే సంకల్పంతో ఒకరోజు పవిత్ర గౌతమీ గంగలో స్నానం చేసి, ఎత్తయిన ఇసుక తిన్నె మీద మహేశ్వర ధ్యానంలో నిశ్చలంగా కూర్చున్నాడు. సీతా సమేతుడైన రామచంద్రుడు పోతన ధ్యానంలో సాక్షాత్కరించాడు. తనకు అంకితంగా మహా భాగవతాన్ని తెలుగు చేయమన్నాడు. పోతన భాగవతం రచించి 'హరికి



నందగోకుల విహారికి' శ్రీకృష్ణునికి సమర్పణం చేశాడు. ఇది అత్యద్భుతం. ఆశ్చర్యకరం.

శ్రీమన్నారాయణుని కథలు రాయాలనుకున్న పోతన తన ఇష్ట దైవం శివుని ధ్యానించాడు. శివుని ధ్యానిస్తున్న అతనికి శ్రీరాముడు ఎలా ప్రత్యక్షమయ్యాడు? శ్రీరాముడు తన కివ్వమన్న కృతిని పోతన కృష్ణునికి అంకితం చేయటం ఏమిటి? ఈ మహా మాయా నాటకమంతా శ్రీహరికి, శివునికి, రాముడికి, కృష్ణునికి అభేదం చెప్పటానికే! దేవుడు ఒక్కడే. ఆ యా రూపాలన్నీ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలకు భగవంతుడు ఆ యా సందర్భాలలో దాల్చిన రూపాలే అని చెప్పటానికే!

ఆనాటి సమాజంలో చెలరేగిన శైవ, వైష్ణవ పరస్పర సంఘర్షణను శాంతింప చేయటానికి, సమరస భావాన్ని నెలకొల్పటానికి పోతన హరిహరాద్వైత భావనను చెప్పాడు. తిక్కన హరి హర నాథునికి తన భారతాన్ని అంకితం చేసి శివ కేశవ అభేదాన్ని చాటి చెప్పాడు. మహా కవుల చర్యలు, రచనలు సమాజ శ్రేయస్సు, లోక కల్యాణాల కోసమే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

జగనన్న విద్యా దీవెనకు ఉమ్మడి ఖాతాలు

సాక్షి, అమరావతి: చదువులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాదీవెన (జేవీడీ) పథకానికి తల్లితో పాటు విద్యార్థికీ ఉమ్మడిగా బ్యాంకు జాయింట్ అకౌంట్ ఉండాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే ఆ మొత్తాన్ని జమచేస్తున్నారు. ఇకపై జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనలో లబ్ధిదారులైన విద్యార్థులు తమ తల్లితో కలిసి ఉమ్మడి ఖాతా తెరవాలి. కొత్తగా తెరిచే ఈ ఖాతాలో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారుగాను, తల్లి ద్వితీయ ఖాతాదారుగాను ఉండాలి. ఇప్పటికే విద్యార్థికి ఉంటే తల్లిని లేదా తల్లికి ఉండే ఖాతాలో విద్యార్థిని చేర్చి ఉమ్మడి ఖాతాగా మార్చవచ్చు. తల్లులతోపాటు విద్యార్థులకూ బాధ్యత ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎస్సీ విద్యార్థులకు, చివరి సంవత్సరం విద్యార్థులకు జాయింట్ ఖాతా అవసరంలేదు. ఈ ఉమ్మడి ఖాతా వివరాలను నాలుగో విడత జగనన్న విద్యాదీవెన పథకం నగదు విడుదల కోసం వారి పరిధిలోని సచివాలయాల్లో అందించాలి. ఈ నెల 24లోగా కొత్త ఖాతాలు తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు షెడ్యూల్ను రూపొందించి జిల్లా కలెక్టర్లు శాఖల వారీగా పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఏయూలో కో క్రియేటివ్ కార్నర్ ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఏయూలో నెలకొల్పిన నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) భవనం మొదటి అంతస్తులో కో క్రియేటివ్ కార్నర్‌ని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాస్కామ్ సీవోఈలోకి ఏయూ విద్యార్థులను ఆహ్వానించాలని, ఇక్కడి స్టార్టప్ విజయాలను వారితో పంచుకోవాలని సూచించారు. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్ మాట్లాడుతూ తాము రాష్ట్రంలో 47 ఇంక్యుబేటర్స్‌లో కలసి పనిచేస్తున్నట్లు చెప్పారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు



ఆజాద్ జయంతి వేడుకల్లో నేతలు

సాక్షి, అమరావతి: భారత తొలి విద్యాశాఖ మంత్రి, 'భారతరత్న' మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ అబుల్ కలామ్ ఆజాద్ సూచించిన విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో పేదరికాన్ని పోగొట్టేలా మంచి పాలన అందిస్తున్నారని ప్రశంసించారు. పలువురు మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

బాబు హయాంలో ఖజానా నిలువుదోపిడీ

ఎంపీ మార్గాని భరత్‌రామ్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఖజానాను నిలువునా దోచుకుని ప్రజలను, రాష్ట్రాన్ని నట్టేట ముంచేశారని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ పేదల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.2.40లక్షల కోట్లు అందించారని చెప్పారు. ఇదే పని చంద్రబాబు హయాంలో ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు మళ్లీ అధికారాన్ని అప్పగిస్తే రాష్ట్రాభివృద్ధి తిరోగమనం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అల్లర్లకు 'బెయిల్ బాబు' కుట్రలు

1,140 రోజు దీక్షల్లో బహుజన నేతలు



తాడికొండ: టీడీపీ అధినేత చంద్రబాబు తాత్కాలిక బెయిల్ తెచ్చుకుని బయట తిరుగుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలకు పాల్పడుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 1,140వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రబాబును బయటకు వదిలితే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని చెప్పారు. నాయకులు పులిదాసు, న్యాయవాది పెరికె వరప్రసాద్, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పాల్గొన్నారు.

విద్యా తేజం ఆంధ్రా విశ్వవిద్యాలయం



ఆంధ్రా యూనివర్సిటీకి తొలిసారిగా నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్

36 యూజీ, 118 పీజీ, 57 పీహెచ్‌డీ, 11 డిప్లొమా కోర్సులతో టాప్ వర్సిటీల్లో ఒకటిగా ఏయూ

(సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం)

ఉన్నతమైన, ప్రకాశవంతమైన చదువులకు ప్రతీకగా... 'తేజస్వినావధీతమస్తు' అనే సమున్నత ఆశయంతో ఏటా వేలాది మంది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దుతున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం దేశంలోనే అత్యున్నత వర్సిటీల్లో ఒకటిగా నిలిచింది. సాగర తీరంలో, విశాలమైన ప్రాంగణంలో, ప్రశాంత వాతావరణంలో అత్యున్నత వసతులు, ప్రమాణాలతో విద్యనందిస్తూ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్)ను మెప్పించి, ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ పొందింది. నాక్ ఏయూలోని వసతులను ప్రత్యక్షంగా పరిశీలించి ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను మంజూరు చేసింది. దేశంలో అత్యున్నత కోర్సులు, బోధన, సౌకర్యాలు, కలిగిన అతి కొద్ది యూనివర్సిటీలకు దక్కే ఈ గ్రేడ్‌ను ఏయూ కూడా సాధించడం విశేషం. దేశంలో 3.74 స్కోర్ బెంగళూరు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలతో పాటు ఆంధ్రా యూనివర్సిటీకి మాత్రమే దక్కింది. టాప్ స్కోర్ దక్కిన నేపథ్యంలో 2030 వరకూ వర్సిటీకి ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ ఉండనుంది. ఈ ర్యాంకులను అధికారికంగా ఈ నెల 14న ప్రకటించనున్నట్టు తెలిసింది.

ఏయూ చరిత్రలో తొలిసారిగా..

నాలుగు పుస్తకాల్లోని పాఠాలు బోధించి, మార్కులతో కూడిన పట్టాని చేతిలో పెట్టి పంపించే రోజులకు స్వస్తి చెబుతూ.. యూనివర్సిటీ ఇటీవలి కాలంలో విద్యార్థి అభివృద్ధికి మార్గదర్శిగా.. పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలతో చదువుకు సహకారం అందిస్తూ.. ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దుతూ జాతీయ స్థాయిలో అత్యున్నత స్థానం పొందింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం 2002లో తొలిసారిగా 86.05 స్కోర్‌తో నాక్ ఏ గ్రేడ్ పొందింది. తరువాత 2008లో 3.64తో ఏ గ్రేడ్‌ను, 2016లో 3.6 స్కోర్‌తో మరోసారి ఏ గ్రేడ్‌ను సాధించింది. తాజాగా జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ని పొందింది. ఏయూలో అత్యుత్తమ విద్యా విధానాలకు, సమర్థతకు ఈ ర్యాంకు నిదర్శనం. రానున్న ఆరేళ్ల కాలానికి ఈ ర్యాంకు యూనివర్సిటీకి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలుస్తుంది.

మూడు రోజులు క్షుణ్ణంగా పరిశీలన

ఈ నెల 4, 5, 6 తేదీలలో ఏయూలో నాక్ బృందం పర్యటించింది. వర్సిటీలో మౌలిక వసతులు, బోధన ప్రగతి తదితర అంశాలను కమిటీ సభ్యులు ప్రత్యక్షంగా, క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టి, నిర్వహిస్తున్న స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్, యోగా, సైకాలజీ, స్పోర్ట్స్ విభాగాలతో పాటు విభిన్న విభాగాలలో సాధిస్తున్న ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. 4.0 స్కేల్ పై 3.74 స్కోర్‌ను అందిస్తూ.. ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ మంజూరు చేశారు.

ఈ విజయం వెనుక సీఎం వైఎస్ జగన్

ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంతటి ఘనవిజయం సాధించడం వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికత ఉంది. విశ్వవిద్యాలయాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దాలన్న సీఎం జగన్ ఆకాంక్షలకు, ఆలోచనలకు అనుగుణంగా పలు మార్పులు చేస్తున్న వైస్ చాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి కృషి ఉంది. వీరిద్దరూ కలిసి గత నాలుగేళ్లుగా వర్సిటీలో పలు సంస్కరణలు తెచ్చారు. విశ్వవిద్యాలయాల్లో ఎన్నడూ లేని విధంగా స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్లు నెలకొల్పడం, చైర్ ప్రొఫెసర్లని ఏర్పాటు చేయడం తదితర మార్పులు చేశారు. సమాజ ఉపయుక్తంగా, పరిశ్రమల అవసరాలు తీర్చే వైవిధ్య పరిశోధన కేంద్రంగా మార్చారు. ఇంజనీరింగ్‌తో సమానంగా సైన్స్, ఆర్ట్స్ కోర్సులను ఉపాధి కల్పించేవిగా రూపుదిద్దారు. ప్రపంచంలోని ఏ పరిశ్రమకైనా అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దేలా యూనివర్సిటీ రూపాంతరం చెందింది. విశ్వవిద్యాలయంలో చేరే ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ఈ సంస్కరణలు ఊతమిస్తున్నాయి. ఇక్కడ చదివే ప్రతి విద్యార్థీ ఉన్నత సంస్థల్లో ఉపాధి పొందేలా విద్యా ప్రణాళికలను రూపొందించారు. దీంతో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇప్పటివరకు ఆంధ్రా యూనివర్సిటీ 100 పేటెంట్స్ కోసం దరఖాస్తు చేసింది. ఇక్కడి స్టార్టప్ సెంటర్‌లో 150 స్టార్టప్స్ ప్రారంభమయ్యాయి. ఇవన్నీ విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాయి. విశ్వవిద్యాలయం ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించి, దేశంలో ఉన్నత స్థానాన్ని పొందడంపై వీసీ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, రెక్టార్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఏయూలో కోర్సుల వివరాలు..

- యూజీ ప్రోగ్రామ్స్ - 36
- పీజీ ప్రోగ్రామ్స్ - 118
- పీహెచ్‌డీ - 57
- పీజీ డిప్లొమా - 03
- డిప్లొమా - 08
- సర్టిఫికెట్/అవేర్‌నెస్ - 03
- టీచింగ్ స్టాఫ్ - 538 మంది
- నాన్ టీచింగ్ స్టాఫ్ - 2,270 మంది
- విద్యార్థులు - 10,338 మంది

గిరిజన వర్సిటీ మాస్టర్ ప్లాన్ రెడీ

- తొలి విడతగా భవన నిర్మాణాలకు రూ.300.50 కోట్ల కేటాయింపు
- 25 విభాగాలు, 40 తరగతి గదులు
- వెయ్యిమందికి సరిపడేలా ఆడిటోరియం
- వచ్చే విద్యాసంవత్సరం నూతన భవనాల్లోనే తరగతులు


యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లా మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లోని 562 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో యూనివర్సిటీ నిర్వహణకు అవసరమైన.. విస్తరణకు అనువుగా భవనాల నిర్మాణ ప్రతిపాదనలను ఉన్నతాధికారుల అనుమతి కోసం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి పంపించారు. తొలివిడతగా కేటాయించిన రూ.300.50 కోట్ల వ్యయంతో యూనివర్సిటీకి ప్రాథమికంగా అవసరమైన నిర్మాణాలు చేపట్టనున్నారు. వర్సిటీలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కోర్సులకు చెందిన 20 విభాగాల్లో ప్రతి ఐదింటికి 10 చొప్పున 40 తరగతి గదులు నిర్మిస్తారు. విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా 500 మందికి సరిపడేలా వసతి గృహాలు, వెయ్యి మందికి సరిపడే ఆడిటోరియం, 300 మంది సామర్థ్యం గల మరో ఆడిటోరియం, అడ్మినిస్ట్రేషన్ భవనం, సెంట్రల్ లైబ్రరీ, స్కిల్ సెంటర్, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నివాస భవనాలు 100 చొప్పున నిర్మించేందుకు వీసీ ప్రతిపాదనలు పంపించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త భవనాల్లో తరగతులు నిర్వహించేలా యుద్ధప్రాతిపదికన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

కొత్త భవనాల్లోనే తరగతులు



వచ్చే విద్యా సంవత్సరం కొత్తగా నిర్మించే భవనాల్లోనే తరగతులు నిర్వహించాలన్నది లక్ష్యం. ప్రస్తుతం యూనివర్సిటీలో 8 పీజీ, 6 అండర్ పీజీ కోర్సులు నడుస్తున్నాయి. మరో రెండు కోర్సులను వచ్చే విద్యా సంవత్సరానికి కొత్తగా తీసుకొస్తాం. ఇందుకోసం 77 మంది బోధన, 89 మంది బోధనేతర సిబ్బంది అవసరం. ప్రస్తుతం బోధన సిబ్బంది 18 మంది, బోధనేతర సిబ్బంది 12 మంది వరకు ఉన్నారు. మిగిలిన పోస్టుల నియామకానికి ప్రతిపాదనలు పంపించాం.

– ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ

హంస వాహనంపై వీణాపాణి

- పెద్దశేష వాహనంపై బద్రినారాయణుడిగా దర్శనం
- వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు


హంస వాహనంపై వీణాపాణిగా విహరిస్తున్న అలమేలు మంగమ్మ

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవ రోజైన శనివారం రాత్రి వీణాపాణిగా హంస వాహనంపై అమ్మవారు భక్తులను కటాక్షించారు. తొలుత అమ్మవారిని వేకువజామునే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు ఏడు తలలు గల పెద్దశేష వాహనంపై శ్రీబద్రినారాయణుడి అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు వాహన సేవ సాగింది. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు అమ్మవారు హంస వాహనంపై వీణాపాణిగా దర్శనమిచ్చారు. వీణ చేతబట్టిన సరస్వతీదేవిగా శ్వేత వర్ణ పట్టువస్త్రం, వజ్రవైఢూర్య స్వర్ణాభరణాలతో అలంకరించారు. అంతకు ముందు సాయంత్రం ఆరు గంటలకు జ్ఞానప్రదాయినిగా ఊంజల్ సేవలో భక్తులను అనుగ్రహించారు. వాహన సేవల్లో తిరుమల పెద్దజీయర్, చిన్నజీయర్ స్వాములు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 'నగరాలు'ను బీసీలుగా గుర్తించడంపై హర్షం

విజయవాడలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం జగన్, వైఎస్సార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిట్టినగర్/వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): నగరాలు సామాజికవర్గాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బీసీ–డీగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు హర్షం వ్యక్తంచేశారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. శనివారం విజయవాడలో నగరాలు సామాజికవర్గ ప్రముఖులతో కలిసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి మీడియాతో మాట్లాడారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ ఉమ్మడి ఏపీలో నగరాలు సామాజికవర్గాన్ని బీసీలుగా గుర్తించారని చెప్పారు. అయితే అది ఆనాడు కొన్ని జిల్లాలకే పరిమితమైందన్నారు. నేడు ఆయన తనయుడు సీఎం జగన్ మరో అడుగుముందుకు వేసి.. రాష్ట్రమంతా బీసీ–డీగా గుర్తిస్తూ జీవో జారీచేశారని వివరించారు. టీడీపీ హయాంలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసేవారని.. కానీ సీఎం జగన్ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. నగరాలు సామాజికవర్గానికి విజయవాడ మేయర్ పదవి, దుర్గగుడి చైర్మన్‌తో పాటు అనేక అనేక పదవులను ఇచ్చారని గుర్తుచేశారు. జీవో జారీకి కృషి చేసిన మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిట్టినగర్ సెంటర్‌లో వైఎస్సార్, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నగరాలు సామాజికవర్గ ప్రముఖులు పైలా సోమినాయుడు, పిళ్లా రవి, మరుపిళ్ల రాజేశ్, ఎన్‌వీ రావు, శీరం వెంకట్రావు, గురుమహంతు మహేశ్, మజ్జి శ్రీనివాస్, లింగిపిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నగరాలు సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు

నగరాలు సామాజికవర్గాన్ని రాష్ట్రమంతటా బీసీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు ఆంధ్రప్రదేశ్ నగరాలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జీ), కార్యదర్శి వేంకటేశ్వరస్వామి, కోశాధికారి రాజగిరి సోమేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఎంతో మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

చంద్రమోహన్ ఇక లేరు

▶ మొదటి పేజీ తరువాయి

ఫిలింనగర్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. అక్కడ చిత్ర పరిశ్రమ ప్రముఖులు, అభిమానులు చంద్రమోహన్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. చంద్రమోహన్‌కు భార్య జలంధర, కుమార్తెలు మధుర మీనాక్షి, మాధవి ఉన్నారు. జలంధర ప్రముఖ రచయిత్రికాగా.. మధుర మీనాక్షి సైకాలజిస్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. రెండో కుమార్తె మాధవి చెన్నైలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. అమెరికాలో ఉన్న మధుర మీనాక్షి వచ్చాక సోమవారం మధ్యాహ్నం చంద్రమోహన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన మేనల్లుడు, ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు.


చంద్రమోహన్ పార్థివదేహం

'రంగుల రాట్నం'తో మొదలై..

ఏపీలోని కృష్ణా జిల్లా పమిడిముక్కలలో మల్లంపల్లి వీరభద్రశాస్త్రి, శాంభవి దంపతులకు 1942 మే 23న జన్మించారు చంద్రమోహన్. ఆయన అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్‌రావు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రఖ్యాత దర్శకుడు కె.విశ్వనాథ్ తమకు దగ్గరి బంధువు కావడంతో.. సినిమాల్లో నటించాలనే ఆసక్తితో చెన్నై వెళ్లారు. బీఎన్ రెడ్డి దర్శకత్వం వహించిన 'రంగుల రాట్నం'(1966) సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయం అయ్యారు. హీరోగా సుమారు 175కుపైగా సినిమాలు చేశారు. మొత్తంగా తన 55 ఏళ్ల సినీ కెరీర్‌లో కథానాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్యనటుడిగా ఇలా దాదాపు 900కుపైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించారు. తనదైన నటనతో ప్రేక్షకుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారు. పలు తమిళ సినిమాల్లోనూ నటించారు.

విభిన్న పాత్రలతో.. ఎన్నో అవార్డులతో..

'సుఖదుఃఖాలు, కాలం మారింది, ఓ సీత కథ, సిరిసిరిమువ్వ, సీతామాలక్ష్మి, పదహారేళ్ల వయసు, శంకరా భరణం' వంటి క్లాసిక్ చిత్రాల్లో మెప్పించారు చంద్రమోహన్. 'గంగ మంగ', 'లక్ష్మణ రేఖ'వంటి చిత్రాల్లో కాస్త నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు చేశారు. శ్రీకాంత్ హీరోగా నటించిన 'కోతలరాయుడు' (2022) తెలుగులో చంద్రమోహన్ చివరి చిత్రం. తొలిచిత్రం 'రంగుల రాట్నం'కు నంది అవార్డు అందుకున్నారు. 1987లో 'చందమామ రావే' సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా, 2005లో 'అతనొక్కడే' చిత్రానికి ఉత్తమ సహాయనటుడిగా నంది అవార్డులు అందుకున్నారు. 'పదహారేళ్ల వయసు, సిరిసిరిమువ్వ' సినిమాలకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు.

విలక్షణమైన నటనతో అలరించారు: తెలంగాణ సీఎం కేసీఆర్

ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంతాపం తెలిపారు. విభిన్నమైన పాత్రలతో, విలక్షణమైన నటనతో, దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించిన చంద్రమోహన్ మరణం, తెలుగు చిత్రసీమకు తీరని లోటని ఆయన విచారం వ్యక్తం చేశారు. తెలుగుతో పాటు పలు భాషల్లో లక్షలాదిమంది అభిమానాన్ని చంద్రమోహన్ సొంతం చేసుకున్నారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చంద్రమోహన్ మృతి పట్ల ప్రధాని సంతాపం

సాక్షి, అమరావతి: సినీ నటుడు చంద్రమోహన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'ప్రముఖ తెలుగు నటుడు చంద్రమోహన్ మృతి చెందడం అత్యంత బాధాకరం. సినీ ప్రపంచంలో ఆయన ఓ వెలుగు వెలిగారు. వారి ఉత్తమ నటన, ప్రత్యేకమైన తేజస్సు తరతరాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వారి నిష్క్రమణ సృజనాత్మక ప్రపంచంలో పూరించలేని ఒక శూన్యతను కలిగించింది. ఓం శాంతి' అంటూ 'ఎక్స్'లో ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

చంద్రమోహన్ మృతికి గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ నటుడు చంద్రమోహన్ మృతి పట్ల గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు గవర్నర్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రమోహన్ బహుముఖ నటుడని.. మొత్తం 932 చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి.. ఫిలింఫేర్, నంది సహా అనేక అవార్డులు గెలుచుకున్నారని గవర్నర్ పేర్కొన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు

చంద్రమోహన్ మృతి పట్ల సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: తన నటన ద్వారా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం దక్కించుకున్న ప్రముఖ సినీనటుడు చంద్రమోహన్ మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 'ప్రముఖ నటుడు చంద్రమోహన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూయడం బాధాకరం. తొలి సినిమాకే నంది అవార్డును గెలుచుకున్న ఆయన.. తెలుగు, తమిళ భాషల్లో వందలాది సినిమాల్లో నటించి.. తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. చంద్రమోహన్ కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

చిత్ర పరిశ్రమకు తీరని లోటు: మంత్రి వేణు

రామచంద్రాపురం రూరల్: ప్రముఖ నటుడు చంద్రమోహన్ మృతికి రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిపోయిన నటుల్లో చంద్రమోహన్ ఒకరని కొనియాడారు. తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయమైన అనేక మంది అగ్ర కథానాయికలు తమ తొలి సినిమా చంద్రమోహన్‌తోనే నటించారన్నారు. చంద్రమోహన్ మృతి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని అన్నారు. ప్రభుత్వం తరఫున ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు త్వరలో కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యమానికి బీజేపీతోపాటు కేంద్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో విచారణలో ఉందని, ఈ క్రమంలో న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతోందని, ఎస్సీ జాబితాలో ఉన్న కులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభ జరిగింది. ఈ సభలో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వం సామాజిక న్యాయానికే కట్టుబడి ఉందని చెప్పారు. దళితులు, గిరిజనులు, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతే తమ లక్ష్యమన్నారు. గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాన్ని మరో ఐదేళ్లు కొనసాగించనున్నట్లు తెలిపారు. తెలుగు కవి గుర్రం జాషువా కవితల ప్రేరణతో పాలన సాగిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నారని, వన్ లైఫ్.. వన్ మిషన్‌లా చేస్తున్న ఈ ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తెలంగాణలో దళితులకు బీఆర్ఎస్ తీరని అన్యాయం చేసిందని అన్నారు. అధికారం చేపట్టిన మొదటిరోజే దళిత ముఖ్యమంత్రి హామీని తొక్కేశారని, సీఎం కుర్చీని కేసీఆర్ కబ్జా చేశారని అన్నారు. దళితబంధు అంటూ వేలకోట్ల రూపాయలను వారి పార్టీ నేతల విధేయులు, కార్యకర్తలకు పంచిపెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దళితులను ఎన్నోరకాలుగా అవమానపర్చిందని, అంబేడ్కర్‌ను రెండుసార్లు ఎన్నికల్లో ఓడించిందని తెలిపారు. ఆయనకు భారతరత్న ఇవ్వలేదని, బీజేపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చామని చెప్పారు.

మా ఆకాంక్షలు నెరవేర్చేది మోదీయే: మంద కృష్ణ

దళితుల ఆకాంక్షలు నెరవేర్చేది ప్రధాని మోదీ మాత్రమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చెప్పారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మాదిగ వ్యక్తి లేరని మండిపడ్డారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతోందని, ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఫలాలు అందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్యను కూడా పరిష్కరించాలని మోదీని కోరుతున్నానంటూ మంద కృష్ణ కన్నీటి పర్యంతమయ్యారు. మోదీ మంద కృష్ణను దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

క్లుప్తంగా...

14 గంటల్లో 800 సార్లు భూప్రకంపనలు

- ఐస్‌ల్యాండ్‌లో అత్యయిక స్థితి

న్యూయార్క్: అట్లాంటిక్ మహాసముద్రంలోని ద్వీపదేశం ఐస్‌ల్యాండ్ వందలాది చిన్నపాటి భూప్రకంపనలతో వణికిపోయింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం రెండింటివరకు అంటే 14 గంటల వ్యవధిలో ఏకంగా 800 సార్లు భూప్రకంపనలు సంభవించాయి. దీంతో భూకంప కేంద్ర సమీప ప్రాంత ప్రజలు భయంతో వణికిపోయారు. వారికి సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఎక్కువ ప్రకంపనలు నమోదైన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో 4,000 మంది జనాభా ఉన్న గ్రిండావిక్ గ్రామం ఉంది. అక్కడి వారిని వేరే చోటుకు తరలిస్తున్నారు. 800 భూకంపాల్లో పెద్దదైన భూకంపం గ్రిండావిక్‌కు ఉత్తర దిశలో రిక్టర్‌స్కేలుపై 5.2గా నమోదైంది. నైరుతి ఐస్‌ల్యాండ్‌లోని రీక్‌జేన్స్ అనే ప్రాంతంలో ఎక్కువ ప్రకంపనలు కనిపించాయి. అగ్నిపర్వతాల వ్యవస్థలమయమైన ఐస్‌ల్యాండ్‌లో భూకంపాల ధాటికి సుందన్‌జుకాగిగార్ ప్రాంతంలో అగ్నిపర్వతాలు బద్దలయ్యే ప్రమాదముందని అక్కడి పౌర రక్షణ, అత్యవసర విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆరుగురు అలీగఢ్ వర్సిటీ విద్యార్థుల అరెస్ట్

- ఐసిస్ నెట్‌వర్క్ బట్టబయలు

లక్నో: ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) తరఫున పనిచేస్తున్నారనే ఆరోపణలపై యూపీ పోలీసులు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి చెందిన ఆరుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. నిందితులందరికీ అలీగఢ్ యూనివర్సిటీ విద్యార్థుల సంఘమైన స్టూడెంట్స్ ఆఫ్ అలీగఢ్ యూనివర్సిటీ(సము)తో సంబంధాలున్నట్లు పోలీసులు తెలిపారు. వీరు తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ, ఐసిస్‌లోకి కొత్త వారిని చేర్చుకుంటున్నారని ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రర్ స్క్వాడ్(ఏటీఎస్) విభాగం తెలిపింది. దేశంలో భారీ ఉగ్రదాడికి వీరు కుట్ర పన్నుతున్నారని వెల్లడించింది. అరెస్టయిన వారిలో రకీమ్ ఇనామ్, నవీద్ సిద్దిఖీ, మహ్మద్ నౌమాన్, మహ్మద్ నజీమ్ అనే నలుగురిని గుర్తించింది. వీరందరినీ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఈ విద్యార్థి సంఘం కార్యకలాపాలపై కేంద్ర నిఘా వర్గాలు ఓ కన్నేసి ఉంచాయని కూడా పేర్కొంది.

'ల్యాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణం.. లాలూ సన్నిహితుడి అరెస్ట్

న్యూఢిల్లీ: 'ల్యాండ్ ఫర్ జాబ్స్'కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌ల సన్నిహితుడు అమిత్ కట్యాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. విచారణకు హాజరు కావాలంటూ పలుమార్లు సమన్లు జారీ చేసినా అతడు తప్పించుకు తిరుగుతున్నాడని ఈడీ తెలిపింది. కోర్టులో హాజరుపరిచి విచారణ కోసం రిమాండ్ కోరుతామని ఈడీ వివరించింది. ఈ కేసులో ఈడీ సమన్లను కొట్టివేయాల్సిందిగా అతడు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఇటీవల కొట్టివేసినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో లాలూ, తేజస్వీ యాదవ్, లాలూ కుమార్తెలు తదితరులతోపాటు కట్యాల్ ఇంటిపైనా ఇళ్లపై ఈడీ దాడులు జరిపింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉండగా ఈ కుంభకోణం జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఢిల్లీలో స్వల్ప భూకంపం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో మరోసారి భూకంపం సంభవించింది. శనివారం మధ్యాహ్నం 3.36 గంటల సమయంలో వచ్చిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6గా నమోదైనట్లు జాతీయ భూకంప పరిశోధన కేంద్రం వెల్లడించింది. ఢిల్లీకి 20 కిలోమీటర్ల దూరంలోని బురారిలో భూకంప కేంద్రం ఉందని వివరించింది.

ఉదయం నడక మానండి.. టపాసులు కాల్చకండి..

- ఢిల్లీ ప్రజలకు ఆరోగ్య శాఖ సూచన

న్యూఢిల్లీ: ఉదయం నడక మానండి..టపాసులు కాల్చకండి..ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోండి.. వాయు కాలుష్యం కొనసాగుతున్న వేళ దేశ రాజధాని వాసులకు ఢిల్లీ ఆరోగ్య శాఖ జారీ చేసిన సూచనలివి. శనివారం అన్ని ప్రధాన వార్తాపత్రికల్లో ఈ మేరకు సూచనలు ప్రచురించింది. ఇక కాలుష్యంతో రెండు వారాలుగా ఇబ్బంది పడుతున్న జనానికి వర్షం ఊరట ఇచ్చింది. దేశ రాజధాని ప్రాంతంలో గురువారం వాయు నాణ్యత ఇండెక్స్(ఏక్యూఐ) 437 కాగా, శనివారం ఉదయం ఏక్యూఐ 219కి పడిపోయింది.

పుతిన్ క్షమాభిక్ష... ఎందుకంటే..!

మాస్కో: గర్ల్‌ఫ్రెండ్ తిరస్కరించిందనే కక్షతో ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతోపాటు చిత్రహింసలు పెట్టి, ఏకంగా 111 సార్లు పొడిచి అత్యంత క్రూరంగా హత్య చేశాడో యువకుడు. అయినా సరే, కటకటాల వెనుక ఏడాది కూడా గడపకుండానే విడుదలయ్యాడు. రష్యాకు చెందిన వ్లాడిస్లావ్ కన్యూస్ అనే యువకుడు వెరా పెఖ్తెలెవాను ప్రేమించాడు. ఆ తర్వాత ఆమె అతడిని దూరంగా పెట్టింది. దాంతో ఆమెను బంధించి మూడున్నర గంటలపాటు చిత్రహింసలు పెట్టి చంపేశాడు. కోర్టు అతడికి 17 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కానీ ఉక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొనేందుకు అతను అంగీకరించడంతో అధ్యక్షుడు పుతిన్ క్షమాభిక్ష ప్రకటించారు. కన్యూస్‌ను విడుదల చేసి ఉక్రెయిన్‌తో సరిహద్దుల్లోని రోస్తోవ్ నగరానికి తీసుకెళ్లారు.

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి!

- నివేదిక సమర్పించనున్న దేశాయ్ కమిటీ
- ఆ వెంటనే అసెంబ్లీ ఆమోదం, యూసీసీకి చట్టబద్ధత
- అమలు చేస్తే దేశంలో తొలి రాష్ట్రంగా రికార్డు
- త్వరలోనే బీజేపీ పాలిత గుజరాత్‌లో కూడా!
- గోవాలో ఇప్పటికే అమల్లో ప్రత్యేక పౌర స్మృతి



కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చల్లో నిలుస్తూ వస్తున్న ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యూసీసీ)ని హిమాలయ రాష్ట్రం ఉత్తరాఖండ్ త్వరలో అమలు చేయనున్నట్టు సమాచారం. వచ్చే వారమే ఈ దిశగా చర్యలు చేపట్టబోతోందని తెలుస్తోంది. తద్వారా దేశంలో యూసీసీని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా అది నిలవనుంది. యూసీసీపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ సారథ్యంలో ఏర్పాటైన కమిటీ ఒకట్రెండు రోజుల్లో సీఎం పుష్కర్‌సింగ్ ధామికి నివేదిక సమర్పించనుంది. దీపావళి అనంతరం రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై యూసీసీ బిల్లును ఆమోదించనుంది. తద్వారా దానికి చట్టబద్ధత కల్పించనుంది.

ఎన్నికల వాగ్దానం: ఉత్తరాఖండ్‌లో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేసిన ఎన్నికల వాగ్దానాల్లో యూసీసీ అమలు ప్రధానమైనది. ఆ మేరకు జస్టిస్ దేశాయ్ సారథ్యంలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తూ తొలి కేబినెట్ భేటీలోనే సీఎం ధామీ నిర్ణయం తీసుకున్నారు. డ్రాఫ్ట్ తయారీ కోసం రాష్ట్రంలో దాదాపు 2.3 లక్షల మందితో కమిటీ చర్చలు జరిపింది. యూసీసీ డ్రాఫ్ట్ కమిటీలో కూడా ఆమె సభ్యురాలు.

ఏమిటీ ఉమ్మడి పౌర స్మృతి?

- కులం, మతం, ఆడ-మగ వంటి తేడాలు, లైంగిక ప్రవృత్తులతో నిమిత్తం లేకుండా దేశ పౌరులందరికీ ఒకే రకమైన వ్యక్తిగత చట్టాలను వర్తింపజేయడం ఉమ్మడి పౌర స్మృతి ప్రధానోద్దేశం.
- ఇది అమలైతే ప్రస్తుతం అమల్లో ఉన్న పలు మత, ఆచార, సంప్రదాయ ఆధారిత వ్యక్తిగత చట్టాలన్నీ రద్దవుతాయి.
- వివాహాలు, విడాకులు, వారసత్వం, దత్తత తదితరాలతో పాటు పలు ఇతర వ్యక్తిగత అంశాలు కూడా యూసీసీ పరిధిలోకి వస్తాయి.
- రాజ్యాంగంలోని 44వ అధికరణం ఆధారంగా దీన్ని తెరపైకి తెచ్చారు.
- 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీ పాలిత గుజరాత్ కూడా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయనుందని చెబుతున్నారు!
- గోవాలో ఇప్పటికే గోవా పౌర స్మృతి అమల్లో ఉంది. ఇది చాలా రకాలుగా యూసీసీని పోలి ఉంటుంది.

రాజ్యాంగం ఏమంటోంది?

''దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలి'' అని రాజ్యాంగంలోని 4వ భాగం స్పష్టంగా నిర్దేశిస్తోంది. అయితే దీన్ని రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాల్లో భాగంగా పేర్కొన్నారు. కనుక దీని అమలు తప్పనిసరి కాదు. ఆ దృష్ట్యా యూసీసీ అమలుకు కోర్టులు ఆదేశించజాలవు.

సుప్రీంకోర్టు కూడా...

అత్యున్నత న్యాయస్థానం కూడా పలు తీర్పుల సందర్భంగా యూసీసీ అమలు ఆవశ్యకతను నొక్కిచెప్పింది. అయితే 2018లో మోదీ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు యూసీసీపై లోతుగా పరిశీలించిన కేంద్ర లా కమిషన్ మాత్రం భిన్నాభిప్రాయం వెలిబుచ్చడం విశేషం. ''ఈ దశలో దేశానికి ఉమ్మడి పౌర స్మృతి అవసరమూ లేదు. అభిలషణీయమూ కాదు'' అంటూ కేంద్రానికి ఏకంగా 185 పేజీల నివేదిక సమర్పించింది!

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలైతే..

- యూసీసీ అమల్లో భాగంగా బహుభార్యత్వాన్ని ఉత్తరాఖండ్ సంపూర్ణంగా నిషేధించనుందని చెబుతున్నారు. ఇంకా...
- సహజీవనం చేసే జంటలు దాన్ని అధికారికంగా నమోదు చేసుకునే సదుపాయం కల్పిస్తారు.
- కుమారుడితో సమానంగా కూతురికి కూడా సంపూర్ణ వారసత్వహక్కులు సంక్రమిస్తాయి.

పార్టీల్లో భిన్నాభిప్రాయాలు...

యూసీసీ అమలుపై రాజకీయ పక్షాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. బీజేపీ దీన్ని గట్టిగా సమర్థించడమే గాక అధికారంలోకి వస్తే దేశమంతటా యూసీసీని కచ్చితంగా అమలు చేస్తామని 2019 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ కూడా ఇచ్చింది. ఇక కాంగ్రెస్, మజ్లిస్ తదితర పక్షాలు యూసీసీని వ్యతిరేకిస్తున్నాయి...

- ప్రధాని మోదీ తొలినుంచీ యూసీసీ అమలును గట్టిగా సమర్థిస్తూ వస్తున్నారు. రెండు రకాల చట్టాలతో దేశం ఎలా నడుస్తుందని మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో కూడా ప్రశ్నించారు.
- ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ తదితరులు కూడా పలు సందర్భాల్లో యూసీసీని సమర్థించారు. ''దేశ పౌరులందరికీ ఉమ్మడి పౌర స్మృతి ఉండాలన్నదే మన రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం కూడా. దాని అమలుకు ఇదే సమయం'' అని ధన్‌ఖడ్ అభిప్రాయపడ్డారు.
- యూసీసీ పేరుతో ద్రవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి పెను సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే మోదీ లక్ష్యమని కాంగ్రెస్ దుయ్యబడుతోంది.
- రాజ్యాంగంలోని 29వ అధికరణానికి యూసీసీ విరుద్ధమని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆక్షేపించారు. ''బహుళత్వం, వైవిధ్యమే మన దేశ సంపద. యూసీసీ పేరుతో వాటికి తూట్లు పొడిచేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు'' అంటూ మండిపడ్డారు.
- యూసీసీ వస్తే తమ సాంప్రదాయిక ఆచారాలకు అడ్డుకట్ట పడుతుందేమోనని దేశవ్యాప్తంగా 30 పై చిలుకు గిరిజన సంఘాలు కూడా ఇప్పటికే సందేహం వెలిబుచ్చాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



శనివారం ఢిల్లీలోని తన నివాసంలో భార్య, కుమారుడితో 'చోటీ దివాలీ' వేడుకల్లో సిసోడియా

జైలు నుంచి ఇంటికెళ్లిన సిసోడియా

భార్యను చూసేందుకు ఓకే చెప్పిన ఢిల్లీ సిటీ కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కొద్దిసేపు ఉపశమనం లభించింది. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను ఓదార్చేందుకు ఆరు గంటలపాటు ఇంటికి వెళ్లేందుకు సిసోడియాకు ఢిల్లీ సిటీ కోర్టు శుక్రవారం అనుమతి మంజూరు చేసింది. తిహార్ జైలు నుంచి ఢిల్లీలోని మధుర రోడ్డులో గల నివాసానికి శనివారం ఉదయం 10గంటలకు చేరుకున్నారు. సాయంత్రం నాలుగింటివరకు ఆయనకు అనుమతి ఇచ్చింది. కొంతకాలంగా సిసోడియా భార్య సీమా అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం తెల్సిందే. ఇంటికి వెళ్లేందుకు అనుమతి కావాలంటూ సిసోడియా గతంలో కోర్టును కోరిన విషయం విదితమే. దీంతో ఆయనకు కోర్టు ఇలా కొద్దిగంటలపాటు ఉపశమనం కల్పించింది. అయితే బయట ఉన్న సమయంలో రాజకీయ ఉపన్యాసాలు చేయొద్దని, మీడియాతో మాట్లాడొద్దని, సమావేశాల్లో పాల్గొనవద్దని ఆదేశించింది. గతంలోనూ భార్యను కలిసేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతిచ్చినా ఇంటికొచ్చే సమయానికి ఆస్పత్రికి తీసుకెళ్లడంతో కలవలేకపోయారు.

దాల్ సరస్సులో ఘోర అగ్ని ప్రమాదం

- హౌస్‌బోట్లలో చెలరేగిన మంటలు
- ముగ్గురు పర్యాటకులు సజీవదహనం
- మృతులంతా బంగ్లాదేశీయులే
- ఆస్తి నష్టం రూ.కోట్లలో ఉంటుందన్న అధికారులు

శ్రీనగర్: శ్రీనగర్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం దాల్ సరస్సు హౌస్‌బోట్లలో శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో విదేశీ ముగ్గురు పర్యాటకులు మృతి చెందారు. మాడి మసైన హౌస్‌బోట్ శిథిలాల నుంచి గుర్తుపట్టలేని విధంగా కాలిన మూడు మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. మృతులు బంగ్లాదేశ్‌కు చెందిన వారని అధికారులు తెలిపారు. వీరిని అనిందయ కౌశల్, మహ్మద్ మొయినుద్, దాస్ గుప్తా అని తెలిసిందన్నారు. వీరున్న సఫీనా అనే హౌస్‌బోట్ పూర్తిగా దగ్ధమైందన్నారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం మృతదేహాలను వారి కుటుంబీకులకు అందజేస్తామని తెలిపారు. ఈ ప్రమాదంలో మొత్తం అయిదు హౌస్‌బోట్లు, వాటికి పక్కనే ఉన్న ఏడు నివాస కుటీరాలు, కొన్ని ఇళ్లు కూడా పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఘటనలో కోట్లలో ఆస్తినష్టం సంభవించింది. తొమ్మిదో నంబర్ ఘాట్‌లో అగ్ని ప్రమాదంపై ఉదయం 5.15 గంటల సమయంలో ఫోన్‌లో సమాచారం అందగానే రంగంలోకి దిగి, ఎనిమిది మంది పర్యాటకులను రక్షించగలిగామని స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఫైర్ సర్వీస్) ఫరూక్ అహ్మద్ తెలిపారు. ఒక హౌస్‌బోట్‌లో చెలరేగిన మంటలు వేగంగా మిగతా బోట్లకు వ్యాపించాయన్నారు. అతికష్టమ్మీద మంటలను అదుపులోకి తేగలిగామని వివరించారు. ప్రమాదానికి కచ్చితమైన కారణం తెలియనప్పటికీ.. ఒక బోటులోని హీటింగ్ పరికరాల్లో లోపం కారణంగానే మంటలు అంటుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. 2022లోనూ దాల్, నగీన్ సరస్సుల్లో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఏడు హౌస్‌బోట్లు బూడిదగా మారాయి. అప్పటి ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.



శనివారం అయోధ్యలో లక్షలాది దీపాల వెలుగుల్లో సరయూ నదీ తీరం

22 లక్షల దీపాల వెలుగుల్లో అయోధ్య

స్వీయ గిన్నిస్ రికార్డునే బద్దలు కొట్టిన దీపోత్సవం

లక్నో/అయోధ్య: అయోధ్యలోని సరయూ నదీ తీరం వెలుగులతో నిండిపోయింది. శనివారం అత్యంత వైభవంగా 22 లక్షల దీపాలతో జరిగిన దీపోత్సవం ప్రపంచ రికార్డు సృష్టించింది. ఒకే చోట ఒకేసారి అత్యధిక సంఖ్యలో దీపాలను వెలిగించిన ఘటనగా స్వీయ గిన్నిస్ రికార్డునే బద్దలు కొట్టింది. సరయూ నది ఒడ్డున 51 ఘాట్లలో 25 వేల మంది వలంటీర్లు 22.23 లక్షల మట్టి ప్రమిదలను వెలిగించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు డ్రోన్ల సాయంతో దీపాలను లెక్కించి, ప్రపంచ రికార్డుగా ధ్రువీకరించడంతో నగరం 'జై శ్రీరామ్' నినాదాలతో మారుమోగింది. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఈ మేరకు సీఎం యోగీ ఆదిత్యనాథ్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు. గతేడాది ఈ వేడుకలో 15.76 లక్షల ప్రమిదలు వెలిగించడం తొలిసారి గిన్నిస్ రికార్డులకెక్కింది. 2017లో యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అయోధ్యలో ఏటా దీపోత్సవం జరుగుతోంది. శనివారం సీఎం ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్, కేబినెట్ మంత్రులు కూడా దీపాలు వెలిగించి, సరయూ నది ఒడ్డున పూజలు చేశారు. దీపోత్సవం 100 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారమైంది.

గాల్లో వేలాది ప్రాణాలు!

- గాజాలో ఆస్పత్రుల ముంగిట మోహరించిన ఇజ్రాయెల్ సైన్యం
- ప్రధానాసుపత్రి షిఫాలో కరెంటు బంద్
- ఐసీయూ యూనిట్‌పై బాంబు దాడి
- పూర్తిగా నిలిచిపోయిన వైద్య సేవలు
- అత్యధిక ఆస్పత్రుల్లో అదే పరిస్థితి
- అల్లాడుతున్న రోగులు, పసికందులు
- వైద్యమందక 100కు పైగా మృతి!
- మృత్యుముఖంలోకి వేలాది మంది రోగులు

దెయిర్ అల్‌బలాహ్ (గాజా): గాజాలో మానవీయ సంక్షోభం క్రమంగా తీవ్ర రూపు దాలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ఆస్పత్రుల ముంగిట్లోకి చేరడంతో పరిస్థితి దారుణంగా దిగజారుతోంది. ఇజ్రాయెల్ అష్టదిగ్బంధం దెబ్బకు కనీస సౌకర్యాలన్నీ నిలిచిపోవడంతో గాజాలో 20 ఆస్పత్రులు ఇప్పటికే పూర్తిగా స్తంభించిపోయాయి. మిగిలిన 15 ఆస్పత్రులూ అదే బాటన ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. కరెంటు సరఫరా లేక ప్రధాన ఆస్పత్రి అల్ షిఫాలో శనివారం వైద్య పరికరాలన్నీ మూగవోయాయి. దాంతో వైద్య సేవలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. అల్ ఖుద్స్ ఆస్పత్రిలోనూ ఇదే పరిస్థితి. ఆ ఆస్పత్రికి ఏకంగా 20 మీటర్ల సమీపం దాకా సైన్యం చొచ్చుకొచ్చిందని తెలుస్తోంది! దాంతో అందులోని 14 వేల మంది రోగులు, శరణార్థుల ప్రాణాల్లో గాల్లో దీపంగా మారాయి. విరామం లేకుండా దూసుకొస్తున్న తూటాలు, బాంబు వర్షం కారణంగా అల్ షిఫా ఆస్పత్రిలోని వేలాది మంది కూడా ప్రాణ భయంతో వణికిపోతున్నారు. అందులో 1,500 మందికి పైగా రోగులు, అంతే సంఖ్యలో వైద్య సిబ్బంది, 15 వేలకు పైగా శరణార్థులున్నట్టు చెబుతున్నారు. వైద్య సేవలతో పాటు కరెంటు, ఆక్సిజన్ సరఫరాలు పూర్తిగా నిలిచిపోవడంతో పలు ఆస్పత్రుల్లో ఐసీయూల్లోని రోగులు, ఇంక్యుబేటర్లలోని చిన్నారులు నిస్సహాయంగా మృత్యుముఖానికి చేరువవుతున్నారు. ఇలా ఇప్పటికే 200 మందికి పైగా మరణించారని, మరికొన్ని వందల మంది మృత్యువుతో పోరాడుతున్నారని హమాస్ ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతుండటం ఆందోళన కలిగిస్తోంది! ఈ పరిణామాలపై అంతర్జాతీయ సమాజం గగ్గోలు పెడుతున్నా ఇజ్రాయెల్ మాత్రం దాడులాపేందుకు ససేమిరా అంటోంది. కనీసం వాటికి విరామమిచ్చేందుకు కూడా ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మరోసారి నిరాకరించారు.

షిఫా.. శిథిల చిత్రం

అల్ షిఫా ఆస్పత్రిలో తాగునీటితో పాటు ఆహార పదార్థాలు కూడా పూర్తిగా నిండుకున్నాయి. దాంతో వైద్యంతో సహా ఏ సేవలూ అందక రోగులు నిస్సహాయంగా మృత్యువాత పడుతున్నారు. శనివారమే 100 మందికి దుర్మరణం పాలైనట్టు హమాస్ పేర్కొంది. వీటికి తోడు ఐసీయూ విభాగంపై బాంబు దాడి జరిగింది. ఆస్పత్రిని ఇజ్రాయెల్ సైన్యం అన్నివైపుల నుంచీ దిగ్బంధించింది. అక్కడ హమాస్ ఉగ్రవాదులతో భీకరంగా పోరాడుతున్నట్టు ప్రకటించింది. ఆస్పత్రి ప్రాంగణంతో పాటు పరిసరాలన్నీ బాంబు మోతలతో దద్దరిల్లుతున్నాయి. బాంబు దాడుల్లో రెండు అంబులెన్సులు తునాతునకలయ్యాయి. కనీసం రోగులు, క్షతగాత్రులను ఆస్పత్రి నుంచి మరో చోటికి తరలించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. అడుగు కదిపినా స్నైపర్ల తూటాలు దూసుకొస్తున్నట్టు ఆస్పత్రి సిబ్బంది వాపోతున్నారు. ఈ ఆస్పత్రి కిందే ఉగ్రవాద సంస్థ హమాస్ ప్రధాన కార్యాలయముందని ఇజ్రాయెల్ మొదటినుంచీ ఆరోపిస్తుండటం తెలిసిందే. అయితే అంతర్జాతీయ ఖండనల నేపథ్యంలో శనివారం సాయంత్రానికల్లా ఇజ్రాయెల్ మాట మార్చింది. అల్ షిఫా ఆస్పత్రిపై దాడులు జరపడం లేదని, అక్కణ్నుంచి వెళ్లిపోవాలనుకున్న వారికోసం కారిడార్ తెరిచే ఉంచామని చెప్పుకొచ్చింది. దాడుల్లో గాయపడుతున్న రెండు రోజులుగా ప్రధానంగా అల్ అహిల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. కానీ అక్కడ కూడా మౌలిక సదుపాయాలేవీ లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. కారిడార్లతో పాటు ఎక్కడ పడితే అక్కడ రోగులను నిస్సహాయంగా వదిలేసిన దృశ్యాలు హృదయాలను కలచివేస్తున్నాయి.

పడకేసిన వైద్యం

గాజా అంతటా వైద్య సేవలు పూర్తిగా పడకేసినట్టేనని అక్కడ సహాయక చర్యలు చేపడుతున్న ఐరాస సంస్థలు కూడా స్పష్టం చేస్తున్నాయి. ''గాజాలోని మొత్తం 35 ఆస్పత్రులూ చేతులెత్తేసినట్టే. పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయింది'' అని అవి చెబుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర గాజాలోని అల్ నస్ర్, అల్ రంటిసి సహా చాలా ఆస్పత్రులు సైనిక దిగ్బంధంలో ఉన్నాయి. దీనికి తోడు గాజావ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యధికం ఎప్పుడో మూతబడ్డాయి.

రాజస్తాన్‌లో అమానుషం

- నాలుగేళ్ల చిన్నారిపై ఎస్సై అత్యాచారం
- ఉదంతంపై పెల్లుబికిన ప్రజాగ్రహం
- ఎన్నికల వేళ ఘటన.. కాంగ్రెస్‌పై బీజేపీ నేతల విమర్శనాస్త్రాలు

జైపూర్: రాజస్తాన్‌లోని దౌసాలో దారుణం చోటుచేసుకుంది. కామంతో కళ్లు మూసుకుపోయిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటనపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దళిత బాలికపై దారుణానికి తెగించిన సబ్ ఇన్‌స్పెక్టర్‌పై జనం దాడి చేసి, కొట్టారు. ఎన్నికల వేళ జరిగిన ఘటనపై అధికార కాంగ్రెస్‌పై బీజేపీ దుమ్మెత్తి పోసింది. లాల్‌సోత్ ఏరియాలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దారుణానికి పాల్పడిన సబ్ ఇన్‌స్పెకర్ భూపేంద్ర సింగ్‌ను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల విధుల్లో ఉన్న భూపేంద్ర సింగ్ శుక్రవారం మధ్యాహ్నం మాయమాటలతో బాలికను తన గదికి తీసుకువచ్చి, దారుణానికి పాల్పడినట్లు ఏఎస్‌పీ రామచంద్ర సింగ్ నెహ్రా పీటీఐకి చెప్పారు. ఘటన విషయం తెలిసి కోపోద్రిక్తులైన ప్రజలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహువాస్ పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. ఎస్ఐ భూపేంద్ర సింగ్‌ను రోడ్డుపైకి లాగి బట్టలు చిరిగేలా రాళ్లు, కర్రలతో కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రజలు అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు భూపేంద్ర సింగ్‌పై పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు పెట్టామని ఎస్పీ వందితా రాణా చెప్పారు. అతడిని అరెస్ట్ చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టామని తెలిపారు. బాధిత బాలికను వైద్య పరీక్షలకు పంపామన్నారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆమె వాంగ్మూలం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు.

ఇది కూడా కాంగ్రెస్ గ్యారంటీయే: బీజేపీ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బాలికలను కాపాడాలి (బేటీ బచావో) అని నినదిస్తుండగా రాష్ట్రంలోని అశోక్ గెహ్లోత్ సర్కారు మాత్రం రేపిస్టులను కాపాడాలి(రేపిస్టు బచావో) అని అంటోందని బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఢిల్లీలో వ్యాఖ్యానించారు. ఈ ఘటన రాజస్తాన్‌కు మాత్రమే కాదు, మొత్తం దేశానికే అవమానకరమని విమర్శించారు. పోలీసులు, ఇతర అధికారులు మహిళలు, బాలికలపై పాల్పడిన అఘాయిత్యాలకు సంబంధించిన అనేక ఘటనలను పూనావాలా ఉదహరించారు. ఎన్నికల వేళ కూడా రేపిస్టులు ఎంతో ధీమాతో ఉన్నట్లు దీనితో అర్థమవుతోందని ఆరోపించారు. తాజా ఘటన కూడా కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటీయేనని వ్యాఖ్యానించారు. దళితులు, మహిళలపై జరుగుతున్న దారుణాల్లో రాజస్తాన్ మొదటి స్థానంలో నిలిచిందని విమర్శించారు. దారుణాన్ని గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా తీవ్రంగా ఖండించారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ ఉమేశ్ మిశ్రాను ఆయన ఆదేశించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బీజేపీ ఎంపీ కిరోడి లాల్ మీనా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం చేతకానితనంతో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాధిత బాలిక కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వివాదంలో ఏఆర్ రెహ్మాన్

నజ్రుల్ గీతం ట్యూన్ మార్చారు • తొలగించాలి: కుటుంబం

కోల్‌కతా: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ వివాదంలో చిక్కుకున్నారు. ప్రఖ్యాత బెంగాలీ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం రచించిన ప్రఖ్యాత స్వాతంత్ర్యోద్యమ గీతం 'కరార్ ఓయ్ లౌహో కొపట్'ను తాజాగా విడుదలైన బాలీవుడ్ సినిమా పిప్పాలో వాడుకున్నారాయన. దాని ట్యూన్ మార్చడం ద్వారా తమతో పాటు అసంఖ్యాకులైన అభిమానుల మనోభావాలను రెహ్మాన్ దెబ్బ తీశారంటూ నజ్రుల్ కుటుంబసభ్యులు శనివారం దుయ్యబట్టారు. ''రెహ్మాన్ కోరిన మీదట ఆ గీతాన్ని వాడుకునేందుకు అనుమతించాం. కానీ దాని ట్యూన్, లయ పూర్తిగా మార్చేయడం చూసి షాకయ్యాం'' అంటూ నజ్రుల్ మనవడు, మనవరాలు తదితరులు మండిపడ్డారు. ''ఈ వక్రీకరణను అనుమతించేది లేదు. తక్షణం ఆ గీతాన్ని సినిమా నుంచి తొలగించాలి. పబ్లిక్ డొమైన్‌లో కూడా అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలి'' అని వారు డిమాండ్ చేశారు. ట్యూన్ మార్పును నిరసిస్తూ బెంగాలీ గాయకులు, కళాకారులతో కలిసి నిరసనకు దిగుతామని ప్రకటించారు. బెంగాలీలు కూడా దీనిపై భగ్గుమంటున్నారు. రెహ్మాన్ వంటి సంగీత దర్శకుడి నుంచి ఇది ఊహించలేదంటూ బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ తదితరులు విమర్శించారు. రెహ్మాన్ తీరుపై ఇంటర్నెట్లో కూడా విమర్శల వర్షం కురుస్తోంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నజ్రుల్ ఇస్లాం గీతాలు, పద్యాలు బెంగాల్లోనే దేశమంతటా మారుమోగాయి. టాగూర్ గీతాల తర్వాత అత్యంత ప్రసిద్ధి పొందాయి.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
ఆదివారం ౹ 12 ౹ నవంబర్ ౹ 2023

15 మంది పళ్లు పీకిన ఐపీఎస్ అధికారిపై కేసు

తిరువొత్తియూరు: కేసుల విచారణ సమయంలో 15 మంది నిందితుల పళ్లు పీకిన ఐపీఎస్‌పై చార్జి షీట్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వివరాలు.. అంబా సముద్రంలో ఐపీఎస్ అధికారిగా పనిచేసే సమయంలో బల్వీర్‌సింగ్ కొందరు నిందితులను విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకొచ్చి.. వారి నోట్లో రాళ్లుపెట్టి పళ్లు విరగ్గొట్టారని బాధితులు ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు చేరన్ మహాదేవి అసిస్టెంట్ మెజిస్ట్రేట్ మహమ్మద్ సబీర్ ఆలం విచారణ చేశారు. బాధితులు సెల్లప్ప, ఇసకిముత్తు, రూబెన్ ఆంథోనీ, మరియప్పన్, మారియప్ప, సూర్య, లక్ష్మీశంకర్, వేద నారాయణన్, సుభాష్ సబ్ కలెక్టర్‌కు జరిగిన విషయం తెలిపారు. నివేదిక ఆధారంగా ఈ ఘటనపై సంబంధిత ఐపీఎస్ అధికారిపై చర్యలు తీసుకోవడానికి చార్జ్‌షీటు దాఖలు చేయడానికి తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

న్యూస్‌రీల్

క్యాపిటల్ మార్కెట్‌లో బ్యాంకర్ల పాత్ర కీలకం

సాక్షి, చెన్నై: భారత దేశ క్యాపిటల్ మార్కెట్ అభివృద్ధిలో ఏఐబీఐ, మర్చంట్ బ్యాంకర్ల పాత్ర కీలకంగా ఉన్నట్టు కేంద్ర సహాయ మంత్రి భగవత్ కరాడ్ పేర్కొన్నారు. ప్రైమరీ మార్కెట్‌లోని క్రిటికల్ ఏరియాలపై కెపాసిటీ బిల్డింగ్ అనే అంశంపై ఏఐబీఐ నేతృత్వంలో స్థానికంగా జరిగిన వర్క్ షాపులో మంత్రి పాల్గొన్ని క్యాపిటల్ ఫార్మేషన్‌లో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి మరింత సహకార ప్రయత్నాలపై మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఈ వివరాలను స్థానికంగా ఏఐబీఐ వర్గాలు ప్రకటన రూపంలో విడుదల చేశాయి. ఈ సమావేశంలో ప్రాథమిక మార్కెట్లలోని క్లిష్టమైన ప్రాంతాలపై, కెపాసిటీ బిల్డింగ్‌పై చర్చించారు. రెగ్యులేటర్లు, స్టాక్ ఎక్సైంజీలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు, ఇతర ఆర్థిక సంబంధిత మార్కెట్ మధ్యవర్తుల కీలక పాత్రలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ, భారత మూలధన మార్కెట్‌లో సంక్లిష్టసమయాలు, అత్యంత అధునాతమైన, ప్రగతి పథంలో మార్కెట్‌లపాత్ర గురించి తెలియజేశారు. ఏఐబీఐ, మర్చంట్ బ్యాంకర్ల పాత్రను వివరిస్తూ అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమని కొనియడారు. ఏఐబీఐ చైర్మన్ మహావీర్ లునావత్ మాట్లాడుతూ, వర్క్ షాపు ఉద్దేశాలను వివరించారు. ఈ సమావేశం వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్థిక నిపుణులు , ప్రతినిధులు ఆశిష్ చౌహాన్, సుందరేశన్, అనంత్ బారువా, రాజేష్, దీప్ మణి షా, జేఎస్ గుప్తా, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కరుక్కా వినోద్‌పై గూండాయాక్ట్

సాక్షి, చెన్నై: రాజ్ భవన్‌పై పెట్రో బాంబు దాడి కేసులో అరెస్టయిన రౌడీ కరుక్కా వినోద్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్‌తో కూడిన గూండా చట్టాన్ని ప్రయోగించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులకు చెన్నై పోలీసు కమిషనర్ శంకర్‌జివ్వాల్ ఆదేశించారు. వివరాలు.. గత నెల చెన్నై గిండిలోని రాజ్ భవన్‌పై పెట్రో బాంబు దాడికి రౌడీ కరుక్కా వినోద్ పాల్పడిన విషయం తెలిసిందే. అతడిని అక్కడి భద్రత సిబ్బంది పట్టుకున్నారు. ఈ వ్యవహారం పెను దుమారం రేపింది. రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ వర్గాలు మండిపడ్డాయి. ఈక్రమంలో ఎలాంటి విచారణ లేకుండా ఆగమేఘాలపై రౌడీ కరుక్కా వినోద్‌ను పోలీసులు అరెస్టు చేసి కటకటాలలో నెట్టడాన్ని రాజ్ భవన్ సైతం విమర్శించింది. చివరకు అతడిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఏడాది కాలం పాటు ఎలాంటి బెయిల్ రాకుండా అతడిని కట కటాలలోనే ఉంచే విధంగా గూండాచట్టాన్ని ప్రయోగించారు.

ఎంఎస్‌ఎంఈలకు ఊరట

- పీక్ అవర్ చార్జీ 25 శాతం తగ్గింపు

సాక్షి,చెన్నై : చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊరట కలిగించే విధంగా ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పీక్ అవర్ చార్జీ 25 శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏటా విద్యుత్ చార్జీల వడ్డన దిశగా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది గృహాలను మినహాయించి తక్కిన వాటికి వడ్డన వేశారు. ఈ మేరకు ఎంఎస్‌ఎంఈలకు పీక్ అవర్ విద్యుత్ వాడకం చార్జీని 25 శాతం పెంచారు. అలాగే మరికొన్ని వడ్డనలు అమలు చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఎంఎస్‌ఎంఈల యాజమాన్యాలు పోరాటాలు చేస్తూ వస్తున్నాయి. అతిపెద్ద పరిశ్రమలతో సమానంగా తమకు చార్జీలను విధించడం సబబు కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తున్నారు. దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. దీంతో 25 శాతంగా ఉన్న చార్జీని 15 శాతంగా తొలుత ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని కూడా ఆ యాజమాన్యాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి. గత వారం రోజులుగా ఎంఎస్‌ఎంఈల శాఖ మంత్రి అన్బరస్ యాజమాన్యలతో చర్చలు జరుపుతూ వచ్చాయి. ఇది సంతృప్తికరంగా ముగిశాయి. ఇందులో తీసుకున్న నిర్ణయం మేరకు అన్ని డిమాండ్లను ఒకే సారిగా అమలు చేయకుండా ముందుగా పెంచిన పీక్ అవర్ చార్జీ 25 శాతాన్ని పూర్తిగా రద్దు చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ తగ్గింపు రాష్ట్రంలోని 20 లక్షలకు పైగా ఉన్న ఎంఎస్‌ఎంఈలకు వర్తింపజేశారు.

మంత్రి తనయుడు, మనవడిపై దాడి

- కేసు నమోదు

సాక్షి, చెన్నై: సినిమా థియేటర్‌లో రెవెన్యూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తనయుడు రమేష్, మనవడిపై ముగ్గురు మహిళ సహా ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ కెమెరాల ఆధారంగా ఆరుగురి కోసం గాలిస్తున్నారు. వివరాలు.. రెవెన్యూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామంచంద్రన్ కుమారుడు రమేష్ (50), మనవడు(17) టీ నగర్‌లోని ఓ థియేటర్‌లో శుక్రవారం రాత్రి 11 గంటల షోకు వెళ్లారు. సినిమా థియేటర్లో వీరి వెనుక సీటులో ఉన్న ముగ్గురు మహిళలు, మరో ముగ్గురు వ్యక్తులు ఈలలు, గోలలతో ఇతర ప్రేక్షకులకు తీవ్ర ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించారు. వీరిని మంత్రి తనయుడు రమేష్ ప్రశ్నించగా, ఆరుగురు ఆయనపై, ఆయన వెంట ఉన్న బాలుడిపై దాడి చేశారు. తర్వాత వారు అక్కడి నుంచి ఉడాయించారు. ఈ ఘటనపై మంత్రి తనయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తేనాంపేట పోలీసులు రంగంలోకి దిగారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

వెలుగుల సందడి!

రాష్ట్రంలో దీపావళి సందడి నెలకొంది. ఆదివారం పండుగ కావడంతో శనివారం అన్ని మాల్స్, వాణిజ్య కేంద్రాల్లో వ్యాపారం జోరందుకుంది. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు రాష్ట్రంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మందుబాబుల కోసం టాస్మాక్ మద్యం దుకాణాల్లో పెద్దఎత్తున వివిధ రకాల బ్రాండ్‌లను సిద్ధంగా ఉంచారు. రాష్ట్ర ప్రజలకు వివిధ పార్టీల నేతలు పండుగ శుభకాంక్షలు తెలియజేశారు.

- నేడు దీపావళి పండుగకు సర్వం సిద్ధం
- రాష్ట్ర వ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం
- ప్రజలకు నేతల శుభాకాంక్షలు
- చెన్నై నుంచి స్వస్థలాలకు 10 లక్షల మంది
- జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక శాఖ సూచన
- టాస్మాక్‌లో మద్యం ఫుల్
- పండుగ స్పెషల్‌గా కొత్త బ్రాండ్‌లు
- అంతంత మాత్రంగానే బాణసంచా విక్రయాలు



దీపావళి వేడుకల్లో యువతులు

సాక్షి, చెన్నై: వెలుగుల పండుగను ఇంటిల్లి పాది ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధం అయ్యారు. ఓ వైపు దక్షిణ తమిళనాడు, కొంగు మండలం, పశ్చిమ కనుమలలో వర్షాలు పడుతున్నా.. ఏమాత్రం తగ్గకుండా పండుగను ఘనంగా జరుపుకునేందుకు జనం ఏర్పాట్లు చేసుకున్నారు. చివరి రోజు శనివారం చెన్నై నగరంలోని టీ నగర్, పురసై వాక్కం, ప్యారిస్, తాంబరం, రాయపురం, క్రోంపేట, పాడి పరిసరాల్లోని అన్ని వాణిజ్య కేంద్రాలు కొనుగోలు దారులతో కిటకిట లాడాయి. అన్ని ప్రాంతాలూ సందడి సందడిగా కన్పించాయి. కొత్త బట్టలు, పండుగకు అవసరమయ్యే వస్తువులు, బాణసంచా, స్వీట్ల వ్యాపారం జోరుగా సాగింది. జనం భారీగా తరలి రావడంతో టీనగర్, రంగనాథ వీధి, పాండి బజార్, పురసై వాక్కం, డౌటన్, ప్యారీస్, ఎన్ఎస్‌సీ బోస్, ఎంసీ రోడ్డుల్లో పోలీసులు నిఘాతో వ్యవహరించారు. ఎప్పటికప్పుడు జనాన్ని అప్రమత్తం చేస్తూ వచ్చారు. చెన్నై కోయంబేడు మార్కెట్‌తో పాటు అన్ని రకాల మార్కెట్లలో పువ్వులు, పండ్ల ధరలకు అమాంతంగా రెక్కలు వచ్చాయి. ఈసారి దీపావళి ఆదివారం రావడంతో మాంసం వ్యాపారులకు కలిసి వచ్చినట్లయ్యింది. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు రెండు వందల కోట్లకు పైగా మేకలు, గొర్రెల విక్రయాలు జరిగాయి.

అప్రమత్తంగా..

దీపావళి పర్వ దినాన ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. రాష్ట్ర రాజధాని నగరం చెన్నైతో పాటు అన్ని ప్రధాన నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నిఘాతో వ్యవహరించాలని డీజీపీ శంకర్‌జివ్వాల్ ఆదేశించారు. దీంతో పోలీసు సిబ్బంది రోడ్డెక్కారు. వాహనాల తనిఖీల్లో నిమగ్నమయ్యారు. అలాగే నగరాల్లోని ప్రధాన కూడళ్లల్లో 24 గంటల పాటుగా సిఫ్ట్ పద్ధతిలో బృందాలు విధుల్ని నిర్వర్తించనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది సిబ్బంది భద్రతా విధుల్లోకి దిగారు. జన సంచారం అత్యధికంగా ఉండే ప్రదేశాల్లో ఈ సిబ్బంది విధుల్లో ఉంటారు. చెన్నైలో కమిషనర్ శంకర్‌జివ్వాల్ నేతృత్వంలో అదనపు కమిషనర్ల పర్యవేక్షణలో 18 వేల మంది సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొనున్నారు.

తస్మాత్ జాగ్రత్త

టపాకాయలు కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాటిని ఎలా పేల్చాలో అవగాహన కలిగించే రీతిలో అగ్నిమాపక శాఖ వర్గాలు ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా గుడిసె ప్రాంతాల్లో రాకెట్లు, గాల్లో పేలే ఇతర రంగు రంగుల బాణసంచాల్ని నిషేధించాలని సూచించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు మాత్రమే బాణసంచాలు కాల్చాలని, ఆ తర్వాత కాల్చితే గస్తీ సిబ్బంది చర్యలు తీసుకుంటారనే హెచ్చరికలు చేశారు. గుడిసె ప్రాంతాలకు సమీపంలో అగ్నిమాపక వాహనాల్ని ముందు జాగ్రత్త చర్యగా సిద్ధం చేశారు. అలాగే బాణసంచా పేల్చేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలతో కరపత్రాలను పంపిణీ చేశారు. ఇక పర్యావరణ శాఖ వర్గాలు సైతం రోడ్డెక్కాయి. ఎక్కడెక్కడ కాలుష్యం తీవ్రత ఎక్కువగా ఉంటుందో పరిశీలించేందుకు పలు చోట్ల ఏర్పాట్లు చేశాయి. శనివారం చెన్నైలో హఠాత్తుగా గాలి కాలుష్యం పెరగడం చర్చకు దారి తీసింది. టపాకాయల విక్రయాలకు సంబంధించి విధించిన ఆంక్షలు, నిబంధనల నేపథ్యంలో ఈసారి వ్యాపారం అంతంత మాత్రంగానే ఉండడం గమనార్హం. గతంలో లాగ పెద్దఎత్తున బాణసంచా కొనుగోలు చేయడానికి ప్రజలు సైతం ముందుకు రావడం లేదు. గిఫ్ట్ బాక్సు తరహాలో అన్ని రకాల బాణసంచాలు కలిగిన ప్యాక్‌ల వ్యాపారం అధికంగా జరుగుతున్నట్లు వర్తకులు పేర్కొంటున్నారు.

పండుగ శుభాకాంక్షలు

పండగను పరస్కరించుకుని గవర్నర్ ఆర్ఎన్ రవి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి, మాజీ సీఎం పన్నీరు సెల్వం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, పీఎంకే నేతలు రాందాసు, అన్బుమణి, డీఎండీకే అధినేత విజయకాంత్, కోశాధికారి ప్రేమలత విజయకాంత్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, రాష్ట్ర బీజేపీ కో ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎస్ఎంకే నేత శరత్‌కుమార్, ఇండియన్ యూనియన్ ముస్లీం లీగ్ నేత ఖాదర్ మొహిద్దీన్, అమ్మ మక్కల్‌మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ తదితరులు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వెలుగుల పండుగ దేశ సమగ్రాభివృద్ధిని కాంక్షించే రీతిలో ఉండాలని, ఈ పర్వ దినాన ప్రేమానురాగాలు వికసించాలని, వెలుగుల దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉత్సాహంగా, ప్రమాద రహితంగా పండుగను జరుపుకోవాలని పిలుపు నిచ్చారు.

జాగ్రత్తగా బస్సులు నడపండి: సీఎం

ప్రత్యేక బస్సులను నడుపుతున్న డ్రైవర్లు అప్రమత్తంగా జాగ్రత్తగా వెళ్లాలని, ప్రయాణికులకు భద్రత కల్పించి, సురక్షిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు. ప్రయాణికులకు తగిన గౌరవం ఇవ్వాలని రవాణాశాఖ ఉద్యోగులకు సూచించారు. ఇదిలా ఉండగా పూంమల్లి, మాదవరం బస్టాండ్‌లలో రవాణాశాఖ మంత్రి శివశంకర్ తనిఖీలు చేశారు. ప్రయాణికులతో మట్లాడారు. ఏదేని సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు.

స్వస్థలాలకు జనం



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వారంతా తమ స్వగ్రామాలకు తరలి వెళ్లారు. గత మూడు రోజులుగా ప్రత్యేక బస్సులు, రైళ్ల పరుగులు తీస్తున్నాయి. చెన్నై నగరంలో ప్రత్యేకంగా ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బస్టాండ్‌ల నుంచి వేలాదిగా ప్రత్యేక బస్సులు రోడ్డెక్కాయి. శుక్రవారం రాత్రి లక్షలాది మంది స్వస్థలాలకు బయలు దేరి వెళ్లారు. దీంతో చెన్నై శివారు ప్రాంతాలు వాహనాలు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కాయి. టోల్ గేట్ల వద్ద కిలో మీటర్ల కొద్ది వాహనాలు బారులు తీరాయి. శని, ఆది, సోమవారాలు పండుగకు సెలవు రావాడం ప్రజలకు కలిసి వచ్చినట్లయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నడిపిన బస్సుల ద్వారా 10 లక్షల మంది చెన్నై నుంచి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లినట్టు రవాణా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని చార్జీల దోపిడీకి పాల్పడే ఆమ్నీ ప్రైవేటు బస్సుల భరతం పట్టే విధంగా రవాణా వర్గాలు ముందుకు వెళ్లాయి. ఇదిలా ఉండగా పండుగ వేళ మందు బాబుల కోసం రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాల్లో వివిధ రకాల బ్రాండ్లను మార్కెటింగ్‌శాఖ అధికారులు కొలువుదీర్చారు. తండర్ బోల్ట్, గాడ్ ఫాదర్ పేరిట రెండుకొత్త రకం బీర్లను పండుగ వేళ పరిచయం చేశారు.



ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు



టీ.నగర్ రంగనాథన్ వీధిలో రద్దీ



ప్రమాద రహిత దీపావళిపై విద్యార్థుల అవగాహన కార్యక్రమం



భద్రతా విధుల్లో మహిళా పోలీసు

ఎంజీఆర్ సోదరుడిగా మెరుపులు

- కోలీవుడ్‌తో చంద్రమోహన్‌కు ఆత్మీయ అనుబంధం



చంద్రమోహన్ (ఫైల్)

తమిళసినిమా: సినిమా ముద్దు బిడ్డలు చాలా తక్కువ మందే ఉంటారు. అందులో నటుడు చంద్రమోహన్ పేరు కచ్చితంగా ఉంటుంది. ఎల్లలు దాటిన నటకులోత్తముడు ఈ చంద్రమోహనుడు. ఐదు దశాబ్దాలకు పైగా అలుపెరుగని నట దురంధరుడు. అందరికీ కావలసిన చంద్రమోహన్ నట జీవితం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది చెన్నైనే. ఇక్కడే సాధారణ వ్యక్తి నుంచి అసాధారణ నటుడిగా ఎదిగిన చంద్రమోహన్. ఆబాల గోపాలానికి ఇష్టుడిగా ముద్రపడ్డారు. అందుకే భాషా భేదం, పక్షపాతం చూడకుండా అన్ని భాషల వారి ఆదరణను పొందిన అతి కొద్దిమంది నటుల్లో ఆయన కూడా స్థానం సంపాదించుకున్నారు. చెన్నై రంగరాజపురంలోని యునైటెడ్ కాలనీ చంద్రమోహన్ నివాసం తెలియని చిత్ర ప్రముఖులకు, సినీ ప్రియులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆయన ఇంటి పక్కనే దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్ నివాసం. వీరిద్దరి మధ్య సినిమాకు అతీతమైన అనుబంధం. చంద్రమోహన్ తెలుగుతో పాటు తమిళం, మలయాళం సినీ ప్రేక్షకులకు సుపరిచితులే. ముఖ్యంగా తమిళంలో మక్కళ్ తిలకం ఎంజీఆర్‌తో కలిసి నటించిన ఘనత సాధించారు. నాన్ నమదే అనే సూపర్ హిట్ చిత్రంలో ఎంజీఆర్ కు తమ్ముడిగా చంద్రమోహన్ నటించి తమిళ ప్రేక్షకుల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచి పోయారు. ఆ చిత్రంలో ఎంజీఆర్‌తో కలిసి చంద్రమోహన్ నటించిన అన్బు మలర్ అనే పాట క్లాసిక్‌గా నిలించింది. మరో విషయం ఏమిటంటే ఈ తెలుగులో ఎన్‌టీఆర్, మురళీమోహన్, బాలకృష్ణ కలిసి నటించిన అన్నదమ్ముల అనుబంధం చిత్రానికి రీమేక్. ఇకపోతే చంద్రమోహన్ తమిళంలో కథానాయకుడిగా నటించిన చిత్రం సీయా. నటి శ్రీప్రియ కథానాయకిగా నటించి నిర్మించిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఏ తరహా పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసే చంద్రమోహన్ నటుడిగా ఎప్పటికీ చిరంజీవే అంటే అతిశయోక్తి కాదు.

అమర ప్రసాద్‌రెడ్డి సహా ఆరుగురికి బెయిల్

సాక్షి, చెన్నై : బీజేపీ నేత అమర ప్రసాద్‌రెడ్డి సహా ఆ పార్టీకి చెందిన ఆరుగురు నేతలకు శనివారం బెయిల్ లభించింది. చెన్నై శివారులోని పనయూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నివాసం ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ వంద అడుగుల బీజేపీ జెండా ఏర్పాటు చేయడానికి గత నెల బీజేపీ వర్గాలు చేసిన ప్రయత్నం వివాదానికి దారి తీసింది. ఈ వివాదంలో ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేశారన్న నెపంతో బీజేపీ నేతలు అమర ప్రసాద్‌రెడ్డి సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఈ వ్యవహారాన్ని బీజేపీ జాతీయ అధిష్టానంపై సైతం తీవ్రంగా పరిగణించింది. ప్రత్యేక బృందం విచారణ చేసి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా, తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు నివేదికను సమర్పించింది. ఈ పరిస్థితుల్లో అరెస్టయిన అమర ప్రసాద్‌రెడ్డి పాటుగా ఆరుగురికి బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

ఇకపై రెండు స్వదేశీ టెర్మినళ్లు

- ప్రయాణికుల కోసం చెన్నై ఎయిర్ పోర్టులో ప్రత్యేక ఏర్పాట్లు
- 15వ తేదీ నుంచి ఉపయోగంలోకి..
- ట్రయల్ రన్‌పై దృష్టి ఈ



చెన్నై విమానాశ్రయంలోని టెర్మినల్

సాక్షి, చెన్నై: ప్రయాణికుల సేవ కోసం స్వదేశీ టెర్మినల్‌ను రెండుగా విభజించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చెన్నై విమానాశ్రయంలో పూర్తయ్యాయి. ట్రయల్ రన్ తదుపరి ఈనెల 15వ తేదీ నుంచి కొత్త కొత్త టెర్మినల్‌లో స్వదేశీ విమానాల టేకాఫ్ ల్యాండింగ్‌పై అధికారులు దృష్టి పెట్టనున్నారు. వివరాలు.. చెన్నై మీనంబాక్కంలో అంతర్జాతీయ, స్వదేశీ టెర్మినల్ సేవలతో విమానాల టేకాఫ్‌లు ల్యాండింగ్‌లు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇక్కడ నిత్యం పెరుగుతున్న విమానాలు, ప్రయాణికుల రద్దీతో అంతర్జాతీయ హంగులతో నిర్మాణాలను వేగవంతం చేశారు. విమానాశ్రయం పరిసరాల్లో సినిమా థియేటర్ మాల్ సైతం రూపుదిద్దుకుంది. ఇక 2.21 లక్షల చదరపు అడుగులలో రూ. 2,467 కోట్లతో భారీ టెర్మినల్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 2వ విదేశీ టెర్మినల్ అంతర్జాతీయ హంగులతో సిద్ధం చేశారు. జూలై నుంచి ఇక్కడ విదేశీ విమానాల సేవలు జరుగుతున్నాయి. చెన్నై విమానాశ్రయంలో మొత్తంగా నాలుగు టెర్మినల్స్ ఉన్నాయి. ఇందులో ఒకటో టెర్మినల్‌ను స్వదేశీ విమానాల సేవలకు ఉపయోగిస్తున్నారు. కొత్తగా రూపుదిద్దుకున్న రెండో టెర్మినల్‌లో విదేశీ విమాన సేవలు అందుతున్నాయి. 3,4 టెర్మినల్స్ పాతవి. ఇందులో 3 టెర్మినల్‌ను ప్రస్తుతం కూల్చి వేసి ఆ స్థానంలో కొత్త టెర్మినల్ సిద్ధం చేయడానికి చర్యలు తీసుకున్నారు. 4వ టెర్మినల్ పటిష్టంగా ఉండటంతో దీనిని స్వదేశీ విమాన సేవలకు వినియోగించుకునేందుకు నిర్ణయించారు.

అదనంగా..

స్వదేశీ విమాన సేవలకు ఇది వరకు ఒకే టెర్మినల్ ఉండగా ప్రస్తుతం ప్రయాణికుల సేవ కోసం రెండుగా విభజించారు. ఒకటి, నాలుగు టెర్మినల్స్‌ను స్వదేశీ విమాన సేవలకు వినియోగించనున్నారు. స్వదేశీ టెర్మినల్‌లో ఇందుకు సంబంధించిన పనులు ముగిశాయి. ఈనెల 15వ తేదీ నుంచి ఉపయోగంలోకి ఈ టెర్మినల్ రాబోతోంది. ఇందులో భాగంగా ఈనెల 14వ తేదీ ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ రోజు ఉదయం 10.20 గంటలకు హైదరాబాద్ నుంచి వచ్చే ఎయిర్ ఇండియా విమానాన్ని 4వ టెర్మినల్‌లో ల్యాడింగ్ చేయనున్నారు. ఇదే విమానం 11.10 గంటలకు ఈ టెర్మినల్ నుంచి బెంగళూరుకు టేకాఫ్ తీసుకోనుంది. ఒకటి, నాలుగు టెర్మినల్స్‌లలో ఏఏ విమానాలు బయలు దేరుతాయో అన్న వివరాలను విమానాశ్రయం పరిసరాలలో ఎల్ఈడీ స్క్రీన్స్‌లలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒకటో టెర్మినల్‌లో ఇండిగో, స్పైస్ జెట్, విస్తారా తదితర విమానాలు, 4వ టెర్మినల్‌లో ఎయిర్ ఇండియా, ఎయిర్ లైన్స్, ఏయిర్ అలయన్స్ తదితర స్వదేశీ విమానాల సేవలు అందనున్నాయి.



దెబ్బతిన్న బస్సులు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ భాస్కర పాండియన్

రెండు బస్సులు ఢీ

- ఆరుగురి మృతి
- 27 మందికి గాయాలు
- రక్త సిక్తమైన జాతీయ రహదారి
- స్తంభించిన ట్రాఫిక్
- క్షతగాత్రులను తరలిస్తుండగా గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

వేలూరు: వానియంబాడి సమీపంలో రెండు బస్సులో ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఆరుగురు మృతి చెందగా సుమారు 35 మంది ప్రయాణికులకు గాయాలైంది. వివరాలు.. తిరుపత్తూరు జిల్లా వానియంబాడి సమీపంలోని శెట్టియప్పనూరు వద్ద శనివారం వేకువ జామున 4.30 గంటల సమయంలో బెంగుళూరు నుంచి వస్తున్న ప్రభుత్వ బస్సు జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొని మరో రోడ్డుపైకి వెళ్లింది. ఈ క్రమంలో చెన్నై నుంచి వస్తున్న పవేటు బస్సును అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల డ్రైవర్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, రెండు బస్సులో ప్రయాణం చేస్తున్న వారందరూ ఒక్కసారిగా కేకలు వేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు ప్రమాద స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు గ్రామస్తుల సాయంతో క్షత గాత్రులను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఉలుందూరుపేటకు చెందిన ప్రభుత్వ బస్సు డ్రైవర్ ఏయుమలై(46), కర్ణాటక రాష్ట్రం బరోడా ప్రాంతానికి చెందిన నదీమ్(49), ప్రైవేటు బస్సు డ్రైవర్ వానియంబాడి సమీపంలోని బూదూరు గ్రామానికి చెందిన మహ్మాద్ (52), ఆంధ్ర రాష్ట్రం చిత్తూరుకు చెందిన అజిత్ (52), చెన్నైకి చెందిన కృతిక (35), చెన్నై అడయారుకు చెందిన రాజీ (32) మృతి చెందారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న కలెక్టర్ భాస్కర పాండియన్, డీఐజీ ముత్తుస్వామి, సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన 27 మంది క్షతగాత్రులను వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కలెక్టర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన చికిత్స అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు వానియంబాడి పోలీసులు మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం తిరుపత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు బస్సులకు చెందిన ఇద్దరు డ్రైవర్‌లు ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఇక తీవ్రంగా గాయ పడిన క్షత గాత్రులను చూసి వానియంబాడి హెడ్ కానిస్టేబుల్ మురళి(52) గుండె పోటు రావడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు.



పోలీస్ కానిస్టేబుల్ మురళి (ఫైల్)

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : మంత్రి గాంధీ



లబ్ధిదారులకు వెయ్యి రూపాయలను అందజేస్తున్న మంత్రి గాంధీ

తిరువళ్లూరు: ప్రభుత్వ పథకాల వర్తింపులో అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటూ రెండవ విడతలో 1,310 మందిని అర్హులను గుర్తించి వారికి వెయ్యి రూపాయల పథకాన్ని వర్తింపజేసినట్లు రాష్ట్ర చేనేతశాఖ మంత్రి రాణిపేట గాంధీ స్పష్టం చేశారు. తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా మహిళ హక్కు పథకం కింద అర్హులను గుర్తించి రెండో విడతలో వెయ్యి రూపాయలను అందించే కార్యక్రమం కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ అధ్యక్షతన శనివారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి గాంధీ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా అర్హులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలను వర్తింప చేసినట్లు మంత్రి తెలిపారు. అర్హుల గుర్తింపులో కొంత మంది లబ్ధిదారులు లేరనే ఫిర్యాదుతోనే తాము రెండో విడతలో అర్హులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలను వర్తింప చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.63 కోట్లు మంది మహిళ హక్కు పథకానికి దరఖాస్తు చేసుకుంటే వారిలో 1.06 కోట్ల మందికి పథకాన్ని వర్తింప చేశామన్నారు. ఇందుకోసం రూ.1,065 కోట్లు అందజేస్తున్నట్టు మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో అర్హులను ఒక్కరికీ అన్యాయం జరగదన్నారు. ఎమ్మెల్యేలు కృష్ణస్వామి, గణపతి, దురైచంద్రశేఖర్, ఎంపీ జయకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన సెల్ఫీ

అన్నానగర్: సెంబరంబాక్కం కొలనులో శనివారం సెల్ఫీ తీసుకుంటూ ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. వివరాలు.. పూందమల్లి విఘ్నేష్ నగర్ కు చెందిన ముజామిల్ (30). ఇతను తన స్నేహితుడు జీవాతో కలిసి బైకులో సెంబరంబాక్కం కొలను వద్దకు వెళ్లారు. అక్కడ ఇద్దరూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ తీసుకుంటుండగా ముజామిల్ కాలు జారి సరస్సులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. జీవానంద అతడిని రక్షించలేక పోయాడు. వెంటనే దీనిపై కుండ్రత్తూరు పోలీసులకు సమాచారం అందించగా.. కుండ్రత్తూరు పోలీసులు, పూందమల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ముజామిల్ మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుండ్రత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19 కిలోల షార్క్ రెక్కలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న షార్క్ రెక్కలు

అన్నానగర్: చెన్నై విమానాశ్రయం నుంచి శుక్రవారం సింగపూర్‌కు అక్రమంగా తరలించేందుకు యత్నించిన 19 కిలోల షార్క్ రెక్కలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై మీనంబాక్కం అంతర్జాతీయ చిత్రం విమానాశ్రయం నుంచి కొలంబోకు విమానం వెళ్లటానికి సిద్ధమైన విమానంలోని ప్రయాణికుల లగేజ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో కరూర్‌కు చెందిన సహాల్ అమీదు (59) కొలంబో మీదుగా సింగపూర్ వెళ్లేందుకు పవర్ టూరిస్ట్ వీసాపై ఉన్నాడు. అతని వస్తువులను తనిఖీ చేయగా వస్తువుల లోపల పెద్దపెద్ద పొట్లాలలో 19 కిలోల సొరచేప రెక్కలను గుర్తించారు. అంతరం అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.

టపాకాయలు పేలి మహిళ మృతి

అన్నానగర్: శివగంగై జిల్లా సింగంపునరి ప్రాంతానికి చెందిన 55 ఏళ్ల మహిళ మనవడు శుక్రవారం సాయంత్రం టిఫిన్ బాక్సులో క్రాకర్స్ పేల్చడంతో అది ముక్కలైంది. అందులో ఒక ముక్క బాలుడి అమ్మమ్మకి తగిలి గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను రక్షించి సింగంపునరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదురై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేలూరు, తిరువణ్ణామలైలో ప్రదోష పూజలు

వేలూరు : వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని ఆలయాల్లో ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం ప్రదోష పూజలను నిర్వహించారు. ముందుగా తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని అధికార పెద్ద నంది భగవాన్‌కు శివాచార్యులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టి కాయ కూరలు, పుష్పాలంకరణ చేపట్టారు. అనంతరం భక్తుల అధిక సంఖ్యలో చేరుకొని హరోం హర నామ స్మరణ మధ్య కర్పూర హారతులు పట్టారు. అనంతరం స్వామివార్లను అధికార నంది వాహనంలో ఆశీనులు చేసి మాడ వీధుల్లో మేళ తాళాల నడుమ ఊరేగించారు. అదే విధంగా వేలూరు కోట మైదానంలోని జలకంఠేశ్వరాలయంలో నంది భగవాన్‌కు శివాచార్యులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి కాయకూరలతో అలంకరించారు. అనంతరం నంది భగవాన్‌కు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, రాణిపేట వంటి జిల్లాలోని శివాలయాల్లోని నంది భగవాన్‌కు పూజలు నిర్వహించారు.



అరుణాచలేశ్వరాలయంలో అధికార పెద్ద నంది భగవాన్‌కు అభిషేకం చేస్తున్న శివాచార్యులు

ఏనుగు దాడిలో కార్మికుడు దుర్మరణం

అన్నానగర్: ఈరోడ్ జిల్లా, భవానీసాగర్, కొత్తమంగళం సమీపంలోని ఇందిరా నగర్‌కు చెందిన సెంటన్ (46) కూలీ కార్మికుడు. ఇతని భార్య ప్రేమ. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు సెందన్ ఇందిరా నగర్‌లోని ధర్మాన్ పొలం వద్ద ఆవు పాలు పితకటానికి సైకిల్‌పై సెంటన్ వెళ్తున్నాడు. అప్పుడు ఓ ఏనుగు పొదలో నుంచి బయటకు వచ్చి అకస్మాత్తుగా సెంటన్‌పై దాడి చేసింది. దీంతో అతడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో ఎర్రచందనం నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్ట్

పళ్లిపట్టు: సువాసన, పరిమళం నిండిన స్నానపు సోపులు తయారు చేయనున్నట్లు ఇందులో ఎర్రచందనం, చందనం వినియోగించనున్నట్లు సామాజిక మాద్యమాల్లో ఓ వ్యక్తి ప్రచారం చేస్తూ అటవీ శాఖ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఆర్కేపేట యూనియన్ వెడియంగాడు పుధూర్ గ్రామానికి చెందిన మురుగేశన్(33) పరిమళంతో కూడిన సబ్బులు తయారు చేయనున్నట్లు సామాజిక మాద్యమాల్లో భారీగా ప్రచారం చేశాడు. పళ్లిపట్టు ఫారెస్ట్ రేజంర్లు శరవణన్, నిర్మల్‌రంజన్ బృందం మురుగేశన్ ఇంట్లో సోదాలు చేపట్టగా ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా 25 కేజీల ఎర్రచందనం దుంగలు, నాలుగు కేజీల చందనం నిల్వ వుంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి తిరుత్తణి సబ్ జైలుకు తరలించారు.



అటవీశాఖ అధికారుల కస్టడీలో మురుగేశన్

ప్రభుత్వ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

అన్నానగర్: చెన్నై కోయంబేడు పోలీస్ స్టేషన్ సమీపంలోని కాళియమ్మన్ కోయిల్ స్ట్రీట్ వద్ద శుక్రవారం రాత్రి 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా పెరంబలూరు నుంచి కోయంబేడు బస్టాండ్ వెళ్తున్న ప్రభుత్వ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు చక్రం అతని కాలుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కోయంబేడు ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి పెరంబలూరు జిల్లాకు చెందిన ప్రభుత్వ బస్సు డ్రైవర్ బాల్ రాజ్ (48)ని అరెస్టు చేశారు.

నవ వధువు ఆత్మహత్య

తిరుత్తణి: వివాహమైన ఎనిమిది నెలలకే వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటనకు సంబంధించి ఆర్డీఓ విచారణ చేపట్టారు. వివరాలు.. తిరువలంగాడు యూనియన్ తాళవేడు గ్రామానికి చెందిన కలైసెల్వి(28)కి ప్రసాద్ అనే వ్యక్తితో ఎనిమిది నెలల కిందట వివాహమైంది. ఈ క్రమంలో ఆరు నెలలుగా కలైసెల్వి భర్త అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో నవ వధువు తీవ్ర ఆవేదనతో వుండేవారని ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఒంటరిగా వున్న సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. సంఘటనకు సంబంధించి తిరుత్తణి పోలీసులుకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు - కారు ఢీ

• ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

అన్నానగర్: క్రోంపేటలో శుక్రవారం రాత్రి బైకు - కారు ఢీకొనడంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. తాంబరం సమీపం అనకాపుత్తూరు, రామలింగం స్వామి మఠానికి చెందిన మహేశ్వరన్ (19). ఇతను సేలయూరులో ప్రైవేట్ కళాశాలలో ప్రథమ వార్షిక మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. చదువుకుంటూ పార్ట్ టైమ్, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగంలో చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఫుడ్ సరఫరా కోసం క్రోంపేట్ జీఎస్టీ రోడులో మహేశ్వరన్ వస్తున్నాడు. అంతలో వెనుకగా వస్తున్న కారు మహేశ్వరన్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్వరన్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే ప్రమాదానికి కారణమైన పల్లవరానికి చెందిన కారు డ్రైవర్ మురుగేశన్ (28)ని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు.

'ఉయిరుళ్లవరై ఉషా' హీరో కన్నుమూత



గంగా (ఫైల్)

తమిళ సినిమా: సినీ నటుడు గంగా (53) శుక్రవారం సాయంత్రం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఈయన టి.రాజేందర్ దర్శకత్వం వహించిన ఉయిరుళ్లవరై ఉషా చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అయ్యారు. నటి నళిని హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం అప్పట్లో ఘనవిజయం సాధించింది. దీంతో నటుడు గంగాకు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. అలా క్రైం తొడుమ్ అలైగళ్, మురుగేశన్ తునై, మామండ్రం, సావిత్రి వంటి చిత్రాల్లో నటించారు. ఆ తరువాత హీరోగా అవకాశాలు రాకపోవడంతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ నటించారు. కొన్ని టీవీ సీరియల్స్‌లో నటించిన గంగా మరికొన్ని టీవీ సీరియల్స్‌కు దర్శకత్వం కూడా వహించారు. స్థానిక మైలాపూర్‌లో నివశిస్తున్న ఈయన అవివాహితుడన్నది గమనార్హం. కాగా శుక్రవారం సాయంత్రం హఠాత్తుగా గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచారు. ఈయన భౌతిక కాయాన్ని సొంతూరు చిదంబరం సమీపంలోని భరత్తూర్ చావడి గ్రామానికి తరలించి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

కొరుక్కుపేట: అరియలూర్, తిరువారూర్ సహా వివిధ జిల్లాల నుంచి చాలా మంది చికిత్సల కోసం తంజావూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి వస్తుంటారు. పరిస్థితి విషమించి మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తుల శవాలను మార్చురీలో భద్రపరుస్తుంటారు. నిర్దేశించిన సమయంలో బంధువులు ఎవరూ రాకపోవడంతో అనాథశవాలుగా పరిగణిస్తారు. ఈ క్రమంలో తంజావూరు వైద్య కళాశాల ఎస్ఎస్ఐ మనోహరన్, ఎట్టు రఘునాథన్‌ తమ సొంత ఖర్చులతో మృతదేహాలను పూడ్చిపెట్టారు. శుక్రవారం 10 మృతదేహాలను క్లెయిమ్ చేయకుండా మార్చురీలో ఉంచినట్లు తేలింది. దీంతో పోలీసులు ఆయా మృతదేహాలను తమ సొంత ఖర్చులతో ఖననం చేస్తామని ఆస్పత్రి నిర్వాహకులకు సమాచారం అందించారు. అంగీకరించిన ఆస్పత్రి యాజమాన్యం సంబంధిత ధ్రువపత్రాలతో పోలీసుల సంతకం చేసి అంత్యక్రియలకు తరలించేందుకు అనుమతించింది. మృతదేహాలను అంబులెన్స్‌లోమారుతు వామణి సమీపంలోని శ్మశాన వాటికకు తరలించారు. మృతదేహాలకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.




మృతదేహాలను ఖననం చేస్తున్న పోలీసులు

మప్పేడు వాసుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

తిరువళ్లూరు: మప్పేడు గ్రామంలో తాగునీరు కలుషితమవుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ మప్పేడులో సుమారు 1000 మంది నివాసం ఉంటున్నారు. ఈ గ్రామంలో తాగునీరు పైప్‌లైన్ ఇటీవల దెబ్బతింది. పైప్‌లైన్ మరమ్మతుల కోసం ఇటీవల తవ్వకాలను చేపట్టారు. అయితే ఆ పనులు ఆలస్యమైనట్టు తెలుస్తుంది. దీంతో తాగునీరు పైప్‌లైన్‌లో మురుగునీరు కలిసి కలుషితమవుతోంది. ఇదే విషయంపై పలుమార్లు అధికారులు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో స్థానికులు శనివారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. పైప్‌లైన్ పగిలిన ప్రాంతాన్ని వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కాగా రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారితో చర్చలు జరిపారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



సలార్ చిత్రంలో ప్రభాస్

ఉదయనిధి స్టాలిన్ ఖాతాలో
సలార్

తమిళసినిమా: ఇప్పుడు ప్రపంచ సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం సలార్. ఇందుకు కారణాలు చాలానే ఉన్నాయి. ఫస్ట్ హైలైట్ నటుడు ప్రభాస్. సెకండ్ దర్శకుడు ప్రశాంత్ నీల్. థర్డ్ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలె ఫిలింస్. ఇంకా మలయాళ స్టార్ పృధ్వీరాజ్, సంచలన నటి శృతిహాసన్ ఇంకా అదనపు హంగులు చాలానే ఉన్నాయి. కేజీఎఫ్ పార్ట్ 1, 2 వంటి సంచలన విజయాలను సాధించిన సంస్థ హోంబలె నిర్మాత, దర్శకుడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం సలార్. నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం ఇది. చిత్రం టీజర్ ఇప్పటికే విడుదలైన సలార్‌పై అంచనాలను పెంచింది. చిత్ర విడుదలను నిర్మాత అధికారికంగా ప్రకటించేశారు. డిసెంబరు 22న ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాల మధ్య తెర పైకి రానుంది. ఈ చిత్రాన్ని కర్ణాటకలో హోంబలె సంస్థ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇక తమిళనాడు విడుదల హక్కులను రాష్ట్ర క్రీడా శాఖామంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ సొంతం చేసుకుంది. దీని గురించి ఆ సంస్థ ఒక పోస్టర్ ను విడుదల చేసి అధికారికంగా ప్రకటించారు. దీంతో తమిళనాడులోనూ సలార్ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.




సంచనా నటరాజన్

సత్తా చాటుతున్న
సంచనా నటరాజన్

తమిళసినిమా: పాన్ ఇండియా నటిగా పేరు తెచ్చుకుంటున్న నటి సంచనా నటరాజన్. అందం అంతకుమించిన అభినయం, చక్కని తమిళ వాచకం వంటి అర్హతలు కలిగిన ఈ చెన్నై వాసి నటిగా 2014లో రంగ ప్రవేశం చేశారు. అలా గత తొమ్మిదేళ్లుగా తమిళం, తెలుగు, మలయాళం, ఆంగ్లం భాషల్లో నటనకు అవకాశం ఉన్న పాత్రల్లో నటిస్తూ మంచి గుర్తింపు పొందుతున్నారు. అందమైన ముఖం, ఆకాశమయమైన పరువం కలిగినా కథానాయకిగా మాత్రమే నటిస్తానని భీష్మించుకుని కూర్చోకుండా నటనకు అవకాశం ఉంటే ఎలాంటి పాత్రనైనా చేయడానికి సిద్ధమనే ఈమె బావనే మంచి నటిగా నిలబెట్టిందని చెప్పవచ్చు. ఇక ప్రతి పని గుర్తించడంలో ముందుండే దర్శకుడు పా రంజిత్ తాను దర్శకత్వం వహించిన సార్పట్ట పరంపరై చిత్రం ద్వారా సంచనా నటరాజన్‌ను కోలీవుడ్ కు పరిచయం చేశారు. అందులో నటుడు కలైయరసన్ కు జంటగా నటించి పలువురి ప్రశంసలను అందుకున్న సంచనా నటరాజన్ తమిళ చిత్ర పరిశ్రమ దృష్టిని తనవైపుకు తిప్పుకున్నారు. ప్రస్తుతం ఈమె బాటిల్ రాధ, పోర్ అనే తమిళ చిత్రాలతో పాటు టికీ టక అనే మలయాళ చిత్రంలోని నటిస్తున్నారు. కాగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రాఘవ లారెన్స్, ఎస్‌జే. సూర్య కథానాయకులుగా నటించిన జిగర్తండ డబుల్ ఎక్స్ చిత్రంలో నటి సంచనా నటరాజన్ కీలకపాత్రను పోషించారు. ఇందులో ఈమె నటుడు భార్యగా నటించడం విశేషం. శుక్రవారం తెర పైకి వచ్చిన ఈ చిత్రం సక్సెస్ ఫుల్‌గా ప్రదర్శింపబడుతోంది. ఇందులో ఒక పాత్రగా జీవించిన నటి సంచనా నటరాజన్ కు పలువురు సినీ ప్రముఖుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. మరిన్ని వైవిధ్య భరితమైన కథా పాత్రల్లో నటించి పేరు తెచ్చుకుంటానని నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

కోలీవుడ్ టాక్స్

మాలీవుడ్‌లో దడ పుట్టిస్తున్న
మిల్కీ బ్యూటీ



తమిళసినిమా: తమన్నా.. ఇది ఇప్పుడు పేరు కాదు. గ్లామర్‌కు బ్రాండ్. అదీ హైపర్ బ్రాండ్. ఎక్కడైనా, ఎప్పుడైనా తన ప్రత్యేకతను చాటుకోవాల్సిందే, వార్తల్లో మారుమోగాల్సిందే. దట్ ఇస్ మిల్కీ బ్యూటీ. ఇటీవల జైలర్ చిత్రంలో నువ్వు కావాలయ్యా పాటలో విజృంభించి అందాలను ప్రదర్శించిన తమన్నకు ఇప్పుడు క్రేజ్ మామూలుగా లేదు. కాగా ఇప్పటివరకు హిందీ, తెలుగు, తమిళం భాషల్లో నటిగా తన సత్తాను చాటుకున్న తమన్న తాజాగా తన పేరును మాలీవుడ్ కు విస్తరింపచేసుకుంది. అక్కడ పాదం మోపింది లేదో మాలీవుడ్ హీరోయిన్లకు దడ పుట్టించింది. నటుడు దిలీప్ కథానాయకుడుగా నటించిన బాంద్రా అనే చిత్రంతో తమన్నా కథానాయకిగా మలయాళం చిత్ర పరిశ్రమలోకి రంగప్రవేశం చేసింది. ఈ చిత్రం శుక్రవారం తెరపైకి వచ్చింది. ఈ చిత్ర ప్రమోషన్‌లో నటుడు దిలీప్ పేర్కొంటూ ఈ చిత్ర కథ పూర్తి అయిన తర్వాత ఇందులో ఇప్పటివరకు మలయాళంలో నటించని, తనతో జతకట్టని నటిని హీరోయిన్‌గా నటింపజేయాలని భావించారన్నారు. దీంతో చాలా గట్స్ కలిగిన ఈ పాత్రకు నటి తమన్న అయితే బాగుంటుందని అనిపించిందన్నారు. దర్శకుడు అరుణ్ గోపీ ఎలాగో తమన్నాకు కథ వినిపించి ఆమె అనుమతి పొందారన్నారు. అయితే చిత్ర ప్రారంభోత్సవ పూజ వరకు ఆమె ఇందులో నటిస్తారనే నమ్మకం తనకు లేదన్నారు. మరో విషయం ఏమిటంటే ఇందులో తమన్నా కాకుండా మరో ముఖ్యపాత్ర ఉందని ఆ పాత్రలో నటింప చేయడానికి పలువురు నటీమణులను సంప్రదించగా, తమన్నా ఉంటే చిత్రంలో తాము కనిపించమని భావించి ఇందులో నటించడానికి నిరాకరించారన్నారు. ఇలా తొలి చిత్రంతోనే మిల్కీ బ్యూటీ మాలీవుడ్ హీరోయిన్ల గుండెల్లో దడ పుట్టించిందన్నమాట. అయితే నటి మమతా మోహన్ దాస్ ఆ చిత్రంలో మరో పాత్ర నటించడానికి ధైర్యంగా ముందుకు వచ్చిందట.

భాగ్యరాజ్ డిటెక్టివ్‌గా
'మూండ్రామ్ మనిదన్'



చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఏ చంద్రశేఖరన్, ఎస్పీ ముత్తురామన్, భారతీరాజా

తమిళసినిమా: సీనియర్ దర్శకుడు, నటుడు కె. భాగ్యరాజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం మూండ్రామ్ మనిధన్. రాందేవ్ దర్శకత్వం వహిస్తున్న ఇందులో నటి సోనియా అగర్వాల్ , శ్రీనాథ్, ప్రణ, సూదుకవ్వుమ్ శివకుమార్, రిషి కాంత్, రాందేవ్ రాజగోపాలన్, మధురై జ్ఞానం ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. రాందేవ్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి డాక్టర్ ఎం. రాజగోపాలన్, డాక్టర్ శాంతి రాజగోపాలన్, డాక్టర్ పి అళగురాజా, మధురై సి ఏ .జ్ఞానోదయ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇందులో కె. భాగ్యరాజ్ డిటెక్టివ్‌గా నటిస్తున్నట్లు చెప్పారు. ఈయన ఇంతకుముందే రుద్ర అనే చిత్రంలో రహస్యంగా ఇన్వెస్టిగేషన్ చేసి పోలీసులకు వివరాలను తెలియజేసే పాత్రల్లో నటించారని గుర్తు చేశారు. అయితే అందులో ఆయన పాత్ర దొంగగా చిత్రీకరించబడిందని, తమ చిత్రంలో ఎలాంటి సాక్షాధారాలు లేకుండా జరిగిన ఒక హత్యను డిటెక్టివ్ అయిన భాగ్యరాజ్ ఎలా చేదించారు అనే ఇతివృత్తంతో రూపొందిస్తున్న చిత్రం మూండ్రామ్ మనిధన్ అని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో భార్య భర్తల మధ్య జరిగే సమస్యలు ఇతివతంతో సస్పెన్స్ థ్రిల్లర్ ఘటనలతో కూడిన ఈ చిత్ర షూటింగును తేని, కొడైకెనాల్, చెన్నై తదితర ప్రాంతాల్లో నిర్వహించినట్లు తెలిపారు. కాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సీనియర్ దర్శకులు ఎస్పీ ముత్తురామన్, ఎస్ ఏ.చంద్రశేఖర్, భారతీరాజా చేతులు మీదుగా విడుదల చేసినట్లు చెప్పారు. కాగా ఈ చిత్రం ద్వారా వేణు శంకర్, దేవ్ జీని సంగీత దర్శకులుగా పరిచయం చేస్తున్నట్లు, నేపథ్య సంగీతాన్ని పి.అమ్రిష్ అనే నవ సంగీత దర్శకుడు అందిస్తున్నట్లు చెప్పారు.

డిసెంబర్‌లో కొటేషన్ గ్యాంగ్

తమిళసినిమా: కొటేషన్ గ్యాంగ్ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఫిల్మిటీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై గాయత్రి సురేష్ వివేకానందం కలిసి నియమిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కుమార్ కర్నాల్ నిర్వహించారు. నటి ప్రియమణి బాలీవుడ్ సన్నీలియోన్ సారా అర్జున్, గాయత్రి రెడ్డి, అస్రాప్ మల్లిస్సేరి, జయప్రకాష్, అక్షరా తదితరులు ప్రధానపాత్రలు పోషించిన ఈ చిత్రానికి డ్రమ్స్ శివమణి సంగీతాన్ని అరుణ్ పద్మనాభన్ ఛాయాగ్రహణం అందించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ నెల రెండు వారంలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం చెన్నైలోని ఒక స్టూడియోలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శక నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు కొటేషన్ గ్యాంగ్ చిత్ర వివరాలను తెలుపుతూ ఇది హైపర్ లింక్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. మంచి యాక్షన్ కథాచిత్రం చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానన్నారు. కేరళలో కొటేషన్ గ్యాంగ్ ఉన్నారనే వార్త పేపర్‌లో చదివానన్నారు. దాన్ని బేస్ చేసుకుని తయారు చేసుకున్న కథాచిత్రమే ఇది అని చెప్పారు. ఇది నటి ప్రియమణి కోణంలో సాగుతుందన్నారు. చెన్నై, ముంబై, కాశ్మీర్‌లో జరిగే మూడు కథలు ముంబైలో కలుస్తాయని, డబ్బు కోసం ఎలాంటి పని అయినా ఆలోచించకుండా చేసే కూలి ముఠా ఇతివృత్తమే కొటేషన్ గ్యాంగ్ చిత్రం అన్నారు. చిత్రంలో భారీ యాక్షన్ సన్నివేశాలు చోటు చేసుకుంటాయని, నటి ప్రియమణి చేసే పోరాట సన్నివేశాలు ఆకట్టుకుంటాయని చెప్పారు. ఇప్పుడు యువతలో మాదకద్రవ్యాల వాడకం సంస్కృతి పెరుగుతోందని, అది మంచిది కాదని చెప్పే చిన్న సందేశం కూడా ఇందులో ఉంటుందన్నారు. చిత్రాన్ని తమిళం, తెలుగు, మలయాళం ,కన్నడం, హిందీ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.



ప్రియమణి

క్లుప్తంగా

దోపిడీ దొంగ అరెస్ట్

తిరువొత్తియూరు: ఉల్లాసాల కోసం మహిళల వద్ద చైన్ స్నాచింగ్ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కుమరి జిల్లా మార్తాండం ప్రాంతంలో గురువారం రాత్రి ప్రత్యేక బృందం పోలీసులు వాహన తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడిని పట్టుకుని ప్రశ్నించారు. అతను పొంతనలేని సమాధానం చెప్పడంతో స్టేషన్‌కు తీసుకెళ్లి తమదైన శైలిలో విచారణ చేశారు. అతను నాగర్ కోయిల్ సమీపంలోని మేల్‌పుత్తేరి కీల్ కలంకుడికి చెందిన విక్కి అలియాస్ విఘ్నేష్ (20) అని తెలిసింది. యువతులతో ఉల్లాసంగా ఉండడానికి ఒంటరిగా వెళుతున్న మహిళల వద్ద చైన్ స్నాచింగ్ చేస్తున్నట్లు తెలిసింది. కాగా ఇప్పటికే సుశీంద్రం పోలీస్‌స్టేషన్లో విఘ్నేశ్‌పై గంజాయి కేసులు ఉన్నాయి.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

తిరువొత్తియూరు: గోపిలో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈరోడ్డు జిల్లా గోపి సమీపంలోని ఆయలూరులో కోడిపందేలు, జూదం ఆడుతున్నట్లు సిరువలూరు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. అరియలూరు ఈసన్ తోటలో కోడిపందేలు, జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. జగదీష్ (31), శశికుమార్ (28), అభిషేక్ (23), కార్తీక (22), సేతుపతి (21), శివకుమార్ (35)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో హోటల్ ఉద్యోగి మృతి

అన్నానగర్: విల్లుపురం జిల్లాలోని మరక్కాణం ప్రాంతంలో ఓ ప్రైవేట్ హోటల్ ఉంది. మరక్కాణం సమీపంలోని కొల్లుమేడు వినాయకర్ కోయిల్ వీధికి చెందిన అయ్యప్పన్ భార్య మీనాక్షి(35) ఇందులో పనిచేస్తోంది. మీనాక్షి ఎప్పటిలాగే శనివారం ఉదయం 7 గంటలకు హోటల్‌లో పనిచేస్తోంది. ఆ సమయంలో ఆమె పక్కనే ఉన్న ఇనుప కంచెను పట్టుకుంది. విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఈమేరకు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కొండపై నుంచి పడి.. ఏనుగు మృతి?

అన్నానగర్: ఈరోడ్ జిల్లా తలమలై ఫారెస్ట్ రిజర్వ్ పరిధిలోని బెజలట్టి ప్రాంతంలోని చిన్నకల్లాన్ కుట్టై ప్రాంతంలో శనివారం ఉదయం ఫారెస్ట్ రేంజర్లు గస్తీ కాస్తుండగా.. కొండపై ఆడ ఏనుగు కలేబరాన్ని గుర్తించారు. తర్వాత పోస్టుమార్టం చేసి.. గొయ్యి తవ్వి ఏనుగు పూడ్చిపెట్టారు. ఇక చనిపోయిన ఏనుగుకు దాదాపు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. 100 అడుగుల ఎత్తులో ఉన్న కొండ వాలుపై నుంచి ఏనుగు పడి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు.

కుమార్తెకు దీపావళి సారె ఇచ్చి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అన్నానగర్: నాగై జిల్లా, వేదారణ్యం సమీపం అన్నా నగర్ కి చెందిన పాండియన్‌భార్య వాసుకి (40). ఈమె దీపావళి సారె ఇచ్చేందుకు శుక్రవారం సాయంత్రం వేదారణ్యం గాంధీ నగర్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. సారె కార్యక్రమం తర్వాత బైకులో తన అల్లుడు పూవరసన్ (27)తో ఇంటికి బయలుదేరింది. మార్గం మధ్యలో వేదారణ్యం పవర్ స్టేషన్ సమీపంలోకి రాగానే పూవరసన్ నడుపుతున్న బైకును వెనుక నుంచి మరో బైకు ఢీ కొట్టింది. బైకు పై నుంచి కింద పడిన వాసుకి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



రక్షణ్ (ఫైల్), మృతి చెందిన రౌతాయ్

పుత్తూరు: పట్టణ పరిసరాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ చిన్నారితో సహా మరో వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. ఎస్ఐ గౌరీశంకర్ కథనం మేరకు, శనివారం ఉదయం స్థానిక గేట్‌పుత్తూరుకు చెందిన సతీష్(35), కుమారుడు రక్షణ్(6), కుమార్తె హరిప్రియ(2) మోటార్ సైకిల్‌పై స్థానిక బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి బయల్దేరారు. అదే సమయంలో చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు, ఈ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రక్షణ్ మృతి చెందగా, సతీష్, హరిప్రియ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చెన్నై రామచంద్ర ఆసుపత్రికి తరలించారు. ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన లారీ డ్రైవర్ రౌతాయ్(42) జమ్మలమడుగు నుంచి సిమెంట్ లోడ్ తీసుకొచ్చి పళ్లిపట్టులో శుక్రవారం రాత్రి అన్‌లోడ్ చేశాడు. తిరుగు ప్రయాణంలో పుత్తూరు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఓ షాపు వద్ద లారీ ఆపాడు. వాటర్ బాటిల్ తీసుకొని, లారీ ఎక్కే సమయంలో తిరుపతి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ రౌతాయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ప్రమాదాలకు సంబంధించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాలను అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం

- త్వరలో వంద పడకల సామర్థ్యంతో రెండు ఆస్పత్రులు
- మంత్రి ఎం.సుబ్రమణియన్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణియన్

కొరుక్కుపేట: వర్షాకాలం నేపథ్యంలో జ్వరాల నియంత్రణకు డిసెంబర్ వరకు ప్రతి ఆదివారం వెయ్యి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మంత్రి ఎం. సుబ్రమణియన్ అన్నారు. ఆదివారం దీపావళి కావడంతో 3వ వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం, విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి స్టాలిన్ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రులను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. పడకల సామర్థ్యం పెంపు, కొత్త ఆస్పత్రుల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పుదుకోటలో ఈ నెల 15వ తేదీ కొత్తగా ఏర్పాటు చేసిన డెంటల్ కళాశాలను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని తెలిపారు. తమిళనాడు వ్యాప్తంగా 708 ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించామని చెప్పారు. తొలి విడతగా 500 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. మిగిలిన 208 కేంద్రాల్లో 152 ఆరోగ్య కేంద్రాలు తుది దశకు చేరుకున్నాయని వివరించారు. ఇందులో చెన్నై షేనాయి నగర్, అలందూర్‌లలో 2 కొత్త ఆస్పత్రులు ఏర్పాటు కానున్నాయన్నారు. ఒక్కో ఆస్పత్రిని రూ.13 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆస్పత్రులు 5 అంతస్తులు, 100 పడకల సామర్థ్యం కలిగి ఉంటాయన్నారు. ఇది కాకుండా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఈ పనులను 2 నెలల్లో పూర్తి చేసి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అనంతరం షేనాయినగర్‌లో నిర్మించిన నూతన ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్, ఎమ్మెల్యే ఎంకే మోహన్ ఉన్నారు.

రోగులకు శ్రీవారి లడ్డూలు వితరణ



దీపావళి స్వీట్లు అందజేస్తున్న ఏజే శేఖర్

కొరుక్కుపేట: దీపావళి పండుగను పురస్కరించుకుని ఒమందూర్, స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వెయ్యి మంది రోగులకు టీటీడీ స్థానిక ఆలయాల చైర్మన్ ఏజే శేఖర్ శ్రీవారి లడ్డూలను అందజేశారు. అలాగే చెన్నై నగరంలోని మూడు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని 2 వేల మంది రోగులకు ఆర్‌వైఏ ఫుడ్ బ్యాంక్ తరఫున దీపావళి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఏజె శేఖర్ హాజరై స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని, రోగులపై స్వామివారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. అందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వైఏ చైర్మన్ కపిల్ చోర్డియా, సెక్రటరీ గిరీష్ బాందరి, మేనేజింగ్ ట్రస్ట్ నిర్మల్ నహర్, టీటీడీ స్థానిక సలహామండలి మాజీ సభ్యులు మోహన్ రావు, కార్తికేయన్, శరన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శనివారం ఉదయం పెద్దశేష వాహనసేవ, రాత్రి హంసవాహన సేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాలు అద్భుత ప్రదర్శనలిచ్చాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 13 కళా బృందాలు, 320 మంది కళాకారులు పాల్గొని తమ సంగీత నృత్య ప్రదర్శనలతో భక్తులను పరవశింప చేశారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ వివిఎస్ఆర్ఎస్ నాట్యాలయానికి చెందిన 20 మంది కళాకారుల బృందం ప్రదర్శించిన అన్నమయ్య సంకీర్తనలకు భరతనాట్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌కు చెందిన 16 మంది మహిళల బృందం చండి మేళం ప్రదర్శన కనువిందు చేసింది. అనంతపురం శ్రీకృష్ణ నాట్యాలయంకు చెందిన 20 మంది యువతులు ఓణీ నృత్య రూపకం, గౌరీపట్నం చెందిన సురేష్ బృందం కలశం డాన్స్ నేత్రపర్వంగా సాగింది. తమిళనాడుకు చెందిన భరతకళా అకాడమీ కళాకారులు మహాలక్ష్మి అష్టాంగం, చెన్నైకి చెందిన రాగిణి సంగీత నృత్యాలయం కళాకారులు ఖడిగ నృత్యం కనువిందు చేసింది. తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు పెద్ద శేష వాహనంలో శ్రీ పద్మావతి అమ్మవారి నృత్య రూపకాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. రాజమండ్రికి చెందిన పార్వతీ బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

పవిత్రోత్సవాలకు పూర్ణాహుతి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా కుంభ ప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యభామ నర్సింగ్ కాలేజీ స్నాతకోత్సవం

కొరుక్కుపేట: చెన్నైలోని సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన సత్యభామ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి చాన్సలర్ మరియా జీనా జాన్సన్, ప్రెసిడెంట్ మరియా జాన్సన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తమిళనాడు నర్సెస్ అండ్ మిడ్ వ్యూస్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎస్ అన్ని గ్రేస్ కలైమతి బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఆర్తీషా అనే విద్యార్థినికి బంగారు పతకం అందజేశారు. సేవే పరమావధిగా రోగులకు సేవ చేయాలని సూచించారు.



బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు

అరణియార్ గేట్ ధ్వంసంపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఏఈ లోకేశ్వర్ రెడ్డి, వాచ్‌మన్ గణేష్

పిచ్చాటూరు : మండలంలోని అరణియార్ జలాశయం గేట్ తాళాలు పగులగొట్టిన నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు.. నీరువాయి గ్రామానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం రెప్పాలట్టు వద్ద అరణియార్ గేట్‌లను ధ్వంసం చేశాడు. దీనిపై ప్రశ్నించిన వాచ్‌మన్ గణేష్‌పై దాడికి దిగాడు. తన అనుచరులు లడ్డు మోహన్, ఢిల్లీ, గవ్వ, భరత్, వినయ్‌లతో పాటు మరో 20 మందిని ఫోన్ చేసి రప్పించి మళ్లీ గణేష్‌ను చితక్కొట్టాడు. అడ్డుకోబోయిన గణేష్ అన్న కుమార్ చేతిపై కత్తితో పొడిచాడు. దీనిపై సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫలపుష్పాలతో అలంకరించిన మండపంలో కొలువైన పద్మావతీదేవి



అమ్మవారికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు



శాస్త్రోక్తం.. స్నపన తిరుమంజనం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో ఫల పుష్పాలతో రూపొందించిన వేదికపై కంకణభట్టర్ మణికంఠ బట్టర్ ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా వైభవంగా వేడుక జరిపించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం, ఛత్ర చామర, వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం సమర్పించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలు చేపట్టారు. అనంతరం గుమ్మడి గింజలు, గోల్డ్ గ్రేప్స్, స్వీట్ కార్న్, సంపంగి, వృచి, పింక్ రోజ్ పెటల్స్, తామరపూల గింజలు, తులసి, రంగురాళ్లతో కూడిన రోజామాలలను అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.





పెద్దశేష వాహన సేవలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

కొడుకు చేతిలో తండ్రి హతం

అన్నానగర్: మామపై దాడి చేయడానికి వెళుతున్న కుమారుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తండ్రి అతడి చేతుల్లోనే హత్యకు గురయ్యాడు. వివరాలు.. తూత్తుకుడి జిల్లా కయత్తారు సమీపంలోని కడంపూర్ అగ్రహార వీధికి చెందిన రైతు దశరథన్ (50)కు కుమారుడు అశ్వత్ కుమార్ (30) ఉన్నాడు. ఇతను పళువంతనైలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య అరుణ మనస్పర్థల కారణంగా దిగువ ఉమ్మడి పొలంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అశ్వత్‌కుమార్ తన భార్యను కాపురానికి పిలిచినా నిరాకరించింది. ఈ విషయంలో అతనికి, అతని మామ నారాయణస్వామి మధ్య వివాదం నెలకొంది. నారాయణస్వామిపై కక్ష పెంచుకున్న అశ్వత్ కుమార్ శనివారం ఉదయం కొడవలితో మామ ఇంటికి బయలుదేరాడు. ఇది గమనించిన అతని తండ్రి దశరథన్ విషయాన్ని నారాయణస్వామికి ఫోన్‌లో తెలిపాడు. నారాయణ స్వామి ఇంట్లో తలుపులకు తాళం వేసుకుని ఉన్నాడు. కత్తితో అక్కడికి వెళ్లిన అశ్వత్ కుమార్ ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో కొడుకును అడ్డుకోవడానికి తండ్రి దశరథన్ అక్కడికి వెళ్లి అతడిని మందలించాడు. కోపోద్రిక్తుడైన అశ్వత్ కుమార్ తండ్రి అని కూడా చూడకుండా దశరథన్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. మార్గమధ్యలో పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

బస్సు ఫుట్‌బోర్డు విరిగి ముగ్గురికి గాయాలు

తిరువొత్తియూరు: చెన్నై ఆవడిలో ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డు విరిగిపడడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. ఆవడి కార్పొరేషన్ ట్రాన్స్‌పోర్ట్ డిపో నుంచి సుమారు 150కి పైగా ఆర్టీసీ బస్సులు చెన్నై తదితర పలు ప్రాంతాలకు నడుస్తున్నాయి. ఆవడి సమీపంలోని కొత్త కనీయమ్మన్ నగర్ నుంచి శుక్రవారం బస్సు నంబర్ 61కె ఆవిడి బస్సు డిపో వైపు వెళుతోంది. బస్సులో 50 పైగా ప్రయాణికులు ఉన్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో కొందరు ముందు, వెనుక ఉన్న ఫుట్ బోర్డు మెట్లపై నిలబడి ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్ సుందర మూర్తి (50), కండక్టర్ శ్రీనివాసు (45) డ్యూటీలో ఉన్నారు. హెచ్‌వీఎఫ్ రోడ్డు తపాలా కార్యాలయం వద్ద స్పీడ్ బ్రేకరుపై బస్సు ఎక్కి దిగిన సమయంలో వెనుక వైపు ఉన్న ఫుట్‌బోర్డు మొదటి మెట్టు హఠాత్తుగా విరిగి కింద పడింది. ఈ ఘటనలో ఫుట్ బోర్డ్‌పై నిలబడి ఉన్న ఇద్దరు విద్యార్థులతో సహా ముగ్గురు కిందపడ్డారు. వెంటనే బస్సును నిలిపివేశారు. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత బస్సు బయలుదేరింది. కాగా బస్సు వెనుక ఫుట్‌బోర్డు మొదటి మెట్టు మూడు రోజుల క్రితమే విరగడంతో దాన్ని వెల్డింగ్ చేసి నడుపుతున్నట్లు తెలిసింది. దీని గురించి డిపో మేనేజర్ వద్ద డ్రైవర్లు, కండక్టర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సమాచారం. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ఆవడి పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతోంది.

సహకార బ్యాంకులో సెక్యూరిటీ గార్డుపై దాడి

- దోపిడీకి విఫలయత్నం

కొరుక్కుపేట: తిరుచెంగోడులోని సహకార బ్యాంకు సెక్యూరిటీపై దుండగులు దాడి చేసి దోపిడీకి యత్నించారు. షట్టర్ తెరవలేకపోవడంతో దోపిడీ ప్రయత్నాన్ని విరమించుకుని పరారయ్యారు. వివరాలు.. నామక్కల్ జిల్లా తిరుచెంగోడ్ యూనియన్ పన్నికుట్టి పాళయంలో సిరుమొలసి అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉంది. ఇక్కడ సుందరం(49) నైట్ సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి ఉద్యోగులు విధులు ముగించుకుని వెళ్లిపోయారు. సుందరం గస్తీలో ఉన్నాడు. అర్ధరాత్రి అక్కడికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా సుందరం తలపై బలంగా కొట్టారు. తీవ్రంగా గాయపడి రక్తపుమడుగులో స్పృహతప్పి పడిపోయాడు. అనంతరం దుండగులు బయటి తలుపు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పోలీసు స్నిఫర్ డాగ్‌లకు ఆధారాలు లభించకుండా కారంపొడి చల్లారు. కిటికీలు, తలుపులు పగులగొట్టే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో షట్టర్‌ను తెరిచేందుకు ప్రయత్నించారు. అది కూడా విఫలం కావడంతో దోపిడీ ప్రయత్నాన్ని విరమించుకుని పరారయ్యారు. కాగా సమయం దాటినా సుందరం ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబీకులు అనుమానం వచ్చి కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉద్యోగులను సంప్రదించారు. వాళ్లు అక్కడికి వచ్చి చూడగా సుందరం గాయాలతో పడి ఉన్నాడు. 108లో తిరుచెంగోడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఈరోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరుచెంగోడ్ సబర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. షట్టర్ పగలగొట్టలేకపోవడంతో సుమారు రూ.8 కోట్ల విలువైన నగలు, డబ్బు భద్రంగా ఉండిపోయింది.

24 గంటల్లోనే చైన్ స్నాచర్ అరెస్ట్



వృద్ధురాలికి బంగారు గొలుసు అందజేస్తున్న పోలీసులు

కొరుక్కుపేట: చెన్నై అయనవరంలో వృద్ధురాలి నుంచి బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తిని 24 గంటల్లో పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 8 సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అయనవరం కేహెచ్ రోడ్డులో కందస్వామి భార్య అమరావతి (88) నివసిస్తున్నారు. ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంట్లో మంచంపై పడుకుని ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి ముసుగు ధరించి ఇంట్లోకి ప్రవేశించి ఆమె ధరించిన బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. దీనిపై అమరావతి కె–2 అయనవరం క్రైం బ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశబూరు..ఎకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా అయనవరం, జైనగర్‌కు చెందిన పరుశురామన్ కుమారుడు బాబును అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 8 సవర్ల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. బాబు అరుంబాక్కం ప్రాంతాల్లో ఇద్దరు మహిళల నుంచి బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు తెలిసింది. నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న 8 సవర్ల బంగారు గొలుసును కే–2 అయనవరం క్రైం బ్రాంచ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అమరావతి వృద్ధురాలికి అందజేశారు. బాబును శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. పోలీసులను చెన్నై మెట్రోపాలిటన్ పోలీసు సీనియర్ అధికారులు ప్రశంసించారు.

మద్యం మత్తులో టీసీతో గొడవ

- చెన్నై పోలీసుపై కేసు

తిరువొత్తియూరు: మద్యం మత్తులో మధురై పొదిగై ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ టీసీతో గొడవపడిన పోలీసుపై కేసు నమోదు చేశారు. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోయిల్‌కు చెందిన సుబ్బయ్య పాండియన్ (35) చెన్నైలో సాయుధ దళం పోలీసుగా పనిచేస్తున్నాడు. ఇతను చెన్నైకి వెళ్లడానికి శంకరన్ కోయిల్ రైల్వేస్టేషన్‌కు తన స్నేహితుడు అరుణ్ (34)తో వచ్చాడు. తరువాత సెంగోట్టై నుంచి చెన్నై వెళ్లే పొదిగై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఇద్దరు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. రైలు శ్రీవిల్లిపుత్తూరు వద్దకు రాగానే టికెట్ కలెక్టర్ సుబ్బయ్య పాండియన్ టిక్కెట్ చూపించమని కోరాడు. తాను పోలీసునని ఆధారాలు చూపించాడు. తర్వాత అరుణ్‌ను టిక్కెట్ చూపించని కోరారు. ఆ సమయంలో అతని వద్ద టిక్కెట్ లేదు. ఫైన్ కట్టాలని తెలిపారు. అయితే సుబ్బయ్య పాండియన్ అందుకు నిరాకరించి వాగ్వాదానికి దిగాడు. ఇద్దరు మద్యం మత్తులో ఉన్నట్లు తెలియడంతో టీసీ రైల్వే భద్రతా పోలీసులకు సమాచారం అందించాడు. మధురై రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు సుబ్బయ్య పాండియన్, అరుణ్ రైలు నుంచి కిందకుదించి విచారణకు తీసుకెళ్లారు. సుబ్బయ్య పాండియన్‌పై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. అతని స్నేహితుడు అరుణ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

4 వేల అరటి చెట్లు నరికివేత



కొరుక్కుపేట: నామక్కల్‌లో 4 వేల అరటి చెట్లను దుండగులు నరికివేయడం కలకలం రేపింది. నామక్కల్ జిల్లా పరమతివేలూరు సమీపంలోని జడరపాళయానికి చెందిన నిత్య ఈ ఏడాది మార్చిలో హత్యకు గురైంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు 10 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో అసలైన నేరగాళ్లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ ప్రాంతంలోని ఇళ్లపై ఎనిమిది నెలలుగా దాడులు జగుతున్నాయి. వెల్లమిల్లులో నివాసముంటున్న వారి నివాసాలపై పెట్రోలు బాంబులు విసిరి, అరటి, తమలపాకు చెట్లను నరికివేయడం వంటి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. దీన్ని అరికట్టేందుకు, నేరగాళ్లను పట్టుకునేందుకు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి పది మందికి పైగా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఈ క్రమంలో శనివారం రాత్రి జడ్చర్ల సమీపంలోని వి.పుదుప్పాళయం ప్రాంతానికి చెందిన ఇళంగోమణి అలియాస్ సుబ్రమణి (42)కి చెందిన 5 ఎకరాల్లోని 4 వేలకు పైగా అరటి చెట్లను దుండగులు నరికివేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రాజేష్ ఖన్నా, దేవదాయ శాఖ అధికారులు, జడ్చర్ల పోలీసులు విచారణ చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,978 మంది స్వామివారిని దర్శించుకోగా 19,617 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.87 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా...

వ్యాపారాభివృద్ధిపై 21న సాంకేతిక సదస్సు

ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్

సాక్షి, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వ్యాపారాభివృద్ధి అవకాశాలను వివరించడానికి విజయవాడలో సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలతో వ్యాపారాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చు అనే అంశంపై ఈనెల 21వ తేదీన సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నామని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ అధ్యక్షుడు మలినేని రాజయ్య తెలిపారు. ఈ సదస్సు విజయవాడలోని హోటల్ వివంతలో జరుగుతుందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులు, కుటీర పరిశ్రమ నిర్వాహకులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఇందుకోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదని, ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని వివరించారు. ఆసక్తిగల వారు ఈనెల 18వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9848077227 లేదా andhrachambervijayawada@gmail.com లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్‌గా రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్కర్

స్వోర్డ్ సెరెమనీలో బాధ్యతల స్వీకరణ



రియర్ అడ్మిరల్ గురుచరణ్ నుంచి స్వోర్డ్ ఆర్మ్ స్వీకరిస్తున్న రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్కర్

సాక్షి, విశాఖపట్నం: ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్‌గా రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 11 నెలలుగా ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ ఢిల్లీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నేవల్ డాక్‌యార్డులో స్వోర్డ్ ఆర్మ్ సెరెమనీ నిర్వహించారు. గురుచరణ్ నుంచి రాజేష్ ధన్కర్ ఫ్లీట్ కమాండ్ స్వోర్డ్‌ని స్వీకరించి బాధ్యతలు చేపట్టారు. 1990లో భారత నౌకాదళంలో చేరిన ధన్కర్ నేవిగేషన్ అండ్ డైరెక్షన్‌లో నిపుణుడు. 33 ఏళ్ల కెరీర్‌లో పాండిచ్చేరి, గోవా, కోరా, మైసూర్ యుద్ధ నౌకల్లో కీలకంగా వ్యవహరించారు. ఐఎన్ఎస్ ఢిల్లీలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా, ఐఎన్ఎస్ ఘరియాల్ కమాండింగ్ ఆఫీసర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

మద్యం వ్యాన్ బోల్తా

బాటిళ్ల కోసం ఎగబడిన జనం



కొమ్మాది హైవేపై బోల్తా పడిన మద్యం వ్యాన్

మధురవాడ (విశాఖపట్నం): మద్యంతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ శనివారం మధ్యాహ్నం కొమ్మాది కూడలి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడడంతో బాటిళ్ల కోసం జనం ఎగబడ్డారు. ఆనందపురం మద్యం డిపో నుంచి నగరంలోని మూడు ప్రాంతాల్లోని బార్లకు మద్యం అందజేయడానికి బయలు దేరిన వ్యాన్ టైర్ పంచర్ కావడంతో బోల్తా పడింది. ప్రమాదాన్ని గ్రహించిన ఓ కలాసీ వ్యాన్ పైనుంచి దూకేయడంతో స్వల్పంగా గాయపడ్డాడు. మరో కలాసీ, వ్యాన్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. వాహనం బోల్తా పడడంతో బాటిళ్లు రోడ్డుపై పడి పగిలి మద్యం నీరులా ప్రవహించింది. స్థానికులు, వాహన చోదకులు మద్యం బాటిళ్ల కోసం ఎగబడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మద్యం చౌర్యాన్ని కట్టడి చేశారు. క్రేన్‌తో వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. కాగా.. ఈ వాహనంలో సుమారు రూ.35 లక్షల విలువ చేసే 380 కేసుల మద్యం ఉన్నట్లు సమాచారం.

బంగాళాఖాతంలో 14నే అల్పపీడనం!

ఆపై 16న వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 14న అల్పపీడనం ఏర్పడనుంది. తొలుత అదే ప్రాంతంలో 15న అల్పపీడనం ఏర్పడవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే అంతకు ఒకరోజు ముందే అల్పపీడనం ఏర్పడుతుందని ఐఎండీ తమ నివేదికలో తెలిపింది. అనంతరం ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ 16వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాతానికి అనుకుని మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ వాయుగుండం అదే దిశలో పయనిస్తుందని ఐఎండీ వర్గాలు తెలిపాయి. వాయుగుండం ప్రభావం ఈ నెల 16 తర్వాత దక్షిణ కోస్తాంధ్రలో మోస్తరు గాను, ఉత్తర కోస్తాంధ్రలో స్వల్పంగాను ఉంటుందని అంచనా. అల్పపీడనం ప్రభావంతో పశ్చిమ మధ్య, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయి. ఈ నెల 13 నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలకు ఆస్కారముంది.

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి విశేష స్పందన



అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం రామచంద్రపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కరదీపికను అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



బాపట్ల జిల్లా కొల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



తిరుపతిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తదితరులు



ఏలూరు రూరల్‌లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్సీ వెంకటరమణ



విజయనగరం జిల్లా బలిఘట్టాంలో వివిధ పథకాలను వివరిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరి, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, ఎంపీటీసీ హేమలత తదితరులు



తూర్పు గోదావరి జిల్లా బల్లిపాడులో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, ఉప సర్పంచ్ దమయంతి, నాయకులు

స్వశక్తితో ఎదిగే మహిళల కోసం

'మహిళా శక్తి'

ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణం

- లబ్ధిదారులు 10 శాతం చెల్లిస్తే.. 90 శాతం ప్రభుత్వం రుణంగా ఇస్తుంది
- రుణాన్ని 48 నెలలు వాయిదాలుగా చెల్లించే వెసులుబాటు
- మండలానికి ఒకరు చొప్పున ఈ ఆర్థిక ఏడాది 660 మందికి ఆటోలు
- వడ్డీ రాయితీ కారణంగా ఒక్కో లబ్ధిదారునికి రూ.లక్షన్నర దాకా అదనపు లబ్ధి
- డిసెంబరు 6 అంబేడ్కర్ వర్ధంతి రోజున 229 మందికి కొత్త ఆటోలు
- వచ్చే అంబేడ్కర్ జయంతికి మిగిలిన వారికి ఆటోలు

సాక్షి, అమరావతి: మహిళా సాధికారిత లక్ష్యంగా చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వశక్తితో ఎదగాలనుకొనే పేదింటి మహిళలకు చేయూతనిచ్చేందుకు మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు కేవలం 10 శాతం ఖర్చుతో వారు ఆటోలు సమకూర్చుకొని, వాటి



ద్వారా ఆర్థికంగా బలపడేలా 'మహిళా శక్తి' కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందుకోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో 'ఉన్నతి' కార్యక్రమంలో వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డ్రైవింగ్ నైపుణ్యం ఉండీ పలువురు మహిళలు ఆటోలను కిరాయికి తీసుకొని నడుపుకొంటున్నారు. ఇకపై వారు అద్దెవి కాకుండా సొంత ఆటోలు నడుపుకోవడం ద్వారా మరింత ఆదాయం పొందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు 'మహిళా శక్తి'కి రూపకల్పన చేశారు. ఈ పథకంలో ఆటో కొనుగోలుకు అయ్యే ఖర్చులో పది శాతం లబ్ధిదారు అయిన మహిళ భరిస్తే సరిపోతుంది. మిగతా 90 శాతం సెర్ప్ ద్వారా ప్రభుత్వమే రుణంగా అందిస్తుంది. ఈ రుణానికి వడ్డీ ఉండదు. మొత్తం రుణాన్ని 48 నెలలు కిస్తీ రూపంలో చెల్లించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలానికి ఒకరు చొప్పున 660 మందికి ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తుంది. ఇప్పటికే 229 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి, వారికి డ్రైవింగ్‌లో నాలుగు రోజుల పాటు అదనపు శిక్షణ ఇచ్చారు. ఆటోలకు వచ్చే చిన్న చిన్న సమస్యల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ సమయంలో భద్రత తదితర అంశాలపై శిక్షణ కూడ పూర్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 6వ తేదీన లబ్ధిదారులకు కొత్త ఆటోలు అందజేస్తారు. మిగిలిన మండలాల్లో వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి, వారికీ అంబేడ్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న కొత్త ఆటోలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక్కొక్కరికీ రూ.లక్షన్నర దాకా అదనపు ప్రయోజనం

సాధారణంగా ఆటోల కొనుగోలుకు బ్యాంకులు లేదా ఇతర ప్రైవేటు ఆర్థిక సంస్థలు రుణాలిస్తాయి. దీనిని నెలవారీ కిస్తీల రూపంలో తిరిగి చెల్లించాలి. వీటిపై కనీసం రూ. లక్షన్నర వడ్డీనే అవుతుంది. ఇది ఆటో డ్రైవర్లకు ఆర్థిక భారమే. మహిళా శక్తి ద్వారా ఆటోలు పొందే లబ్ధిదారులకు ఇచ్చే రుణంపై వడ్డీ లేనందున, వారికి ఈ లక్షన్నర ఆర్థిక ప్రయోజనం అదనంగా కలుగుతుందని అధికారులు వివరించారు.

26 జిల్లాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య

జిల్లా	లబ్ధిదారుల సంఖ్య
శ్రీకాకుళం	15
పార్వతీపురం మన్యం	13
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	10
ఏలూరు	12
ప్రకాశం	13
నెల్లూరు	13
తిరుపతి	16
చిత్తూరు	12
వైఎస్సార్	13
అన్నమయ్య	10
అనంతపురం	13
శ్రీ సత్యసాయి	6
కర్నూలు	7
నంద్యాల	9
బాపట్ల	9
పల్నాడు	3
గుంటూరు	5
ఎన్టీఆర్	4
కృష్ణా	5
పశ్చిమ గోదావరి	6
తూర్పు గోదావరి	6
కాకినాడ	6
అనకాపల్లి	8
విశాఖపట్నం	2
విజయనగరం	6
అల్లూరి సీతారామరాజు	7

1,510 మందికి సీట్లు కేటాయింపు

ఏపీఈఏపీసెట్–2023 కన్వీనర్ నాగరాణి

సాక్షి, అమరావతి: ఇంజినీరింగ్ ప్రత్యేక దశ అడ్మిషన్ల ప్రక్రియలో 1,510 మందికి సీట్లు కేటాయించినట్లు ఏపీఈఏపీసెట్–2023 కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉన్నత విద్యామండలి జారీ చేసిన జీవో నం.179ని అనుసరించి ఏపీఈఏపీసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామన్నారు. ఈ సంవత్సరానికి మాత్రమే వర్తించేలా ఈ కౌన్సెలింగ్ చేపట్టామని, మొదటి రెండు దశల కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందలేని విద్యార్థులు ఈ ప్రత్యేక కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రవేశాలకు కూడా కన్వీనర్ కోటాతో సమానంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని కన్వీనర్ నాగరాణి వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 14వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



కర్నూలు(అగ్రికల్చర్): 'ప్రభుత్వం ఇటు ఉద్యోగుల సంక్షేమానికి, అటు రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తోంది. దీనిని గుర్తించకుండా కొన్ని పత్రికలు, ప్రతిపక్షాలు విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీనిని తిప్పికొట్టాల్సిన బాధ్యత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపైనా ఉంది..' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య(ఏపీజీఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి చెప్పారు. కర్నూలులో శనివారం ఏపీజీఈఎఫ్ జిల్లా శాఖ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే లక్ష ఉద్యోగాలు ఇస్తామని ప్రకటిస్తే.. ఎవరూ నమ్మలేదని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.34 లక్షల మందికి ఉద్యోగాలిచ్చారని గుర్తుచేశారు. ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ప్రొబేషనరీ కూడా డిక్లేర్ చేశారని, ఇందుకు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరవపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ పూర్వ విద్యార్థికి అరుదైన గౌరవం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం (ఏయూ) పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. అమెరికాలో స్థిరపడిన వయార్టిస్ సంస్థ గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ హెడ్ డాక్టర్ దేవ పురాణం ఇటీవల అమెరికా అధ్యక్షుడు నివాసం ఉండే వైట్‌హౌస్‌లో నిర్వహించిన 2 కార్యక్రమాల్లో పాల్గొనే అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. అమెరికాలో హెల్త్‌కేర్ రంగంలో వ్యయాన్ని తగ్గించే అంశంపై చర్చించడానికి దేశ వ్యాప్తంగా స్వల్ప సంఖ్యలో నిపుణులను ఆహ్వానించగా అందులో దేవ పురాణం ఒకరు. అలాగే, ది నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్, ది నేషనల్ మెడల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ప్రదానోత్సవంలో సైతం ఆయన ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌లతో కరచాలనం చేసి, కొద్దిసేపు మాట్లాడారు. ఇటువంటి అరుదైన, ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో భాగమైన దేవ పురాణంని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఏయూలో కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాల్లో ఉన్నత విద్యను, పీహెచ్‌డీని దేవపురాణం పూర్తి చేశారు. తన ఉన్నతికి కారణమైన ఏయూ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల ఫార్మసీ కళాశాల విద్యార్థినుల హాస్టల్ భవనానికి తన తల్లిదండ్రులు లలితా దేవి, కోటిలింగాల మూర్తిల పేరు మీద రూ.50 లక్షలు విరాళమిచ్చారు. రసాయన శాస్త్ర విభాగం సమావేశ మందిరాన్ని రూ.10 లక్షలతో ఆధునికీకరించారు. దీనికి పురాణం లెక్చర్ హాల్‌గా ఏయూ నామకరణం చేసింది.

సచివాలయాలపైనా ఏడుపే..

- ఊరూరా సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించడంలేదా?
- సచివాలయాలకు నిధులివ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనడం శుద్ధ అబద్ధం
- పంచాయతీ సాధారణ నిధులు ఏ అవసరానికి ఎంతెంత శాతం ఖర్చుపెట్టాలన్న దానిపై నిబంధనలున్నాయి
- అయినా అక్షరం అక్షరంలో అసూయతో ఈనాడు వికృత రాతలు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులెవరూ గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీల చుట్టూ చెప్పులరిగేలా తిరిగే అగత్యం లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకొస్తే 'ఈనాడు' అస్సలు సహించలేకపోతోంది. ముఖ్యమంత్రి స్థానంలో చంద్రబాబు లేరన్న అసూయతో నిత్యం లేనిపోని అబద్ధాలతో ఆ పత్రికను నింపేస్తోంది. ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్న ఈ క్షుద్ర పత్రిక శనివారం 'పంచాయతీలను కొల్లగొట్టి.. సచివాలయాలకు పంచిపెట్టి..' అంటూ పెడబొబ్బలు పెడుతూ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థపై చేతికొచ్చింది రాసి పారేసింది. నిజానికి.. సచివాలయాలకు నిధులివ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వార్త రాయడంలో ఎలాంటి వాస్తవంలేదని, ఆ వార్త పూర్తిగా సత్యదూరమని ప్రభుత్వం స్పష్టంచేసింది. దేశంలో మరే రాష్ట్రంలోని లేని విధంగా అత్యుత్తమ సేవలందిస్తున్న ఈ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక.. ఈనాడు ఎప్పటిలాగే తప్పుడు వార్తలకు తెగబడింది. ఈ నేపథ్యంలో.. 'ఈనాడు' కథనంపై రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలతో ఫ్యాక్ట్‌చెక్‌ను విడుదల చేసింది. ఆ వివరాలు..

నిధులివ్వకుండా నిర్లక్ష్యం ఒట్టిమాటే..

- రాష్ట్ర ప్రభుత్వం 2019 అక్టోబరు 2 నుంచి 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 70–100 ఇళ్లకు ఒక వలంటీరు చొప్పున రెండున్నర లక్షలకు పైగా వలంటీర్లను నియమించింది. వీరిలో ఒక్కొక్కరికీ నెలకు రూ.5వేల చొప్పున పారితోషికం చెల్లిస్తోంది. అంతేకాదు.. ఎలాంటి అవినీతికిగానీ వివక్షకుగానీ తావులేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడానికి ఈ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒకటిన్నర లక్షల మందికి పైగా ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించింది.
- కొత్తగా ఏర్పాటైన సచివాలయాలకు 30,004 కంప్యూటర్లు, 15,002 యూపీఎస్, 15,002 ప్రింటర్లు, 3,000 ఆధార్ కిట్లు, 2,86,646 ఫింగర్ ప్రింట్ స్కానర్లు పంపిణీ చేసింది. వలంటీర్లతోపాటు ఇతర సచివాలయ సిబ్బంది విధులను వేగంగా నిర్వహించేందుకు.. టెక్నాలజీని ఉపయోగించేందుకు 2,91,590 స్మార్ట్‌ఫోన్లు, సిమ్‌కార్డులను అందజేసింది. వీటన్నింటి కోసం ప్రభుత్వం తొలిదశలోనే రూ.486.71 కోట్లను వెచ్చించింది. వీటికి ఎక్కడ కూడా గ్రామపంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- మరోవైపు.. సచివాలయాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రభుత్వం ఎప్పటికప్పుడు అదనంగా నిధులు విడుదల చేస్తోంది. 'జగనన్న సురక్ష శిబిరం' నిర్వహణ కోసమే రూ.25 కోట్లు.. అలాగే 'ఆరోగ్య సురక్ష శిబిరం' కోసం ఇంకొక రూ.22 కోట్లను విడుదల చేసింది. ఇదికాక, అదనంగా రూ.16 కోట్లను మంజూరు చేయగా వాటిని చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కానీ, వీటన్నింటినీ పక్కనపెట్టి 'ఈనాడు' సచివాలయాలకు నిధులివ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వండిన వార్తలో ఎలాంటి వాస్తవంలేదు.
- ఇక ఈ నాలుగేళ్లలో సచివాలయాల నిర్వహణకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటివరకు రూ.228 కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో ప్రింటర్లు, కంప్యూటర్లు, యుపీఎస్, ఫోన్లు, ఫింగర్ ప్రింట్ స్కానర్ల నిర్వహణను చూస్తోంది. వీటికి ఎక్కడా కూడా పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- అలాగే, అన్ని సచివాలయాలకు ఫైబర్‌నెట్ సంస్థ ద్వారా ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రింటర్ల వినియోగంలో వాడే ఇంక్ రీఫిల్స్, స్టేషనరీ సర్టిఫికెట్లు, లామినేషన్ కవర్లను సైతం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ద్వారా ప్రభుత్వమే ఎప్పటికప్పుడు సరఫరా చేస్తోంది.
- రాష్ట్రంలోని వలంటీర్లతో పాటు ఇతర సచివాలయాల సిబ్బంది ఉపయోగించే ఫోన్ల నెలవారీ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. వీటికి కూడా ఎక్కడా గ్రామ పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- ఇవన్నీ కాక.. సచివాలయాల్లో ఇతర అదనపు ఖర్చుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటిదాకా రూ.25 కోట్లను ఖర్చుపెట్టింది. ఇంకా ఏవైనా అవసరాలుంటే కలెక్టర్ల ద్వారా అభ్యర్థనలు పంపితే ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలించి నిధులు విడుదల చేస్తోంది. వీటికీ పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- గ్రామ సచివాలయాలు సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో 10,893 గ్రామ సచివాలయ భవనాలను మంజూరుచేయగా వాటిలో ఇప్పటికే 5,926 పూర్తయ్యాయి. వార్డు సచివాలయాల అద్దె చెల్లింపుల కోసం ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.54,56,49,999 చెల్లిస్తే, 2023–24 సంవత్సరానికి రూ.25,30,21,000 చెల్లిస్తోంది.

గ్రామ పంచాయతీ సాధారణ నిధుల కేటాయింపు ఇలా..


రకం	నిధుల శాతం
కార్యాలయ నిర్వహణకు..	30
నీటి సరఫరాకు..	15
పారిశుధ్యం..	15
రహదారులు.. కాలువలకు..	10
ఇతర నిర్దేశిత అంశాల నిర్వహణకు..	10
వీధి దీపాల నిర్వహణకు..	15
ఇతరములు	5

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి లేదు..

గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ కోసం ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఖర్చుచేస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులుగానీ, గ్రామ పంచాయతీ సాధారణ నిధులుగానీ ఏ అవసరానికి ఎంతెంత శాతం ఖర్చుపెట్టాలన్న దానిపై ఖచ్చితమైన నిబంధనలున్నాయి. ఇందులో ఎక్కడా కూడా పంచాయతీ నిధులను సచివాలయాల కోసం కేటాయించలేదు.

- గ్రామ సచివాలయాల నిర్వహణకు ఆ శాఖ ప్రత్యేకంగా నిధులను విడుదల చేస్తోంది. పైగా వీటి నిర్వహణ ఖర్చుల నిమిత్తం అధికారుల నుంచి పంచాయతీ కార్యదర్శులపై ఎలాంటి ఒత్తిడి లేదు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలకు విశేషమైన స్పందన లభిస్తుండడంతో కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే ఈ తప్పుడు కథనాన్ని ఈనాడు ప్రచురించిందని ప్రభుత్వం పేర్కొంది.

నివాళి



జననం: 23-5-1942 మరణం: 11-11-2023


ఓన్లీ చంద్రమోహన్

పాలూ మీగడ... పెరుగూ ఆవడా..
'నేను.. మా ఆవిడా' అన్న
తెలుగు సినిమా మధ్యతరగతి భర్త.
'సీతాపతి సంసారం' చేసి
ఆనాటి గృహిణులను
నవ్వుల్లో ముంచెత్తాడు.
ఏ వూరి 'సీతామాలక్ష్మి' ఐనా ఇష్టపడే
బంగారు కొండయ్య ఇతడే.
'కలికాలం' ధాటికి తల్లడిల్లిన
మధ్యతరగతి తండ్రి.
ఉత్త 'సగటు మనిషి'.
తెలుగు సినిమా ప్రేక్షకుడు
ప్రతి 'శుభోదయాన' తలుచుకోదగ్గ
నట త్రివిక్రముడు.
ఓన్లీ చంద్రమోహన్.


రంగుల రాట్నం



గోపాలరావు గారి అమ్మాయి















చంద్రమోహన్ తిని అరాయించుకోని క్యారేజీ లేదు. చేసి నిభాయించని క్యారెక్టరూ లేదు.

•••

అగ్రికల్చర్ బీఎస్సీ అంటే వ్యవసాయ విద్య.
పంటలు పండించడం తెలియాలి.
చంద్రమోహన్ ఆ విద్య చదివాడు.
అందుకేనేమో తెర మీద ప్రతి పాత్రా పండించాడు.

•••

నటులు అయ్యాము, అయిపోయాము, అవ్వాలనుకుంటున్నాము అనుకున్నవారు ఇది ట్రై చేయండి. 'నిన్నే పెళ్లాడతా' సినిమా చూడండి. అందులో చలపతిరావు, చంద్రమోహన్ చాలా స్నేహితులు. పక్కపక్క ఇళ్లల్లో ఉంటారు. కుటుంబాలతో కలిసి అన్నవరం వెళితే ఏనాడో విడిపోయిన చలపతిరావు చెల్లెలు మంజుభార్గవి కనిపిస్తుంది. అయినాసరే చలపతిరావు పలకరించడు. అందుకు లక్ష్మి అభ్యంతరపెడితే చలపతిరావు చెయ్యెత్తుతాడు. చంద్రమోహన్ అడ్డుపడితే– 'ఇది మా ఇంటి వ్యవహారం' అంటాడు చలపతిరావు. అందరూ ఊరికి తిరిగొచ్చాక ,ఇంటి తలుపులు తీసి లోపలికి వచ్చాక, చంద్రమోహన్ తన భార్యతో 'పద మనింటికి' అంటాడు. అందరూ 'ఏంటిది కొత్తగా' అన్నట్టు చూస్తే ఆ క్షణం చంద్రమోహన్ 'అక్కడ నన్ను అంతమాట అంటారా' అన్నట్టు ఒక ఎక్స్‌ప్రెషన్ ఇస్తాడు. ప్రేక్షకుడికి చివుక్కు మంటుంది. ఆ ఎక్స్‌ప్రెషన్ ఎవరైతే ఇవ్వగలరో వారంతా నటులైపోయినట్టే లెక్క.

•••

ఏలూరులో 'అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్'గా ఉద్యోగం వచ్చాక పెళ్లిసంబంధాల గోల మొదలైంది చంద్రమోహన్‌కి. కాని తన తర్వాత 8 మంది చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. అప్పటికే తండ్రి చనిపోవడంతో భారమంతా తనదే. కాని నాటకాలంటే ఇష్టం. శరీరాన్ని కండలు తిప్పడం ఇష్టం. సినిమాల్లో చేయాలని కోరిక. ఆదుర్తి తీస్తున్న 'లేత మనసులు' కోసం ప్రయత్నించాడు. కాని కృష్ణ, రామ్మోహన్‌లకు ఛాన్స్ పోయింది. ఇంకో సినిమా సెలక్షన్‌కు బెజవాడకు పరిగెడితే అక్కడ ఒక పొడవైన మనిషి తనలాగే వచ్చి ఉన్నాడు. తలెత్తి చూసిన చంద్రమోహన్ 'మీ పేరేమిటండి' అనడిగితే 'కృష్ణంరాజు' అన్నాడు. ఇలాంటి ఆజానుబాహులు ఉండగా నాకెందుకు వేషం ఇస్తారు అని అదే పోత.
కాని అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.
ఇచ్చినవాడు సాక్షాత్ బి.ఎస్.రెడ్డి.
సినిమా పేరు 'రంగుల రాట్నం'.
అది 1966వ సంవత్సరం.
తెలుగు వెండితెర మీద ఈ రెండార్ల సంవత్సరంలో ఆరారు కాలాలు నిలబడే నటుడు పుట్టాడు.

•••

'కోరిక ఒకటి జనించు.. తీరక ఎడద దహించు
కోరనిదేదో వచ్చు... శాంతి సుఖాలను ఇచ్చు
ఇంతేరా ఈ జీవితం... తిరిగే రంగుల రాట్నము'...

'రంగులరాట్నం'లో పాట ఇది. కాని చంద్రమోహన్‌కు కోరిందే జరిగింది... శాంతి సుఖాలను ఇచ్చింది. మహా దర్శకుడు బి.ఎస్.రెడ్డి ఈ 'పమిడి ముక్కల పొట్టివాడు' మహా గట్టివాడు అని గ్రహించాడు. ఉద్యోగం మాన్పించి, రిస్క్ చేసి, తొలి అవకాశం ఇచ్చాడు. సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'ఎవరీ చంద్రమోహన్... ఇది మొదటి సినిమానా?... మొదటి సినిమాలో ఎవరైనా ఇంత బాగా చేయగలరా?' అని అంతా ఆశ్చర్యపోవడమే. మొదటి సినిమాకే చంద్రమోహన్‌కు 'బంగారు నంది' వచ్చింది. అంతా బాగానే ఉంది... అయినా సరే నిలదొక్కుకోలేకపోతే? అని భయం. నంది అవార్డుల ఉత్సవంలో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చేతుల మీద నంది అందుకుంటూ 'సార్... నా కెరీర్ అటూ ఇటూ అయితే మళ్లీ మీరు నాకు వ్యవసాయ శాఖలోనే ఏదో ఒక ఉద్యోగం వేయించాలి' అని వేడుకున్నాడు చంద్రమోహన్. ఆయన నవ్వి 'మా బి.ఎన్ లాంచ్ చేస్తే ఫెయిల్ అవడం ఉండదు లేవయ్యా. భయపడకు' అని భరోసా ఇచ్చారు.
పెద్దల మాట చెక్కుల మూట అన్నారు.
వేషాలూ చెక్కులూ ఆ తర్వాత అలాగే వచ్చి పడ్డాయి.

•••

ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కాంతారావుల తర్వాత ఎవరు అనుకుంటున్న కాలం అది. హరనాథ్, బాలయ్య ఒకవైపు కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు మరోవైపు అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటే చంద్రమోహన్ ఎంట్రీ ఇచ్చాడు. 'ఒక జానెడు ఎత్తుంటే మా అందరినీ తినేస్తావయ్యా' అని ఎస్.వి.ఆర్, ఏ.ఎన్.ఆర్ ఆ తర్వాతి రోజుల్లో పదే పదే అన్నా చంద్రమోహన్‌కు ఒక జాన తక్కువ ఉండటమే లాభించింది. అతను మిడిల్‌క్లాస్ కథలకు సరిపోయాడు. చిన్న సినిమాల బడ్జెట్‌కు సరితూగాడు. 1970ల నాటికి మధ్యతరగతి తన ఉనికి చాటుకుంటూ భార్యాభర్తలు సంసారాలు ఈదడానికి అవస్థలు పడుతూ ఉన్నప్పుడు వారి సంసారాలకు, వాటిలోని సనిదపనిలకు చంద్రమోహన్ తెర రూపం అయ్యాడు. 'ఇంటింటి రామాయణం', 'తాయారమ్మ-బంగారయ్య', 'ఒక చల్లని రాత్రి', 'కోరికలే గుర్రాలైతే', 'శుభోదయం', 'నేను- మా ఆవిడ', ' కలహాల కాపురం'... ఎన్నని.

చంద్రమోహన గీతాలు - హిట్ సాంగ్స్ - 10

1. మేడంటే మేడా కాదు – సుఖ దు:ఖాలు
2. ఝుమ్మంది నాదం సయ్యంది పాదం – సిరిసిరిమువ్వ
3. మావిచిగురు తినగానే – సీతామాలక్ష్మి
4. నాగమల్లివో తీగమల్లివో – నాగమల్లి
5. కంచికి పోతావా కృష్ణమ్మ – శుభోదయం
6. కలనైనా క్షణమైనా – రాధా కల్యాణం
7. దాసోహం దాసోహం దాసోహం – పెళ్లిచూపులు
8. లేత చలిగాలులు – మూడుముళ్లు
9. పంటచేలో పాలకంకి నవ్వింది – పదహారేళ్ల వయసు
10. నీ తీయని పెదవులు అందకపోతే – కాంచన గంగ

•••

ఆ రోజుల్లో రేడియో వినడం మధ్యతరగతి వారికి దినచర్య.
'సీతాపతి సంసారం'లో భార్యను ఉద్యోగానికి పంపి, ఇంట్లో హౌస్ హజ్బెండ్‌గా చంద్రమోహన్ రేడియోలో వనితావని కార్యక్రమం కింద వెంకాయమ్మ గారు చెప్పే వంకాయకూర వండబోతాడు. కాని స్టేషన్లు జామ్ అయ్యి యోగా కార్యక్రమం కూడా మధ్యలో వినిపిస్తూ ఉంటుంది. 'వంకాయలను తరిగాక'... ఒక స్టేషన్... 'మెడను ముందూ వెనక్కూ మూడుసార్లు ఊపి'... ఇంకో స్టేషన్... ఒకటే నవ్వులు. ఈ సంసారం చూద్దామని ఆ రోజుల్లో మహిళా ప్రేక్షకులు మొగుళ్లను వెంటబెట్టుకుని ఎన్ని హౌస్‌ఫుల్స్ చేశారో!

•••

దర్శకుడు బాపు 'బంగారు పిచుక' (1968) తీశారు చంద్రమోహన్‌తో. 'సుఖఃదుఖాలు' (1968) లాంటి పెద్ద హిట్ పడ్డాక 'బంగారు పిచుక' హిట్ అయి ఉంటే చంద్రమోహన్ కెరీర్


సిరిసిరి మువ్వ

ఇంకెంత స్పీడ్‌గా ఉండేదో. కాని అవలేదు. కాలం కంటే ముందు తీసిన కథ అది. ఆ దెబ్బతో చంద్రమోహన్ పొట్టగడవడానికి తోచిన పాత్ర చేయాల్సి వచ్చింది. అదే బాపు తీసిన 'సంపూర్ణ రామాయణం'లో చిన్నపాటి భరతుడి పాత్ర కూడా వేయాల్సి వచ్చింది. కాని వరుసకు అన్నయ్య అయ్యే కె.విశ్వనాథ్ తన తమ్ముణ్ణి గట్టిగా నిలబెట్టాలనుకున్నాడు. నిర్మాతను కన్విన్స్ చేసి, తన ఇమేజ్ అడ్డు వేసి 'సిరిసిరిమువ్వ' (1976)లో హీరోని చేశాడు. జయప్రదకు కూడా అది హీరోయిన్‌గా మొదటి సినిమా. విడదలయ్యాక సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'గజ్జె ఘల్లుమంటుంటే... గుండె ఝల్లుమంటోంది'.

•••

1978. చంద్రమోహన్ స్థానాన్ని తెలుగు సినిమాల్లో ఖరారు చేసిన సంవత్సరం. ఆ సంవత్సరమే మురారి తీసిన కె.విశ్వనాథ్ సినిమా 'సీతామాలక్ష్మి' వచ్చింది. అదే సంవత్సరం కె.రాఘవేంద్రరావు తీసిన 'పదహారేళ్ల వయసు' వచ్చింది. 'సీతామాలక్ష్మి' అంటే తెలిసిందే. కె.విశ్వనాథ్ ఎలాగూ హిట్ చేస్తాడు. కాని 'పదహారేళ్ల వయసు' సినిమాయే కత్తి మీద సాము. అది తమిళంలో భారతీరాజా తీసిన 'పదారు వయతినిలే'కి రీమేక్. అందులో పల్లెటూరి వెంగళాయి పాత్రను కమల్ హాసన్ చేశాడు. డీ గ్లామరైజ్డ్ రోల్. చంద్రమోహన్ అలా గోచి కట్టుకుని ఆ పాత్ర చేస్తే మిగిలేది గోచే అని అంతా భయపెట్టారు. తట్టాబుట్టా సర్దుకోవాల్సిందే అన్నారు. అప్పుడే చంద్రమోహన్ తన కొత్తింట్లోకి మారాడు. 'ఈ సినిమా పోతే సెంటిమెంట్ ప్రకారం పాత ఇంట్లోకి వెళ్లిపోదాం' అని భార్య జలంధరతో చెప్పాడు. మొత్తానికి 'పదహారేళ్ల వయసు' రిలీజైంది. ఒకే సంవత్సరం 'సీతామాలక్ష్మి', 'పదహారేళ్ల వయసు' సిల్వర్‌జూబ్లీలు ఇచ్చిన హీరో చంద్రమోహన్. ఎన్టీఆర్, అక్కినేని వంటి టాప్‌స్టార్ల మధ్యలో ఈ వామనస్టార్ కూడా ఉన్నాడు.'పదహారేళ్ల వయసు' తెలుగులో సూపర్ హిట్ అయ్యిందని తెలిసి ప్రత్యేకంగా చూసిన కమలహాసన్ 'మీరు చేసిన దాంట్లో పది శాతం కూడా నేను చేయలేకపోయాను' అన్నాడు. వజ్రం విలువ వజ్రానికే కదా తెలుస్తుంది.

•••

సవాలు విసిరే వేషాలు ఎప్పుడూ చంద్రమోహన్‌నే వరించాయి. తమిళంలో కె.భాగ్యరాజా వచ్చి తనే హీరోగా, దర్శకుడుగా గొప్ప గొప్ప సినిమాలు చేశాడు. అతనితో మేచ్ అయ్యే నటుడు తెలుగులో ఎవరు? చంద్రమోహనే. 'రాధా కల్యాణం' (అంద 7 నాటకల్), 'పెళ్లిచూపులు' (తూరల్ నిన్ను పోచ్చు), 'మూడుముళ్లు' (ముందానై ముడిచ్చు) ఈ భాగ్యరాజ్ సినిమాలన్నీ చంద్రమోహన్ సూపర్‌హిట్ చేశాడు. మెహమూద్ హిందీలో 'పడోసన్' తీసి హిట్ కొడితే దాని రీమేక్ 'పక్కింటి అమ్మాయి' చంద్రమోహన్ హిట్ కొట్టాడు. హిందీ 'హీరో'ను నాగార్జునతో తెలుగులో 'విక్రమ్' పేరుతో తీస్తున్నప్పుడు ఒరిజినల్‌లో ఎంతో ముఖ్యమైన పాత్ర సంజీవ్ కుమార్ చేస్తే అందుకు సరిజోడును దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాత అక్కినేని వెతికి వెతికి చివరకు చంద్రమోహన్ దగ్గరికే వచ్చారు. 'అమర్ అక్బర్ ఆంథోని' రీమేక్ తెలుగులో 'రామ్ రాబర్ట్ రహీమ్'గా తీయాలనుకున్నప్పుడు తెలుగు వారి రిషి కపూర్ ఎవరు? ఇంకెవరు చంద్రమోహన్.

ఎన్.టి.ఆర్‌తో చిన్నపాటి విభేదం

చంద్రమోహన్‌కు ఎన్.టి.ఆర్‌కు ఆది నుంచి స్నేహం ఎందుకనో కుదరలేదు. చంద్రమోహన్ అక్కినేనితో దాదాపు 40 సినిమాలు చేస్తే ఎన్టీఆర్‌తో వేళ్ల మీద లెక్కించేన్ని సినిమాలే చేశారు. నిజానికి మేకప్‌మేన్ పీతాంబరం ఎన్టీఆర్‌తో 'యాదోంకి బారాత్' రీమేక్ 'అన్నదమ్ముల అనుబంధం' తీయాలనుకున్నప్పుడు చిన్న తమ్ముడి పాత్రకు చంద్రమోహన్‌ను, పెద్ద తమ్ముడి పాత్రకు మురళీమోహన్‌ను తీసుకున్నారు. అయితే ఎన్టీఆర్ చివరి నిమిషంలో ఆ పాత్రను బాలకృష్ణకు ఇచ్చారు. పీతాంబరం ఇరకాటంలో పడ్డారు. షూటింగ్ రోజున మేకప్ వేసుకోవడానికి చంద్రమోహన్ వస్తే అప్పటికే ఆ పాత్ర బాలకృష్ణకు వెళ్లిందని తెలిసింది. ఆ రోజు నుంచి చాలా రోజుల పాటు ఎన్టీఆర్ పట్ల చంద్రమోహన్ కినుకతోనే ఉన్నారు. మరోవైపు నష్టనివారణ కోసం పీతాంబరం అదే యాదోంకి బారాత్‌ను తమిళంలో ఎం.జి.ఆర్‌తో తీస్తే అందులో తమ్ముడి పాత్రను చంద్రమోహన్‌కు ఇప్పించారు– జరిగిన విషయం ఎం.జి.ఆర్‌కు చెప్పి. తమిళ యాదోంకి బారాత్‌లో పెద్దన్న, పెద్ద తమ్ముడిగా ఎం.జి.ఆర్ డబుల్ యాక్షన్ చేశారు. చంద్రమోహన్ ఎం.జి.ఆర్ తమ్ముడిగా చేసి హిట్ కొట్టారు.


ఎమ్జీఆర్‌తో...

•••

అన్నవరం సత్యనారాయణ స్వామికి ప్రసిద్ధి.
అన్నవరం ప్రసాదానికి ప్రసిద్ధి.
అన్నవరం చంద్రమోహన్‌కి కూడా ప్రసిద్ధి.
ఏనాడైతే ఆ మెట్ల మీద చంద్రమోహన్, రాజ్యలక్ష్మిలతో 'శంకరాభరణం'లో అందమైన ప్రేమ చూపులను దర్శకుడు కె.విశ్వనాథ్ తీశాడో ఆ రోజు అన్నవరం ఎవరు వెళ్లినా భక్తితో పాటు శంకరాభరణం కూడా గుర్తు చేసుకుంటారు. ఒక్క సీన్‌తో చంద్రమోహన్ చేసిన మేజిక్ అది. అతని చేతిలో నుంచి నీళ్ల గ్లాసు ఊరికూరికే జారిపోతే ప్రేక్షకులకు ఊరికూరికే నవ్వు వచ్చింది.

•••

ఎన్టీఆర్ ఏఎన్ఆర్‌ల హయాంలో, కృష్ణ శోభన్ బాబుల హయాంలో, చిరంజీవి బాలకృష్ణల హయాంలో, రాజేంద్రప్రసాద్ రాజశేఖర్‌ల హయాంలో కూడా హీరోగా హిట్స్ ఇచ్చినవాడు చంద్రమోహన్. 'చిన్నోడు-పెద్దోడు' (1988) వరకూ హిట్స్ ఇస్తూనే ఉన్నాడు. ఆ తర్వాత 'అల్లుడు గారు' (1990)తో కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా తన సత్తాను నిరూపించుకుంటూ వెళ్లాడు. అతను హీరో అయినా జనం చూశారు. కేరెక్టర్ ఆర్టిస్ట్ అయినా చూశారు. ఉదయ్‌కిరణ్, తరుణ్‌లకు తండ్రిగా వేసినా చూశారు. కృష్ణవంశీ 'గులాబీ' తక్కిన కారణాల రీత్యా ఎంత హిట్టో సరదా తండ్రిగా వేసిన చంద్రమోహన్ వల్ల అంత హిట్టు.

•••

'మీ అభిమాన నటుడు ఎవరు' అని జయసుధను అడిగితే 'ఇంకెవరు చంద్రమోహన్' అంటుందామె తడుముకోకుండా. జయసుధతో దాదాపు 25 సినిమాల్లో హీరోగా చేశాడు అతను. చంద్రమోహన్ పక్కన యాక్ట్ చేస్తే సూపర్‌స్టార్లు అవుతారనే సెంటిమెంట్ హీరోయిన్లకు ఉండేది. వాణిశ్రీ, లక్ష్మి, జయసుధ, జయప్రద, కవిత, సులక్షణ, సుహాసిని, రాధిక, విజయశాంతి... వీరంతా చంద్రమోహన్‌తో చేశాక స్టార్లు అయ్యారు. 'పదహారేళ్ల వయసు' తర్వాత శ్రీదేవి మళ్లీ ఆయనతో చేయలేనంత పెద్ద హీరోయిన్.


భార్య జలంధరతో...

•••

మిమిక్రీ ఆర్టిస్టులు అందరినీ అనుకరిస్తారు గాని చంద్రమోహన్‌ని కాదు. అతనిలాగా చేయగల వాడు అతనొక్కడే. ఆ డైలాగ్ మాడ్యులేషన్, ముఖంలో పలికించగల ఎమోషన్, కామిక్ టైమింగ్... ఇతరులకు ఎప్పటికీ రావు. కాని చంద్రమోహన్‌లో ఒక్కటే చిన్న లోపం ఉంది. బి.ఎస్.రెడ్డి గారు హెచ్చరించినా.. మార్చాలని చూసినా మారనిది– చేతులు ఊపనిదే డైలాగ్ చెప్పలేకపోవడం. చంద్రమోహన్‌ది ఎడమచేతి వాటం. ఎడమ చేతిని వేగంగా కదిలిస్తూ ఇరు చేతులూ కదిలిస్తూ డైలాగ్ చెబుతాడు.

కనీ వినీ ఎరగని భోజన ప్రియుడు



చంద్రమోహన్ కనీవినీ ఎరగని భోజన ప్రియుడు. సాధారణంగా సినిమా వారు మితంగా తింటారు. కాని అదృష్టవశాత్తు చంద్రమోహన్ శరీర తత్వానికి ఆయన ఎంత తిన్నా ఏమీ ఒళ్లు పెరిగేది కాదు. షూటింగుల్లో ఆయనకు ఐదు డబ్బాల భారీ క్యారేజీ వచ్చేది. అల్లూరి సీతారామ రాజు ఔట్‌డోర్‌లో బ్రేక్‌ఫాస్ట్‌లో చంద్రమోహన్ నలభై యాభై ఇడ్లీలు తినడం చూసి గుమ్మడి, పి.జె.శర్మలాంటి వారు నోరెళ్లబెట్టారు. 'ఆకాశంలో ఎగిరేవన్నీ తిన్నాను.. నేల మీద పాకేవన్నీ తిన్నాను... నీళ్లలో ఈదేవన్నీ తిన్నాను' అని సరదాగా తన భోజనప్రియత్వాన్ని అతిశయోక్తితో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు చంద్రమోహన్. అందుకే ఆయన తిని అరాయించుకోని క్యారేజీ లేదు.. వేసి నిభాయించని క్యారెక్టరూ లేదు.

•••

చంద్రమోహన్‌కు అవార్డులు గివార్డులు పట్టవు. సన్మానాలు గిన్మానాలు నచ్చవు. సినిమా చేశామా... ఇంటికి వెళ్లామా ఇదే ధ్యాస. అందరికీ బిరుదులిచ్చే టి.సుబ్బరామిరెడ్డి ఒకసారి ఆయనకు భారీ బిరుదు ఇచ్చి సత్కారం చేస్తానంటే 'మీరు ఇచ్చిన వెంటనే దానికి తిలోదకాలు ఇస్తాను' అని హెచ్చరించినవాడు చంద్రమోహన్. పేరుకు ముందు నట అది.. నట ఇది అని బిరుదులు వేయడం కూడా ఆయనకు ఇష్టం లేదు.
'చంద్రమోహన్‌లా వచ్చాను... చంద్రమోహన్‌లా వెళ్లిపోతాను' అనేవాడాయన.
ఎస్. అలాగే వెళ్లాడు.
హి ఈజ్ ఓన్లీ చంద్రమోహన్.

– ఖదీర్

దీపావళి ప్రత్యేకం

వెలుగుల ఉషస్సు

చీకటి, వెలుగు అనే మాటలని కాంతి అనే సందర్భంలోనే కాక ఎన్నింటికో ఉపయోగిస్తుంటాము. లోకంలో కావలసిన వాటిని కోరుకోదగిన వాటిని వెలుగుగాను, పనికి రానివాటిని, హాని కలిగించే వాటిని చీకటిగాను చెప్పుతుంటాము. అవిద్య, అజ్ఞానం, అనారోగ్యం, దుఃఖం, బాధ, చికాకు, దరిద్రం, అపకీర్తి, అవమానం, పాపం మొదలైన మనిషి నాశనానికి, నిరాశా నిస్పృహలకి హేతువులైన వన్నీ చీకటిగాను, జ్ఞానం, ఆరోగ్యం, సంతోషం, ఆనందం, ఆహ్లాదం, కీర్తి, పుణ్యం మొదలైన మానవునికి కోరుకోదగిన, ఉపయోగపడే వన్ని వెలుగుగాను సంకేతించటం జరిగింది. అందువలననే అన్నివిధాలైన చీకట్లను పోగొట్టే వెలుగు అంటే ఇష్టపడే జాతి భారతజాతి. కనుకనే దీపాన్ని ఆరాధిస్తాము. పూజిస్తాము.

"దీపం జ్యోతి పరమ్ బ్రహ్మ
దీపం సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యాదీపం నమోస్తుతే!"

అని దీపాన్ని ప్రార్థిస్తాము. ఇది నిత్యకృత్యం. వరుసలుగా వందలాది, వేలాది దీపాలు వెలిగించటానికి ఎంతటి సంతోషం ఉప్పొంగి ఉండాలో కదా!

అటువంటి సందర్భం ద్వాపరయుగం చివర లో వచ్చింది. దానికి బీజం కృతయుగంలోనే పడి త్రేతా యుగంలో మొలకెత్తింది. యజ్ఞవరాహమూర్తిగా తనను ఉద్ధరించిన మహావిష్ణువుని చూసి వలచింది భూదేవి. తనకు కుమారుని ప్రసాదించమని కోరింది. ఆ సమయంలో గర్భధారణ జరిగితే అసుర లక్షణాలతో... లోక కంటకుడు అయిన కుమారుడు జన్మిస్తాడని అన్నాడు విష్ణువు. భూదేవి తమకంతో బలవంతం చేసింది. తప్పలేదు.

లోకకంటకుడు భూదేవి గర్భంలో ఉన్నాడని తెలిసిన దేవతలు ఆ బాలుడు గర్భంలో నుండి బయటకు రాకుండా చూశారు. భూదేవి విష్ణువుని వేడుకుంది. త్రేతాయుగం చివరలో కుమారుడు ఉదయిస్తాడని అభయం ఇచ్చాడు. ఆ బాలుడే నరకుడు. అతడికి పదహారు సంవత్సరాలు వచ్చిన తరువాత బ్రహ్మపుత్రానది పరీవాహక ప్రాంతంలో ప్రాగ్జ్యోతిషం రాజధానిగా కామరూపదేశానికి రాజుని చేస్తూ, ధర్మం తప్పవద్దని, గోబ్రాహ్మణులకు హాని తలపెట్టవద్దని, అలా చేస్తే కీడు వాటిల్లుతుందని హెచ్చరించాడు. ఆ మాట ననుసరించి చాలా కాలం భుజబలంతో తనకెవ్వరు ఎదురు లేని విధంగా ధర్మబద్ధంగానే పరిపాలించాడు. కాని, ద్వాపర యుగం చివరలో అతడిలోని అసురలక్షణాలు బహిర్గత మయ్యాయి. వేద ధర్మానికి దూరమై, తాంత్రికసాధన సత్వర ఫలవంతమని అనుసరించటం మొదలుపెట్టాడు. దానికోసం కామాఖ్యా దేవికి బలి ఇవ్వటానికి ఎంతోమంది రాజకుమారులను, పదునారు వేలమంది రాజకుమార్తెలను చెరపట్టి ఉంచాడు. అదితి కుండలాలను, వరుణుని ఛత్రాన్ని హరించాడు. దేవతలకు నిలువ నీడ లేకుండా చేశాడు. మరెన్నో దురంతాలు చేయసాగాడు.

ఇంద్రుడి అభ్యర్థన మేరకు శ్రీ కృష్ణుడు నరకునిపై యుద్ధానికి వెడుతుంటే భూదేవి అవతారమైన సత్యభామ తానూ వెంట వస్తానని ముచ్చట పడింది. అక్కడ కృష్ణుడు మూర్ఛపోతే అతడికి సేదతీర్చుతూనే యుద్ధంలో నరకుని నిలువరించింది. సత్యభామ ఉపచారాలతో తేరుకున్న కృష్ణుడు చక్రంతో నరకుని తెగటార్చాడు. అది ఆశ్వయుజ కృష్ణ చతుర్దశి. సత్యభామ కోరిక మేరకు ఆ రోజుని నరకుడి పేరుతో నరక చతుర్దశి అని పిలవటం జరిగింది. ఆ మరునాడు, అంటే, అమావాస్య నాడు ప్రజలందరు దీపాలు వెలిగించుకొని సంబరాలు చేసుకున్నారు.

ఏదైనా శుభ సంఘటన జరిగినప్పుడు కాని, ఎవరైనా మహానుభావులు పుట్టినప్పుడు కాని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకుంటారు. కాని, ఈ సందర్భంలో ఒకరు చనిపోతే అతడి పేరు మీద చేసుకోవటం జరుగుతోంది. అతడి చావు ఎందు కంతగా సంతోషప్రదమయింది?

నరకుడు భూదేవి పుత్రుడు. భూమి వసుంధర. అన్ని రకాలైన ఓషధులు, ఖనిజాలు ఇచ్చేది భూదేవియే. భూపుత్రుడైన నరకునికి వాటన్నిటి మీద వారసత్వపు అధికారం ఉంది. కాని అతడు ఆ అధికారాన్ని దుర్వినియోగం చేశాడు. సంపదలతో పాటు వెలుగుని కూడా ఎవరికీ అందకుండా తానే స్వంతం చేసుకున్నాడు. ప్రాగ్జ్యోతిషమంటే ముందుగా వెలుగు ప్రసరించే ప్రాంతం. భారతదేశంలో మొదటి సూర్యకిరణం భూమిని సోకేది అక్కడే కదా!

ముందుగా తనకి అందిన వెలుగుని ఇతరులకి చేరకుండా అడ్డుపడేవాడట!

నరకుని భయానికి పగటిపూట బయటకు రావటానికి భయం. వద్దామన్నా వెలుగు లేదు. రాత్రిపూట దీపం వెలిగిస్తే తమ ఉనికి తెలుస్తుందనే భయం. మొత్తానికి చీకట్లో, భయమనే చీకట్లో మగ్గారు. భయ కారణం పోగానే ఇన్నాళ్ళ దీపాలు, కరువుతీరా వెలిగించుకొని పండుగలు, వేడుకలు, సంబరాలు చేసుకున్నారు. ఆ శుభ సంఘటనని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఆశ్వయుజ కృష్ణ అమావాస్యనాడు దీపాలు వెలిగించటం సంప్రదాయం అయింది.

ఆశ్వయుజ బహుళ అమావాస్య నాడు లక్ష్మీదేవి క్షీరసాగరం నుండి ఆవిర్భవించి, విష్ణువుని వివాహ మాడింది. దానితో దేవతలకు పోయిన స్వర్గలక్ష్మి లభించింది. కనుక దేవతలు కూడా దీపావళిని ఆనందంగా జరుపుకుంటారు. మనలోనూ, కుటుంబంలోనూ, సమాజంలోనూ, దేశంలోనూ, భూమండలం అంతా కప్పిన అన్నివిధాలైన అంధకారాలు పటాపంచాలు అయ్యే విధంగా దీపాలని వెలిగించి దీపావళిని దివ్య దీపావళిగా ఆనందోత్సాలతో జరుపుకుందాం. వెలుగులని పంచుదాం.

– డా. ఎన్.అనంతలక్ష్మి

"సాజ్యం
త్రివర్తి సంయుక్తం
వహ్నినా యోజితం మయా
గృహాణ మంగళం దీపం
త్రైలోక్య తిమిరాపహం!"

మన ఇంట్లో వెలిగించింది ఒక్క దీపమైనా ముల్లోకాల చీకట్లను పోగొట్టాలన్నది భారతీయుల ఆశంస. ప్రపంచంలోని అన్ని దేశాలవారు, అన్ని జాతుల వారు ఏదో ఒక సందర్భంలో దీపాల పండగ చేసుకుంటారు. చీకటి అంటే ఎవరికీ ఇష్టం ఉండదు కదా! ఎవరు ఏ కారణంగా జరుపుకున్నా మనస్సులలో ఉన్న ఆనందాన్ని వ్యక్తపరచటానికి సంకేతంగా దీపాలను వెలిగిస్తారు. లోపల ఉన్న ఆనందమనే వెలుగుని బహిర్గతం చేసి, పరిసరాలని వెలిగేలా చేయటం దీపం వెలిగించటంలోని ఉద్దేశం.





నరకుని సంహరించినదెవరు?

స్వంత కొడుకునైనా దుష్టుడైతే సంహరించటానికి అంగీకరించే, సహకరించే ఉత్తమ మాతృ హృదయానికి సంకేతం సత్యభామ. సౌందర్యానికి, స్వాభిమానానికి, మితిమీరిన కృష్ణుడి పట్ల ఉన్న ప్రేమకి, పరాక్రమానికి పరాకాష్ఠగా మాత్రమే సత్యభామ ప్రసిద్ధం. కాని, మూర్తీభవించిన మాతృత్వం కూడా. ఒక్క దుష్టుడైన కుమారుడు లేకపోతే కోటానుకోట్ల బిడ్డలకి మేలు కలుగుతుంది అంటే అతడిని శిక్షించటానికి అంగీకరించేది విశ్వమాతృ హృదయం. ఆ శిక్ష అతడు మరిన్ని దుష్కృత్యాలు చేసి, మరింత పాపం మూటకట్టుకోకుండా కాపాడుతుంది. ఇది బిడ్డపై ఉన్న ప్రేమ కాదా! బిడ్డ సంహారాన్ని ప్రత్యక్షంగా చూడటమే కాదు, ప్రోత్సహించి, సహాయం చేసిన కారణంగా కాబోలు, నరకాసురుణ్ణి సత్యభామయే సంహరించింది అనే అపోహ ఉన్నది.

లక్ష్మీపూజ ఎందుకు?

దీపావళి నాడు లక్ష్మీదేవిని పూజించటం సంప్రదాయం. ఆనాడు లక్ష్మీదేవి పాలసముద్రం నుండి ఆవిర్భవించి, నారాయణుణ్ణి చేపట్టింది. వ్యాపారస్తులు లక్ష్మీదేవిని పూజించి ఈ రోజే కొత్త లెక్కల పుస్తకాలు మొదలుపెడతారు. లక్ష్మీదేవి ఆ నాడు సంధ్యాసమయం తరువాత తన వాహనమైన గుడ్లగూబని అధిరోహించి విహారానికి బయలుదేరి, తన స్వరూపాలైన దీపాలు ఉన్న ఇంట ప్రవేశిస్తుంది. కనుక లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతూ ఎన్నో దీపాలు వెలిగిస్తారు. తరువాత బాణసంచా పేలుస్తారు. దీపాలు వరుసగా వెలిగిస్తారు కనుక ఈ పండగను దీపావళి అంటారు.

జ్ఞాన జ్యోతులు

అన్ని సంప్రదాయాల వారు దీపావళి జరుపుకోవటానికి వారి కారణాలు వారికి ఉన్నాయి. ఎవరు ఏ కారణంగా జరుపుకున్నా మనస్సులలో ఉన్న ఆనందాన్ని వ్యక్తపరచటానికి సంకేతంగా దీపాలను వెలిగిస్తారు. లోపల ఉన్న ఆనందమనే వెలుగుని బహిర్గతం చేసి, పరిసరాలని అంతా వెలిగేట్టు చేయటం దీపం వెలిగించటంలోని ప్రధాన ఉద్దేశం. ముందురోజు నరకచతుర్దశి నాడు తెల్లవారుజామున చంద్రుడు ఉండగా నువ్వులనూనెతో అభ్యంగన స్నానం చేస్తారు. పెద్దలు యముడికి తర్పణాలు ఇస్తారు. పిండివంటలు, కొత్తబట్టలతో ఆనందంగా గడుపుతారు. మరునాడు దీపావళి. అమావాస్య పితృతిథి. పైగా దక్షిణాయనం. కనుక మధ్యాహ్న సమయంలో పితృదేవతలకు తర్పణాలు ఇస్తారు.

సాక్షి స్పోర్ట్స్



ఆర్చరీలో తొలి ఒలింపిక్స్ బెర్తు తెచ్చిన ధీరజ్

ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ఆర్చరీలో తొలి ఒలింపిక్స్ కోటా బెర్తును తెచ్చిపెట్టాడు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఆసియా కాంటినెంటల్ క్వాలిఫికేషన్ టోర్నమెంట్‌లో ధీరజ్ రజతం సాధించాడు. ఫైనల్లో స్వర్ణ పతకంపై గురిపెట్టిన 22 ఏళ్ల తెలుగు కుర్రాడు 5–6తో జి సియాంగ్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడి... రజతంతో సరిపెట్టుకున్నాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో ధీరజ్ 6–0తో సాదిగ్ అష్రాఫి బవిలి (ఇరాన్)పై, సెమీ ఫైనల్లో 6–0తో మొహమ్మద్ హొస్సేన్ గొల్షాని (ఇరాన్)పై విజయం సాధించాడు. ఈ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన ఇద్దరికి మాత్రమే ఒలింపిక్స్ కోటా బెర్తు లభిస్తుంది. మహిళల విభాగంలో అంకిత భకత్ క్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోవడంతో బెర్తు దక్కలేదు.

ప్రపంచకప్ సెమీ ఫైనల్

భారత్ X న్యూజిలాండ్
నవంబర్ 15 (ముంబై)

ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
నవంబర్ 16 (కోల్‌కతా)

మిచెల్ మార్ష్ వీరవిహారం



- 132 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సర్లతో 177 నాటౌట్
- విజయంతో ముగించిన ఆస్ట్రేలియా
- 8 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు

పుణే: ఐదు సార్లు విజేత ఆస్ట్రేలియా ప్రపంచకప్‌లో లీగ్ దశను ఘనంగా ముగించింది. ఆరంభంలో తడబడి రెండు మ్యాచ్‌లు ఓడినా...ఆ తర్వాత ప్రతీ మ్యాచ్‌కు తమ ఆటను మెరుగుపర్చుకుంటూ వచ్చింది. సెమీఫైనల్ స్థానం ఖాయమైన తర్వాతా అదే దూకుడును కనబర్చి ఏడో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన పోరులో ఆసీస్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. తౌహీద్ హ్రిదయ్ (79 బంతుల్లో 74; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నజ్ముల్ హొస్సేన్ (57 బంతుల్లో 45; 6 ఫోర్లు) రాణించగా...తన్‌జిద్ (36), లిటన్ దాస్ (36), మహ్ముదుల్లా (32), మెహదీ హసన్ మిరాజ్ (29) ఫర్వాలేదనిపించారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా 44.4 ఓవర్లలో 2 వికెట్లకు 307 పరుగులు చేసి విజయాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (132 బంతుల్లో 177 నాటౌట్; 17 ఫోర్లు, 9 సిక్సర్లు) విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా, స్టీవ్ స్మిత్ (64 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 22.3 ఓవర్లలోనే అభేద్యంగా 175 పరుగులు జోడించారు. డేవిడ్ వార్నర్ (61 బంతుల్లో 53; 6 ఫోర్లు) కూడా అర్ధసెంచరీ చేశాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జిద్ (సి) ఇంగ్లిస్ (బి) అబాట్ 36; లిటన్ (సి) లబుషేన్ (బి) జంపా 36; నజ్ముల్ రనౌట్ 45; తౌహిద్ (సి) లబుషేన్ (బి) స్టొయినిస్ 74; మహ్ముదుల్లా రనౌట్ 32; ముష్ఫికర్ (సి) కమిన్స్ (బి) జంపా 21; మెహిదీ హసన్ మిరాజ్ (సి) కమిన్స్ (బి) అబాట్ 29; నజుమ్ రనౌట్ 7; మెహదీ హసన్ నాటౌట్ 2; తస్కిన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–76, 2–106, 3–170, 4–214, 5–251, 6–286, 7–303, 8–304. **బౌలింగ్:** హాజల్‌వుడ్ 7–1–21–0, కమిన్స్ 8–0–56–0, అబాట్ 10–0–61–2, మార్ష్ 4–0–48–0, జంపా 10–0–32–2, హెడ్ 6–0–33–0, స్టొయినిస్ 5–0–45–1.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) తస్కిన్ 10; వార్నర్ (సి) నజ్ముల్ (బి) ముస్తఫిజుర్ 53; మార్ష్ నాటౌట్ 177; స్మిత్ నాటౌట్ 63; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (44.4 ఓవర్లలో 2 వికెట్లకు) 307. వికెట్ల పతనం:** 1–12, 2–132. **బౌలింగ్:** తస్కిన్ అహ్మద్ 10–0–61–1, మెహిదీ హసన్ 9–0–38–0, నజుమ్ అహ్మద్ 10–0–85–0, మెహిదీహసన్ మిరాజ్ 6–0–47–0, ముస్తఫిజుర్ 9.4–1–76–1.

పరుగుల ధమాకాకు భారత్ సిద్ధం

- నేడు ప్రపంచకప్‌లో చివరి లీగ్ మ్యాచ్
- నెదర్లాండ్స్‌తో టీమిండియా పోరు
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఒక మ్యాచ్‌ను మించి మరో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన...ఒకరితో పోటీ పడి మరొకరు చెలరేగుతూ విజయాల్లో తమ భాగస్వామ్యం...ఎదురు లేని ఆటతో దూసుకుపోతున్న భారత జట్టు ప్రపంచకప్‌లో లీగ్ దశను అజేయంగా ముగించేందుకు సిద్ధమైంది. ఎనిమిది వరుస విజయాల తర్వాత చివరి పోరులోనూ నెగ్గి స్కోరును 9/9కు చేర్చాలని టీమిండియా పట్టుదలగా ఉంది. పెద్ద పెద్ద జట్లే రోహిత్ సేన ముందు నిలవలేకపోగా...బలహీనమైన నెదర్లాండ్స్ ఇప్పుడు ఎదురుగా ఉంది.

బెంగళూరు: వరల్డ్ కప్‌లో ఎప్పుడో సెమీస్ స్థానాన్ని ఖాయం చేసుకున్న టీమిండియా వరుసగా తొమ్మిదో విజయాన్ని ఆశిస్తోంది. 2003 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా 8 మ్యాచ్‌లు నెగ్గింది. ఇప్పుడు మరో మ్యాచ్‌లో గెలిస్తే కొత్త ఘనత నమోదవుతుంది. ఈ ప్రపంచకప్‌లోనే ఆఖరి లీగ్ మ్యాచ్ (45వ)లో నేడు నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. బలాబలాలు, అంచనాల ప్రకారం టీమిండియా డచ్‌కంటే ఎన్నో రెట్లు మెరుగైన స్థితిలో ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఈ వరల్డ్ కప్‌లో కూడా భారీ స్కోర్లే నమోదు కాగా, మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

ప్రసిధ్‌కు అవకాశం...

భారత జట్టు జైత్రయాత్ర చూస్తే తుది జట్టులో నిజానికి ఎలాంటి మార్పులు అవసరం లేదు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగే సెమీ ఫైనల్ పోరు గురించే ప్రస్తుతం భారత జట్టు ఆలోచిస్తోంది. అయితే ప్రస్తుత ప్రత్యర్థిని బట్టి చూస్తే ఒకటి రెండు మార్పులతో బరిలోకి దిగవచ్చు. పేసర్లలో ఒకరిని పక్కన పెట్టిన కొత్తగా జట్టులోకి చేరిన ప్రసిధ్ కృష్ణకు అవకాశం కల్పించవచ్చు. కర్నాటకకే చెందిన ప్రసిధ్ బరిలోకి దిగితే అతనికి ఇదే తొలి వరల్డ్ కప్ మ్యాచ్ అవుతుంది. చెన్నైలో ఆస్ట్రేలియాపై తొలి మ్యాచ్ ఆడిన తర్వాత మిగిలిన 7 మ్యాచ్‌లలో స్పిన్నర్ అశ్విన్‌కు చోటు దక్కలేదు. ఇక్కడ కుల్దీప్ స్థానంలో అతడిని ఆడించేందుకు అవకాశం ఉంది. మరో వైపు ఐపీఎల్‌లో విరాట్ కోహ్లి సొంత మైదానమైన చిన్నస్వామి స్టేడియంలో అతని ఆట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కోల్‌కతాలో 49వ సెంచరీతో సచిన్ రికార్డు సమం చేసిన కోహ్లి ఇక్కడ 50వ శతకం బాదుతాడా అనేది ఆసక్తికరం.



పోటీనిచ్చేనా...

అక్కడక్కడా కొన్ని మెరుపులు మినహా ఓవరాల్‌గా నెదర్లాండ్స్ ఆటతీరు సాధారణంగా ఉంది. పటిష్టమైన భారత్‌కు ఈ టీమ్ ఏమాత్రం పోటీనివ్వగలదనేది చూడాలి. ఓపెనర్లు డౌడ్, బరెసి శుభారంభంతో పాటు కెప్టెన్ ఎడ్వర్డ్స్, అకెర్‌మన్, డి లీడ్ బ్యాటింగ్‌లో... మీకెరెన్, వాన్ బీక్ బౌలింగ్‌లో అంచనాలకు తగినట్లుగా రాణిస్తే కొంత పోరాడవచ్చు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టి ఆపై న్యూజిలాండ్‌కు వలస వెళ్లి ప్రస్తుతం నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తేజ నిడమనూరు తొలిసారి స్వదేశంలో భారత జట్టుపై ఆడనున్నాడు. ఈ క్షణం కోసం తాను ఉద్వేగభరితంగా ఎదురు చూస్తున్నట్లు అతను చెప్పాడు.

ఘన విజయంతో ఇంగ్లండ్ ఇంటికి



- రాణించిన స్టోక్స్, విల్లీ
- 93 పరుగులతో బట్లర్ సేన గెలుపు
- ఓటమితో పాక్ నిష్క్రమణ

కోల్‌కతా: డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ వరల్డ్ కప్‌లో అడుగు పెట్టిన ఇంగ్లండ్ టోర్నీలో చెత్త ప్రదర్శనతో విమర్శలపాలైంది. వరుస ఓటములతో ఎప్పుడో సెమీస్ అవకాశాలు కోల్పోయిన ఆ జట్టు చివరకు విజయంతో టోర్నీని ముగించి ఇంటిముఖం పట్టింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో పాకిస్తాన్‌తో జరిగిన ఆఖరి లీగ్‌లో ఇంగ్లండ్ 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు చేసింది. బెన్ స్టోక్స్ (76 బంతుల్లో 84; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), జో రూట్ (72 బంతుల్లో 60; 4 ఫోర్లు), బెయిర్ స్టో (61 బంతుల్లో 59; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. టాస్ గెలిచి ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకోవడంతోనే పాకిస్తాన్ సెమీస్ ఆశలు పూర్తిగా గల్లంతయ్యాయి. అయితే 'నామ్‌కే వాస్తే' తరహాలో లక్ష్యాన్ని లెక్క కట్టి చూస్తే... సెమీస్‌కు అర్హత సాధించాలంటే 6.4 ఓవర్లలో 338 పరుగులు చేయాలి. ఇది అసాధ్యం కావడంతో పాక్ ఊరట విజయంపై దృష్టి పెట్టింది. కానీ భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాక్ 43.3 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆగా సల్మాన్ (45 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, కెప్టెన్ బాబర్ ఆజమ్ (45 బంతుల్లో 38; 6 ఫోర్లు), రిజ్వాన్ (51 బంతుల్లో 36; 2 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడారు. 191 పరుగులకే 9 వికెట్లు కోల్పోగా 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రవూఫ్ (23 బంతుల్లో 35; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) కాసేపు మెరిపించాడు. వన్డే కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ ఆడిన డేవిడ్ విల్లీ 3 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. వన్డే ప్రపంచకప్‌ల చరిత్రలో ఒక టోర్నీలో పాక్ 5 మ్యాచ్‌ల్లో ఓటమి పాలవడం ఇదే మొదటిసారి.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: మలాన్ (సి) రిజ్వాన్ (బి) ఇఫ్తికార్ 31; బెయిర్‌స్టో (సి) సల్మాన్ (బి) రవూఫ్ 59; రూట్ (సి) షాదాబ్ (బి) షాహిన్ 60; స్టోక్స్ (బి) షాహిన్ 84; బట్లర్ రనౌట్ 27; బ్రూక్ (సి) షాహిన్ (బి) రవూఫ్ 30; అలీ (బి) రవూఫ్ 8; వోక్స్ నాటౌట్ 4; విల్లీ (సి) ఇఫ్తికార్ (బి) వసీమ్ 15; అట్కిన్సన్ (బి) వసీమ్ 0; రషీద్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 337. వికెట్ల పతనం:** 1–82, 2–108, 3–240, 4–257, 5–302, 6–308, 7–317, 8–336, 9–336. **బౌలింగ్:** షాహిన్ 10–1–72–2, రవూఫ్ 10–0–64–3, ఇఫ్తికార్ 7–0–38–1, వసీమ్ 10–0–74–2, షాదాబ్ 10–0–57–0, సల్మాన్ 3–0–25–0. **పాకిస్తాన్ ఇన్నింగ్స్:** షఫీక్ (ఎల్బీ) (బి) విల్లీ 0; ఫఖర్ (సి) స్టోక్స్ (బి) విల్లీ 1; బాబర్ (సి) రషీద్ (బి) అట్కిన్సన్ 38; రిజ్వాన్ (బి) అలీ 36; షకీల్ (బి) రషీద్ 29; సల్మాన్ (సి) స్టోక్స్ (బి) విల్లీ 51; ఇఫ్తికార్ (సి) మలాన్ (బి) అలీ 3; షాదాబ్ (బి) రషీద్ 4; షాహిన్ (ఎల్బీ) (బి) అట్కిన్సన్ 25; వసీమ్ నాటౌట్ 16; రవూఫ్ (సి) స్టోక్స్ (బి) వోక్స్ 35; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (43.3 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1–0, 2–10, 3–61, 4–100, 5–126, 6–145, 7–150, 8–186, 9–191, 10–244. **బౌలింగ్:** విల్లీ 10–0–56–3, వోక్స్ 5.3–0–27–1, రషీద్ 10–0–55–2, అట్కిన్సన్ 8–0–45–2, అలీ 10–0–60–2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	9	7	2	14	0.841
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	9	4	5	8	-0.199
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	9	3	6	6	-0.572
బంగ్లాదేశ్	9	2	7	4	-1.087
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

కాపు/41/5'11" / (Unmarried, Govt. ఆఫీసర్, 75,000/- PM, దృష్టిలోపం) గల వరునికి, కేవలం వివాహం అలస్యమైన 30yrs పై బడిన Unmarried హిందూ వధువు కావలెను. Ph: 9177904999 (No Brokers). [H-793612]

రెడ్డి/32y/5'9"/M.Tech/MS/10 లక్షలు నెలకు/60Cr ప్రాపర్టీ Only Son కి వధువు కావలెను. డైరెక్ట్. No Brokers. 8019468462, 8897213126 [H-793430]

40 సం॥ వయసు కలిగి, అవివాహితుడైన PG చదివిన 5.7'' ఎత్తు, 25 లక్షల ఆదాయం, హైదరాబాద్‌లో సెల్ఫ్ ఎంప్లాయి వరునికి వధువు కావలెను. సం॥ 9985637279 [WB-30813]

రెడ్డి: OC/30/5'8"/B.Tech/4 Lakhs. pm/ కోట్ల ఆస్తి/ వరుడికి మంచి వధువు కావలెను. వెరివెరి అర్జెంటు. Ph: 6303293337, వాట్సప్: 8187053655 [H-14034]

SC మాల & క్రిస్టియన్ M.Tech/C.Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/ 80,000- pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093 [H-14034]

SC మాదిగ & క్రిస్టియన్ B.Tech(సివిల్)/ Govt A.E.E/ R&B Dept/ 85000/- pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9676995093, 9703978131 [H-14034]

క్రిస్టియన్ మాల: B.Tech/ C.Govt మేనేజర్ / SBI/ 70,000/- pm/ 5'10" ఎత్తు/ 30 సం॥ల వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8790016395 [H-14034]

రెడ్డి హైప్రొఫైల్: 30 బిజినెస్ ఫ్యామిలీ PG, 28, జాబ్ * రెడ్డి, USA, 32 డివోర్స్ *డాక్టర్, రెడ్డి, 36, డివోర్స్ *వ్యాపారవేత్త 51, విడో *రెడ్డి దేశ/విదేశీ వస్ట్, సెకండ్ అలస్యం Matches కోసం Contact: 6304826162 [H-14034]

36 సం.ల/బిజినెస్ చేస్తున్న ప్రాపర్టీ ఉన్న వరుడుకి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. ఔరి, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 6301055248, 8331825043 [HA-30284]

రెడ్డి:33/ 5.6/ Govt.Job /35,000/P.M. వరుడికి రెడ్డి/B.Tech/జాబ్ చేస్తున్నా ok. అందమైన వధువు కావలెను. డైరెక్ట్‌గా సం.ప్ర॥99637 93636. [L-798904]

Reddy/40/5.6/B.Tech Software employee good salary any 1st and 2nd FAIR అందమైన అమ్మాయి తోడుకు కావలెను. Direct contac t: 73375 86682 [L-798903]

వైశ్య(డైరెక్ట్) 52/5'3 లేట్ మ్యారేజ్ B.A.,B.L. బిజినెస్ చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరునికి వధువు కావలెను. (1లేదా 2వ మ్యారేజ్) A.P., W.G.Dist., తణుకు. సంప్ర: 93812 12746. [P-1871]

★

అమ్మాయి కావలెను అన్ని కులాలు 1వ చదువు అవసరం లేదు. కోమట్ల అబ్బాయి 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్ 18 వేలు, ఆస్తి 40 లక్షలు, నల్లగొండ. : 9121325068 [Y-772549]

★★

కమ్మ, 36 / MCA / 1.5 pm / వ్యాపారం చేయువారికి తగిన వధువు కావలెను. 1 & 2వ, Widow Does not Matter Irrespective of caste, ddirek. ఫోన్: 93470 43490 [V-778148]

వరుడు కావలెను

కుల ఆస్తి పట్టింపు లేదు/బిజినెస్, జాబ్, 2L/PM 6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ముఖాముఖి కల్పించబడును. ఇల్లరికం OK ఖచ్చితంగా కుదుర్చబడును. Ph: 9704477206 [H-793384]

రెడ్డి/45yrs/ కుల పట్టింపులేదు/ ఫెయిర్/ovt. ఎంప్లాయ్, 1 లక్ష K (PM), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, స & సొంత 3 ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok). సంప్ర: 8374802603 [H-793612]

కాపు/35 yrs/ కుల పట్టింపులేదు/ 2nd మ్యారేజ్, Govt. ఎంప్లాయ్, 70K (PM), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok). సంప్ర: 9492081545 [H-793612]

డైవర్సీ 2వ పెళ్ళి/36 yrs, Govt. ఎంప్లాయ్, 2,00,000/- (pm), వెల్‌సెటిల్డ్, కుల ప్రసక్తిలేని అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా Ok). సంప్ర: 8332006483 [H-793612]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి New York, BE, MS, 27, 6' 1", 100 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 6', Data Analyst, 80 K, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Atlanta, BE, MS, 29, 6', Engineer, 110 K, H1, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 29, 6' 1", Software Developer, 140 K, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Govt, MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 26, 5' 3", Hyderabad, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి California, BE, MS, 26, 5'6", SWE, 130 K, H1, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK BE, MBA, 26, 5'6", 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (రెడ్డిలకు మాత్రమే)

690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad

D.V. Koti Reddy

98480 11818, 93933 11818

రెడ్డి New York, BE (NIT), MS, 28, 6', Associate, 200 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 8", Sr SWE, 160 K, 30 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5' 8", Sr Analyst, 31 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5' 11", PG Doctor, Hyd, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", SWE, 22 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 5", Analytics, 50 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Sanjose, BE, MS, 28, 5' 3", Project Engineer, 150 K, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 28, 5' 8", Dental Doctor, 20 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

---

39 yrs/ డైవర్సీ/ 2వ పెళ్ళి/Govt. ఎంప్లాయ్, 2,50,000/- (pm), వెల్‌సెటిల్డ్, కుల ప్రసక్తిలేని అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా Ok). సంప్ర: 7386550413 [H-793612]

రెడ్డి/విడో/57/5'5"/VFair/Govt (HM)/25 ఎకరాల కొబ్బరి తోటలు/సొంత ఇల్లు రెంట్స్/2 L/PM గల ఏ బాదరబందీలేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-793384]

చౌదరి/విడో/55y/తెల్లనిచాయ/తక్కువ చదువు/చిన్న ఉద్యోగం/2 ఇల్లులు గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8977079749 [H-793384]

కాపు/కుల పట్టింపు లేదు/2వ పెళ్ళి/53y/విడో/సొంత ఇల్లులు/ రెంట్స్/పిల్లలు లేరు/సొంత ప్రాపర్టీ ఎలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). Ph: 7799083500, 7386660643 [H-793384]

FC/విడో/60y/5'4"Fair/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్/5 ఎకరాల పొలం/మంచి ఆర్థిక స్తోమత గల వెల్ సెటిల్డ్ వధువుకు మంచి స్నేహస్వభావం గల వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. Ph: 7095845789 [H-793384]

కమ్మ/38y/5'5"/Bank Employ/Fair/80 వేలు నెలకు/20Cr ప్రాపర్టీ కల్గిన అందమైన వధువుకి Job/Business చేయు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7396608019, 8019484384 [H-793430]

రెడ్డి/58y/5'3"/సొంత కోళ్లఫారం/2 లక్షలు నెలకు/20 ఎకరాల తోట కల్గిన విడో వధువుకి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 8019484384, 7396608019 [H-793430]

రెడ్డి/26 / 5'5" /M.Tech / 3 Lakhas PM/ 10Cr వధువుకి వరుడు కావలెను. డైరెక్ట్. No Brokers. Ph: 8897213126, 8019468462 [H-793430]

రెడ్డి/27y / 5'4 / B.Tech/MBA/SWE/ 18L P/A/Own Plots కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9848226983. [H-793526]

కుల పట్టింపు లేదు/విడో/55y/Guntur/లెక్చరర్/ Own House Rents/Well Settled/పిల్లలు పుట్టే అవకాశం ఏకైక వధువుకు Fc/Bc వరుడు కావలెను (పిల్లలున్నా Ok) ఫోన్: 7997175138. [H-793526]

2వ పెళ్ళి/రెడ్డి/కులప్రసక్తి లేదు/40y/PG/Govt ఆఫీసర్/ 3L PM సొంత ఇల్లు+కారు పిల్లలు లేని కోట్ల ఆస్తి గల V. ఫెయిర్ వెల్‌సెటిల్ వధువుకు వరుడు కావలెను (పిల్లలున్నా & ఇల్లరికం Ok) ఫోన్: 7396218324. [H-793526]

రెడ్డి/25y/5'5/M.Tech/22L P/A/6 ఎ॥ ఫార్మ్ ల్యాండ్ Own House గల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను ఫోన్: 9553652167. [H-793526]

క్రిస్టియన్ 2వపెళ్ళి/ కులప్రసక్తి లేదు/ B.Tech/ SWE/ టీమ్‌లీడర్/75000/- pm /5'4" ఎత్తు/32 సం॥ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [H-14034]

2వ పెళ్లి: 52yrs/ 60,000/- pm/ Own House/ 20 ఎ॥రాల వరి పొలాలు గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK Ph: 9381250286 [H-14034]

యాదవ: B.Tech/(సివిల్)/ఏకైక కుమార్తె/ C.Govt. బ్యాంక్ P.O/ కెనరాబ్యాంక్/5'4" ఎత్తు/ 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [H-14034]

రెండో పెళ్లి: 62y& 60y& 58Y& 56& 54Y& 53Y& 51y& 50y& 48y& 47y& 46y& 44y& 43y& 42y& 40y& 39y& 37y& 35y& 33y& 31y& 30y& 28y& 26y& 25y "మాసేవా" (Sinc: 1998). Ph/WA: Ph: 9291503949 [H-14034]

BC-C, 34, ఫెయిర్, డాక్టర్, MD, DM, న్యూరాలజీ, గవర్నమెంట్ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు MD, DM, IAS/IRS వరుడు కావలెను. నో క్యాస్ట్. ✆ 9848 775 773. [B-1263160]

SC-మాల, హిందూ 2nd మ్యారేజ్ వయస్సు 39 H-5'3" M-Tech., ప్రైవేట్ జాబ్, జీతం : 80 వేలు, వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి కావలెను. (హిందూ (or) క్రిస్టియన్స్ పర్వాలేదు) ✆ : 77949 11019 [R-1151815]

వేదికలు

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14030]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-189438]

మాల, మాదిగ స్పెషల్. IAS, IPS, IFS, IRS, గ్రూప్ I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-14131]

మైత్రీ మ్యారేజ్ బ్యూరో. Only for Reddys 3Cr to 300 కోట్ల Matches చూడబడును. Fast Settlement Local/ Abroad/ Business. G.S.Reddy. Ph: 8019468462, 8897213126 [H-793430]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14030]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14030]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14030]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14030]

గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, యాత శ్రీశైన, మా కష్టమర్లకు శ్రేయోభిలాషులకు, కీపాలి శుభాకాంక్షలు "శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో, DSNR, HYD వ్యవస్థాపకులు: స్వర్గీయ ఎస్.శారదా గౌడ్, ఎస్. రాములు గౌడ్ ఫోన్: 8790890809. [H-793526]

క్రిస్టియన్ మాల మాదిగ లేట్ మ్యారేజెస్ & సెకండ్ మ్యారేజెస్ వధూవరులకై సంప్ర: Ph: 8790016395 [H-14034]

Fast Settlement-పెళ్ళి సంబంధాలు-అన్ని కులాలు-అన్ని ప్రాంతాలు. సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ VIPవారికిPersonal Service చేస్తాము. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, Cont: 7093722724. [T-1969]

ఫ్రీ రిజిస్ట్రేషన్ యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని మీకు నచ్చిన పెళ్ళి సంబంధం మీరే చూసుకోండి. www.rohinimarriagelines.com ✆ 94418 29644, 98490 58673, 94407 85888 (W) [B-950]

★

కుల పట్టింపులు లేని 1,2 & Late వరునికి / వధువునకు & ఇంకా పెళ్లికాని (రెడ్డి కులం) వరులకు & పేదింటి వధువులకు పెళ్లి సంబంధాలు చూడడం మా ప్రత్యేకత. Ph: 8019965137 / 8121065137 [H-788389]

మీ వ్యాఖ్యలు బీజేపీవా? చంద్రబాబువా?

• ఎమ్మెల్సీ వరుదుకళ్యాణి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై పురందేశ్వరి వ్యాఖ్యలు బీజేపీ తరఫున చేసినవా? లేక చంద్రబాబు తరఫున చేసినవా? ప్రజలకు చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలపై ఆమె శనివారం బహిరంగ లేఖ రాశారు. లేఖలోని ముఖ్యాంశాలిలా ఉన్నాయి. 'రాష్ట్రంలో డిస్టిలరీలు, మద్యం అమ్మకాలపై కొంత కాలంగా చేస్తున్న ఆరోపణలను బ్లాక్‌మెయిల్ రాజకీయాలుగా భావించాలి! బహుశా మీ మరిది చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో 53 రోజులు రిమాండ్‌లో ఉంచడం మీరు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నట్టుంది. బెల్టుషాపులతో గుడీ, బడీ తేడా లేకుండా అన్ని చోట్లా మద్యాన్ని ఏరులై పారించింది మీ మరిది పాలనలోనే కదా. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు దుకాణాల్లో, బెల్ట్ షాపుల్లో అమ్మిన సమయంలో.. కేవలం 7 డిస్టిలరీలు 80శాతం ఉత్పత్తి చేసిన ఆ సమయంలో మీ గొంతు ఎందుకు మూగబోయింది? ఇప్పుడు లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే మద్యం అమ్ముతూ, మద్యం దుకాణాలు, మద్యం సేల్స్ తగ్గించి, రేట్లు పెంచి, బెల్ట్ షాపుల్ని పూర్తిగా నిర్మూలించిన జగన్ ప్రభుత్వాన్ని ఎందుకు విమర్శిస్తున్నట్టు? మీ తండ్రి పెట్టిన మద్య నిషేధాన్ని ఎత్తేసిన మీ మరిదికి మద్దతిచ్చి.. మీ తండ్రిని వెన్నుపోటు పొడిచిన మీరు.. ఇప్పటికీ చంద్రబాబు మద్యం విధానమే బాగుందని చెపుతున్నారంటే.. ఇంతకంటే రాజకీయ పతనం ఉంటుందా?' అని లేఖలో పేర్కొన్నారు.

'అమెరికా' ఏం చదువుతోంది?

విద్యార్థుల ఆసక్తిపై నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్స్ అధ్యయనం

- అగ్రదేశంలో కంప్యూటర్ సైన్స్‌కే విశేష ఆదరణ
- ఈ ఒక్క రంగంలోనే దశాబ్దకాలంలో 144 శాతం పెరిగిన గ్రాడ్యుయేట్లు
- వన్నె తగ్గని బిజినెస్ మేనేజ్‌మెంట్
- ఏటా దాదాపు 4 లక్షల మంది 'బిజినెస్' గ్రాడ్యుయేట్లు తయారీ
- లిబరల్ ఆర్ట్స్‌లో తగ్గుతున్న చేరికలు.. సామాజికశాస్త్రాలదీ అదేతీరు
- ఆకర్షణీయ ఉపాధి, ఉద్యోగ అవకాశాలవైపే అమెరికా విద్యార్థుల మొగ్గు



(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

అమెరికాలో విద్యనభ్యసించడం వివిధ దేశాలకు చెందిన ఎన్నో లక్షల మంది విద్యార్థుల స్వప్నం. ఎన్నో కష్టాలు పడి, వివిధ పరీక్షలు రాసి అమెరికాకు పరుగులు తీస్తుంటారు. అక్కడే గ్రాడ్యుయేషన్లు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్లు చేసి.. ఉద్యోగాలు కూడా సంపాదించి స్థిరపడిపోతుంటారు. కానీ అసలు అమెరికా విద్యార్థులు ఏం చేస్తున్నారు? ఏఏ కోర్సులు ఎక్కువగా చదువుతున్నారు? ఏఏ రంగాలపై ఆసక్తి చూపిస్తున్నారు? అనే ప్రశ్నలు మనలో తలెత్తుతుంటాయి. ఈ అంశాలపై అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్స్ (ఎన్‌సీఈఎస్) అధ్యయనం చేసి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. పలు ముఖ్యమైన కోర్సులపై అధ్యయనం చేసింది. 2010-11 విద్యా సంవత్సరంలో వివిధ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్యతో.. సరిగ్గా దశాబ్దం తర్వాత అంటే 2020-21లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్యతో పోల్చి గణాంకాలు రూపొందించింది.

కంప్యూటర్ సైన్స్‌కే పట్టం

అమెరికాలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుకే విద్యార్థుల నుంచి విశేష ఆదరణ దక్కింది. దశాబ్దకాలం తర్వాత కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లు 144 శాతం పెరిగారు. 2010-11లో 43,066 మంది కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, 2020-21లో ఈ రంగం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్య 1,04,874కు పెరిగింది. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులో ఉండటం, భవిష్యత్‌ను శాసించే శక్తి ఉందని యువత భావించడం వల్లే దీనిపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

వైద్య రంగంలోనూ భారీ వృద్ధి: వైద్య, ఆరోగ్య రంగంలోని విస్తృత అవకాశాలు కూడా అమెరికా విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. 2010-11తో పోల్చితే.. 2020-21 విద్యా సంవత్సరంలో 87 శాతం వృద్ధితో 2.6 లక్షల మంది విద్యార్థులు ఈ రంగంలో పట్టాలు అందుకున్నారు. అమెరికాలోని మొత్తం గ్రాడ్యుయేట్లలో వైద్య, ఆరోగ్య రంగంలో పట్టభద్రులైన విద్యార్థుల సంఖ్య దాదాపు 13 శాతం. అలాగే బయోమెడికల్ సైన్స్‌లోనూ 46 శాతం వృద్ధి నమోదైంది. కోవిడ్ సంక్షోభం తర్వాత ఈ విభాగంలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

వన్నె తగ్గని ఇంజనీరింగ్ కోర్సులు

కంప్యూటర్ సైన్స్‌ను మినహాయించి మిగతా బ్రాంచ్‌లను ఇంజనీరింగ్ కింద పరిగణించారు. దశాబ్దకాలంలో 65 శాతం వృద్ధితో 1.26 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు 2020-21లో కాలేజీల నుంచి పట్టాలతో బయటకు వచ్చారు. ఏటా లక్ష డాలర్లకు తగ్గని వేతనాలు, ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదనే భరోసా.. ఈ రంగం వైపు విద్యార్థులు ఆకర్షితులవ్వడానికి కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారుతున్న వారిలో ఇంజనీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారి శాతమే ఎక్కువ.

దాదాపు 4 లక్షల మంది..

అమెరికాలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు ఆదరణ ఏటా పెరుగుతూనే ఉంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్న వారిలో అత్యధికులు ఈ రంగం వారే. 2020-21లో దాదాపు 4 లక్షల మంది ఈ విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

పడిపోతున్న 'ఆర్ట్స్'

అమెరికాలో పలు ఆర్ట్స్ గ్రూప్‌లకు ఆదరణ తగ్గుతోంది. సామాజిక శాస్త్రాలు, భాషలు, చరిత్ర లాంటి 17 సబ్జెక్టుల్లో గత దశాబ్దకాలంలో విద్యార్థుల చేరికలు తగ్గినట్లు తేలింది. ఇంగ్లిష్, చరిత్ర తదితర సబ్జెక్టుల్లో దశాబ్దకాలంలో 35 శాతం విద్యార్థుల సంఖ్య పడిపోయింది. పాకశాస్త్రంలో తగ్గుదల 50 శాతానికిపైగా ఉంది.

ఉపాధి అవకాశాలున్నా.. తగ్గిన చేరికలు

అమెరికాలో ఎడ్యుకేషన్ రంగంలో గ్రాడ్యుయేషన్ చేసే వారి సంఖ్య తగ్గుతోంది. టీచర్ల వేతనాలు పెద్దగా పెరగకపోవడం ఈ రంగంలోకి విద్యార్థులు రాకపోవడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. టీచర్ల కొరత ఉన్నందున ఉద్యోగవకాశాలు సులభంగా దక్కే అవకాశం ఉన్నా.. ఇతర రంగాల వైపే విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. దశాబ్దకాలంలో 16 శాతం మేర చేరికలు తగ్గాయి. అలాగే మారుతున్న ప్రపంచంలో పరిశ్రమలు స్పెషలైజేషన్‌ను కోరుకుంటుండటంతో విద్యార్థులు కూడా లిబరల్ ఆర్ట్స్‌వైపు ఆసక్తి చూపించడం లేదు. దీంతో విద్యార్థుల సంఖ్య దశాబ్దకాలంలో 10 శాతం తగ్గింది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఇంగ్లిష్‌దీ ఇదే పరిస్థితి.

సబ్జెక్టుల వారీగా గ్రాడ్యుయేట్ల పెరుగుదల, వృద్ధి

సబ్జెక్టు	2010-11లో గ్రాడ్యుయేట్లు	2020-21లో గ్రాడ్యుయేట్లు	వృద్ధి శాతం
బిజినెస్ మేనేజ్‌మెంట్	3,63,919	3,90,781	7
వైద్యం	1,43,463	2,68,018	87
బయోమెడికల్ సైన్స్	89,984	1,31,499	46
సైకాలజీ	1,00,906	1,26,944	26
ఇంజనీరింగ్	76,356	1,26,037	65
కంప్యూటర్ సైన్స్	43,066	1,04,874	144
కమ్యూనికేషన్	83,231	90,775	9
శాంతిభద్రతలు	47,600	58,009	22
ఇంటర్‌డిసిప్లినరీ స్టడీస్	42,473	54,584	29
ఫిట్‌నెస్ స్టడీస్	35,934	54,294	51
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	26,799	34,817	30
ఫిజికల్ సైన్స్	24,338	28,706	18
మేథమేటిక్స్	17,182	27,092	58
అగ్రికల్చర్	15,851	21,418	35
నేచురల్ రిసోర్సెస్	12,779	20,507	60
ఇంజనీరింగ్ టెక్నాలజీస్	16,187	18,562	15
ట్రాన్స్‌పోర్టేషన్	4,941	5,993	21
లీగల్	4,429	4,589	4
మిలిటరీ టెక్నాలజీస్	64	1,524	2,281
సైన్స్ టెక్నాలజీస్	367	532	45
లైబ్రరీ సైన్స్	96	119	24

సబ్జెక్టుల వారీగా గ్రాడ్యుయేట్ల తగ్గుదల

సబ్జెక్ట్/రంగం	2010-11లో గ్రాడ్యుయేట్లు	2020-21 గ్రాడ్యుయేట్లు	తగ్గుదల శాతం
సామాజిక శాస్త్రాలు	1,42,161	1,37,908	3
విజువల్, ఫెర్ఫార్మింగ్ ఆర్ట్	93,939	90,022	4
ఎడ్యుకేషన్	1,04,008	89,398	16
లిబరల్ ఆర్ట్స్	46,717	41,909	11
ఇంగ్లిష్	52,754	35,762	47
చరిత్ర	35,008	22,919	53
హ్యూమన్ సైన్సెస్	22,438	22,319	0.5
ఫారిన్ లాంగ్వేజెస్	21,705	15,518	40
ఫిలాసఫీ, రిలీజియస్ స్టడీస్	12,830	11,988	7
ఆర్కిటెక్చర్	9,831	9,296	6
కల్చరల్ అండ్ జెండర్ స్టడీస్	8,955	7,374	21
థియాలజీ	9,073	6,737	35
కమ్యూనికేషన్ టెక్	4,858	4,557	6
కలినరీ సర్వీసెస్	1,214	594	104
కన్‌స్ట్రక్షన్ ట్రేడ్స్	328	221	48
మెకానిక్ అండ్ రిపేర్	226	221	2
ప్రెసిషన్ ప్రొడక్షన్	43	28	53



పట్టణాలకు పచ్చదనం అందాలు..

- ఎకో టూరిజం ప్రాజెక్టు కింద త్వరలో 100 నగర వనాలు ఏర్పాటు
- ఇప్పటికే 11 చోట్ల సిద్ధం, డిసెంబర్ నాటికి మరో 30 రెడీ
- మార్చికల్లా మిగిలిన వాటిని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదం, వినోదం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న నగర వనాలు త్వరలో మరో 100 అందుబాటులోకి రానున్నాయి. భూమి లభ్యతను బట్టి ప్రతి జిల్లాలో కనీసం 2 నుంచి 4 నగర వనాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రకృతిని ఆస్వాదించేందుకు, ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతుండటంతో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల అభిరుచులకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో నగర వనాలను తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మంగళగిరి, పేరేచర్ల, దివాన్‌చెరువు (రాజమహేంద్రవరం),కడప, అనంతపురం, నెల్లూరు, తిరుపతిలో ఒక్కోటి చొప్పున, కర్నూలు, చిత్తూరులో 2 చొప్పున నగర వనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో 30కి పైగా నగర వనాలను డిసెంబర్‌లోపు, మిగిలిన వాటిని మార్చి నెలాఖరులోపు సిద్ధం చేయడానికి అటవీ శాఖ ప్రయత్నాలు చేస్తోంది.

ప్రతి జిల్లాలో 2, 3 ఏర్పాటుకు సన్నాహాలు

కొన్ని పట్టణాల్లో భూమి దొరక్కపోవడంతో నగర వనాల ప్రణాళిక ఆలస్యమైంది. భూమి అందుబాటులో ఉన్న చోట 2, 3 నగర వనాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. చిత్తూరు వద్ద అటవీ ప్రాంతం ఎక్కువ ఉండటంతో అక్కడ 2 నగర వనాలను తీర్చిదిద్దారు. అనంతపురం టౌన్ దగ్గర్లో ఎక్కడా అటవీ భూమి లేదు. దీంతో అక్కడ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో భూమి కోసం సంప్రదింపులు జరుపుతున్నారు. అలాంటి చోట్ల కొద్దిగా ఆలస్యమైనా మిగిలిన ప్రాంతాల్లో త్వరితగతిన నగర వనాలు సిద్ధమవుతున్నాయి. కొన్నిచోట్ల భూమి లేకపోయినప్పుడు అక్కడ అందుబాటులో ఉండే పెద్ద సంస్థలు, పెద్ద కాలేజీలు, క్యాంపస్‌లలో ఎక్కువ భూమి ఉంటే అలాంటిచోట్ల నగర వనాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేషన్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఆయా ప్రాంతాల్లోని కార్పొరేట్ సంస్థలు, కంపెనీలను సంప్రదిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఆయా ప్రాంతాల ప్రజలను వీటి ఏర్పాటులో భాగస్వాముల్ని చేస్తున్నారు. వాకర్స్ క్లబ్‌లు, స్థానిక ప్రముఖులను కూడా కలిసి వీటి గురించి వివరించి నిధులు సమకూర్చి, వారి ద్వారానే వాటిని నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఎకో టూరిజం నిబంధనలకు అనుగుణంగా..

పచ్చదనంతో కూడిన స్వచ్ఛమైన పరిసరాలు నగర వనాల్లో ఉండేలా చూస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు అక్కడకు వచ్చి ఆహ్లాదంగా గడిపేందుకు నగర వనాలను తీర్చిదిద్దుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు పలు రకాల క్రీడా సౌకర్యాలు, వాకింగ్ ట్రాక్, యోగా, వెల్‌నెస్ సెంటర్, అరుదైన చెట్ల పెంపకం వంటివన్నీ అక్కడ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఎకో టూరిజం నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రకృతి అందాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లనక్కర్లేదు

ప్రకృతి అందాలను వీక్షించేందుకు ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళుతున్నారు. వారి నివాసాలకు సమీపంలోనే ప్రకృతి సహజసిద్ధ ప్రాంతాలున్నాయి. వాటిని నగర వనాలుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో 30 నగర వనాలున్నాయి. మరో 100 వనాలను ఏర్పాటు చేస్తున్నాం.

– ఎన్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అటవీ దళాల అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్

మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగిసింది. మిగతా రాష్ట్రాల్లో ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరింది. ఛత్తీస్‌గఢ్‌లో ఒకటో దశ పోలింగ్ ముగిసింది. అక్కడి మిగతా స్థానాలతో పాటు మధ్యప్రదేశ్‌లో మొత్తం సీట్లకు ఐదు రోజుల్లో పోలింగ్ జరగనుంది. ఆ రెండు రాష్ట్రాల్లో మాదిరిగానే రాజస్థాన్‌లో కూడా అధికార కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ తలపడుతున్నాయి. నవంబర్ 25వ తేదీన పోలింగ్. 10 రోజుల్లో ప్రచారానికి తెర కూడా పడనుంది. బీజేపీ తరఫున ప్రధాని మోదీతో పాటు అగ్ర నేతలంతా నెల రోజులుగా ప్రచార బరిలోనే ఉన్నారు. కొద్ది రోజులుగా రాష్ట్రమంతటా ముమ్మురంగా కలియదిరుగుతున్నారు. కానీ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మాత్రం ఇప్పటిదాకా రాజస్థాన్‌లో అసలు ప్రచారానికే రాకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయన దీపావళి తర్వాత బరిలో దిగుతారని కాంగ్రెస్ పైకి చెబుతున్నా, లోలోపల దీనిపై ఆ పార్టీ నేతల్లోనూ ఆవేదనే తొంగిచూస్తోంది. కాంగ్రెస్ ఓటమి ఖాయమని అర్థమయ్యే రాజస్థాన్‌కు రాహుల్ దూరంగా ఉంటున్నారంటూ బీజేపీ ఎద్దేవా చేస్తోంది. అందుకే సోదరి ప్రియాంకతో నామమాత్రంగా ప్రచారం చేయించి మమ అనిపిస్తున్నారంటోంది...

రాహుల్ ఎక్కడ?

రాజస్థాన్ ప్రచారంలో కాలుమోపని వైనం

- ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతోంది
- కాంగ్రెస్ నేతలు,కార్యకర్తల్లో ఆవేదన
- ఓటమి ఖాయమనే ముఖం చాటు: బీజేపీ



రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ స్టార్ ప్రచారకుల జాబితాలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ తర్వాత మూడో స్థానంలో ఉన్నది రాహులే. ఖర్గే రెండు మూడుసార్లు రాష్ట్రంలో ప్రచారంలో పాల్గొన్నారు. ప్రియాంక గాంధీ కూడా రెండు ర్యాలీల్లో ప్రసంగించారు. కానీ రాహుల్ మాత్రం రాష్ట్రంలో అడుగు పెట్టి ఏకంగా నెలన్నర దాటింది! ఆయన చివరిసారిగా సెప్టెంబర్ 23న జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తల భేటీలో పాల్గొన్నారు. ఇంత హోరాహోరీగా జరుగుతున్న ఎన్నికల్లో పార్టీ తరఫున అన్నీ తానై ప్రచార భారం మోయాల్సిన ఆయన ఎందుకిలా దూరంగా ఉంటున్నారన్న దానిపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది...

తెలంగాణకు వెళ్లారుగా: బీజేపీ

రాహుల్ గైర్హాజరీకి రాజస్థాన్ కాంగ్రెస్ వర్గాలు చెబుతున్న కారణాలు కూడా పెద్దగా నమ్మశక్యంగా లేవన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజస్థాన్ కంటే ముందుగా పోలింగ్ జరుగుతున్న మిగతా రాష్ట్రాల్లో ప్రచారంలో రాహుల్ బిజీగా ఉన్నారని ఆ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి సుఖీందర్‌సింగ్ రణ్‌ధవా చెప్పుకొచ్చారు. అందుకే ప్రస్తుతానికి ఆయన రాష్ట్రంపై దృష్టి పెట్టడం లేదన్నారు. కానీ ఇది సాకు మాత్రమేనని బీజేపీ అంటోంది. రాజస్థాన్ తర్వాత ఐదు రోజులకు నవంబర్ 30న పోలింగ్ జరగనున్న తెలంగాణలో రాహుల్ ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్న విషయాన్ని ప్రస్తావిస్తోంది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ విజయంపై రాహుల్‌కు పెద్దగా నమ్మకం లేనట్టుందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లోనే సాగుతోంది! సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఓ కార్యక్రమంలో రాహుల్ మాటలు కూడా దీన్ని బలపరిచేవిగానే ఉండటం విశేషం. 'మేం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ల్లో కచ్చితంగా గెలుస్తున్నాం. తెలంగాణలోనూ విజయ సూచనలున్నాయి' అని చెప్పిన ఆయన, 'రాజస్థాన్‌లో బహుశా గెలుస్తామేమో' అంటూ ముక్తాయించారు. ఆయన నుంచి ఇలాంటి వ్యాఖ్యలను ఊహించలేదంటూ అప్పట్లోనే రాజస్థాన్ కాంగ్రెస్ వర్గాలు ఆవేదన వెలిబుచ్చాయి!

ఆనవాయితీ మార్చాలనుకుంటే...

నిజానికి రాజస్థాన్‌లో ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వం మారడం ఆనవాయితీ. కానీ ఈసారి ఎన్నికలకు ముందు దాకా విపక్ష బీజేపీలో అంతర్గత పోరు గట్టిగానే కొనసాగింది. దానికి తోడు సీఎం అశోక్ గహ్లోత్ కొద్ది నెలలుగా వరుసబెట్టి ప్రజాకర్షక పథకాలను ప్రకటించారు. కనుక అధికార పార్టీ ఓడిపోయే ఆనవాయితీని ఈసారి మార్చగలమని రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తలు అప్పట్లో భావించారు. తీరా ఎన్నికలు సమీపించే సమయానికి బీజేపీలో ఇంటి పోరు సద్దుమణిగింది. ఇటు చూస్తే ప్రధాన నాయకుడే రాష్ట్రం వైపు తొంగి కూడా చూడకపోవడం వారిలో నిరాశను పెంచుతోంది.

గహ్లోత్–పైలట్ కుమ్ములాటలూ కారణమే!

రాజస్థాన్‌కు రాహుల్ కాస్త దూరంగా ఉండటానికి సీఎం గహ్లోత్, యువ నేత సచిన్ పైలట్ మధ్య తీవ్ర విభేదాలు కూడా కారణమని రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఎవరికి పట్టున్న ప్రాంతంలో ప్రచారానికి వెళ్లినా రెండోవారిని బాధపెట్టినట్టు అవుతుందన్న భావన బహుశా ఆయనలో ఉండవచ్చని చెబుతున్నారు. పైగా గతేడాది కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టాలన్న సోనియా ఆదేశాన్ని కూడా గహ్లోత్ బేఖాతరు చేయడం తెలిసిందే. దీనిపైనా రాహుల్ అసంతృప్తిగా ఉన్నారని ఏఐసీసీ వర్గాలంటున్నాయి. కారణమేదైనా ప్రచార పర్వంలో రాహుల్ గైర్హాజరు ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపడం ద్వారా కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బ తీస్తోందన్న ఆందోళన ఆ పార్టీ నేతలతో పాటు కార్యకర్తల్లో కూడా వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఆయన దీపావళి అనంతరం నిజంగానే ప్రచారానికి వచ్చినా పెద్దగా ఒరిగేదేమీ ఉండదంటూ పలువురు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు ఆ నైరాశ్యానికి అద్దం పట్టేలానే ఉన్నాయి!



బస్తర్‌లో 404 సార్లు చక్కర్లుకొట్టాయి!

- ఎన్నికల సిబ్బందిని తరలించిన వాయుసేన హెలికాప్టర్లు
- ఆరు రోజులు అవిశ్రాంతంగా పనిచేసిన వైనం



రాయ్‌పూర్: నక్సల్ ప్రభావిత ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో ఎన్నికల నిర్వహణ నిజంగా కత్తిమీద సామే. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలంటే ముందుగా ఎన్నికల సిబ్బందిని క్షేమంగా పోలింగ్ స్టేషన్‌లకు పంపించాలి. పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎం యంత్రాలుసహా సిబ్బందిని తిరిగి సురక్షితంగా తీసుకురావాలి. నక్సల్స్ మందుపాతరలు, మెరుపుదాడులకు పేరుగాంచిన బస్తర్ జిల్లాలో సిబ్బంది తరలింపు సవాళ్లతో కూడుకున్నదే. అందుకే ఈసారీ రోడ్డు మార్గంలోకాకుండా వాయుమార్గంలో సిబ్బందిని తరలించి శెభాష్ అనిపించుకుంది భారత వాయుసేన. రాష్ట్రంలో తొలి దఫా ఎన్నికలు జరిగిన నవంబర్ 7వ తేదీన 20 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించడం తెల్సిందే. ఈ నియోజకవర్గాల్లో అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లకు 860 మందికిపైగా సిబ్బందిని తరలించేందుకు వాయుసేన తన ఎంఐ–17 హెలికాప్టర్లను రంగంలోకి దించింది. ఎనిమిది హెలికాప్టర్లు ఆరు రోజులపాటు ఇలా ఎన్నికల సిబ్బంది తరలింపులో అవిశ్రాంతంగా పనిచేశాయి. 'సిబ్బంది తరలింపు కోసం హెలికాప్టర్లు 404 సార్లు రాకపోకలు సాగించాయి. విధి నిర్వహణలో పోలింగ్ సిబ్బంది మాత్రమే కాదు వాయుసేన హెలికాప్టర్లు తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పాయి' అని ప్రశంసిస్తూ ఛత్తీస్‌గఢ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. 'బస్తర్ ప్రాంతంలోని సుక్మా, బీజాపూర్, కాంకేర్, దంతేవాడ, నారాయణ్‌పూర్ జిల్లాలో 156 పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వర్తించిన 860కిపైగా సిబ్బందిని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తన హెలికాప్టర్లలోనే తరలించింది' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి. సుందర్‌రాజ్ చెప్పారు.

హెలికాప్టర్లపైకీ నక్సల్ కాల్పులు !

2008 అసెంబ్లీ ఎన్నికల్లో సిబ్బందిని తరలిస్తున్న హెలికాప్టర్లపైకీ నక్సల్స్ కాల్పులు జరిపారు. ఆనాడు బీజాపూర్ జిల్లాలోని పెడియా గ్రామంలో ఓటింగ్ యంత్రాలు, సిబ్బందితో వెళ్తున్న ఒక హెలికాప్టర్ పైకి నక్సల్స్ కాల్పులు జరపగా కాక్‌పిట్‌లోని ఫ్లైట్ ఇంజనీర్ సర్జెంట్ ముస్తఫా అలీ మరణించారు. వెంటనే అందులోని కెప్టెన్ స్క్వాడ్రాన్ లీడర్ టీకే చౌదరీ చాకచక్యంగా అది కూలిపోకుండా చూసి సురక్షితంగా జగ్దల్‌పూర్ పట్టణంలో ల్యాండ్‌చేశారు.

వరి, గోధుమలకు మరింత 'మద్దతు'



భోపాల్‌లో బీజేపీ మేనిఫెస్టోను విడుదలచేస్తున్న పార్టీ చీఫ్ నడ్డా, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ తదితరులు

- 'లాడ్లీ బెహనా' లబ్ధిదారులకు పక్కా ఇళ్లు
- రూ.450కే వంట గ్యాస్ సిలిండర్
- మధ్యప్రదేశ్ ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ కీలక హామీలు

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఈనెల 17న జరగనున్న ఎన్నికలకు గాను బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) గోధుమలకు రూ.2,700, వరి ధాన్యానికి రూ.3,100 చెల్లిస్తామని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'లాడ్లి బెహనా'పథకం లబ్ధిదారులకు పక్కా ఇళ్లు, ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి ఉద్యోగాలు, లేదా స్వయం ఉపాధికి అవకాశం. నిరుపేద కుటుంబాల బాలికలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు, పేద విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్య, స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు కొనుక్కునేందుకు ఏడాదికి రూ.1,200 అందజేత, లాడ్లి బెహనా, 'పీఎం ఉజ్వల'పథకాల లబ్ధిదారులకు రూ.450కే ఎల్పీజీ సిలిండర్ వంటి కీలక హామీలను రాష్ట్ర ప్రజలకు ఇచ్చింది.ఈ మేరకు ఎన్నికల హామీలతో కూడిన 96 పేజీల 'సంకల్ప్ పత్ర'ను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర పార్టీ చీఫ్ వీడీ శర్మ, సీఎం చౌహాన్ తదితరుల సమక్షంలో శనివారం విడుదల చేశారు. బీజేపీకి మరోసారి అవకాశమిస్తే మేనిఫెస్టోలోని ప్రతి హామీనీ తు.చ. తప్పక అమలు చేస్తామన్నారు. మేనిఫెస్టో అమలుపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతుందని తెలిపారు. మధ్యప్రదేశ్ అభివృద్ధికి మేనిఫెస్టోను రోడ్ మ్యాప్‌గా మారుస్తామని సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. అన్ని హామీలను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ప్రకటించారు.

- రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఏర్పాటు.
- గిరిజనుల సాధికారిత సాధనకు రూ.3 లక్షల కోట్లతో కొత్తగా ఆరు ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణం.
- సీఎం కిసాన్ కల్యాణ్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్‌ల ద్వారా రైతులకు ఏడాదికి రూ.12 వేలు పంపిణీ.
- ఆహార ధాన్యాలతో పాటు ఆవనూనె, పప్పులు, పంచదార సబ్సిడీపై అందజేత.
- అర్హులైన కుటుంబాలకు పీఎం ఆవాస్ యోజన, సీఎం జన్ ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం.
- రాష్ట్రంలో 13 సాంస్కృతిక కారిడార్ల ఏర్పాటు. శక్తి పీఠాల నవీకరణ
- మధ్యప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను ఏడేళ్లలో రూ.45 లక్షల కోట్లకు పెంచడం.
- ప్రజల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను రప్పించడం.
- ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల మంజూరు. అదనంగా 2వేల మెడికల్ సీట్ల మంజూరు.
- ప్రతి జిల్లాలో ఒక నర్సింగ్ కళాశాల స్థాపన.

ఖాకీవనం.. గుర్వాయిపాలెం

ఆ గ్రామంలో అడుగడుగునా పోలీసులే

- ఒకే గ్రామంలో 110 మందికి పైగా పోలీసు ఉద్యోగాలు
- సెలక్షన్‌కు వెళితే.. కొలువు గ్యారంటీ!
- పోలీసు ఊరుగా ప్రసిద్ధి చెందిన వైనం

గుర్వాయిపాలెం.. ఆ గ్రామం పేరు వింటేనే.. పోలీసు ఊరా అని అడుగుతారు. అంతలా ప్రసిద్ధి చెందడానికి కారణం.. ఆ ఊళ్లో సగటున ప్రతి ఆరు ఇళ్లకూ ఒక పోలీసు ఉండటమే. ఆ గ్రామం నుంచి ఏకంగా 110 మందికి పైగా పోలీసు ఉద్యోగాల్లో ఉన్నారంటే దాని ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు. గుర్వాయిపాలెం నుంచి పోలీస్ సెలక్షన్‌కు వెళుతున్నారంటే.. కొలువు ఖాయం అనే పేరు ఏర్పడిపోవడం గమనార్హం.



గుర్వాయిపాలెం గ్రామం (వ్యూ)

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్: తాడేపల్లిగూడెం మండలంలోని మిలట్రీ మాధవరం పేరు వినే ఉంటారు.. అక్కడ ఒక్కో గడపకు ఒక్కో సైనికుడు దేశ రక్షణలో సేవలందిస్తున్నారు. అదే తరహాలో కలిదిండి మండలం గుర్వాయిపాలెం పోలీసు ఊరుగా పేరు గడించింది. పోలీసు సెలక్షన్లు జరిగితే ఈ గ్రామం నుంచి వెళ్లిన యువతకు కొలువు ఖాయం అనే నానుడి మూడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. దాదాపు 34 సంవత్సరాల క్రితం కొందరు సాధించిన పోలీసు ఉద్యోగాల స్ఫూర్తితో గ్రామ యువత పట్టుదలతో పోలీసు కొలువులు సాధిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకొన్నారు. ఈ ఒరవడి ప్రతి తరం కొనసాగిస్తుండటం విశేషం. గుర్వాయిపాలెంలో ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇక్కడ గ్రామ జనాభా 2848. ఓటర్లు 2207 మంది. మొత్తం 652 కుటుంబాలు నివసిస్తున్నాయి.

తొలి తరం స్ఫూర్తి ప్రదాతలు..

గుర్వాయిపాలెంలో తొలుత యార్లగడ్డ నాంచారయ్య కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందారు. తర్వాత గోదావరి రంగయ్య, రాజమ్మల కుమారులు మురళి (రిటైర్డ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ, విజయవాడ,), ఉమామహేశ్వరరావు (సీసీఎస్, ఏఎస్‌ఐ, మచిలీపట్నం), శ్రీనివాసరావు (సీసీ డీఎస్పీ, గుడివాడ) 1988–89 బ్యాచ్‌లో ఒకేసారి ఎంపికయ్యారు. ఇదే బ్యాచ్‌లో గ్రామానికి చెందిన పయ్యోర్తు ప్రకాశరావు ఉద్యోగం సాధించారు. తర్వాత ఒకే కుటుంబానికి చెందిన బొల్లా రాంబాబు, బొల్లా వెంకటేశ్వరరావు, పోసిన శ్రీనివాసరావు, పోసిన నాగరాజు, పడమటి రామకృష్ణ, పడమటి రవికాంత్, బత్తిన కూర్మారావు, బత్తిన ఆదినారాయణ.. ఇలా కొలువులు పొందారు. మొత్తం గ్రామంలో సుమారు 55 కుటుంబాల నుంచి పోలీసు ఉద్యోగాలు పొందారు. డీఎస్పీ–1(రిటైర్డ్), ఎస్‌ఐలు 5, ఏఎస్‌ఐ 6, హెడ్ కానిస్టేబుళ్లు 5, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఇతర సిబ్బంది కలిపి మరో 100 మంది పైనే ఉంటారు.

ఆటలంటే అమితమైన ప్రేమ...

ఈ గ్రామం పూర్వం కబడ్డీ ఆటకు పెట్టింది పేరు. శారీరక దారుఢ్యం కోసం గ్రామంలోని యువకులు నిత్యం గ్రామ పాఠశాల వద్ద వ్యాయామం చేస్తారు. దీంతో పోలీసు సెలక్షన్లు వచ్చినప్పుడు గ్రామం నుంచి వెళ్లిన యువకులు రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, 100 మీటర్లు, 200 మీటర్ల పోటీల్లో మెరుగైన ప్రతిభ చూపుతున్నారు. గ్రామంలో వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలు ప్రస్తుతం ఎక్కువగా ఆడుతున్నారు. ఏదోక రూపంలో నిత్య వ్యాయామం ఉండటం వల్ల పోలీస్ సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చూపుతున్నారు. ప్రస్తుత ఆకివీడు ఎస్‌ఐ బి.నాగబాబు, విజయవాడ ఆక్టోపస్ ఎస్‌ఐ జాన్, ఏలూరు ఆర్ఎస్‌ఐ వెంకటేష్, విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్‌ఐ రాజేష్, మంగళగిరి ఆర్ఐ సుభాష్‌చంద్రబోష్.. ఇలా అనేక మంది గుర్వాయిపాలెం నుంచి వెళ్లినవారే. ఇటీవల ఏలూరులో జరిగిన ఎస్‌ఐ సెలక్షన్లకు ఈ గ్రామం నుంచి 10 మంది వెళ్లారు.

పోలీసు సేవలకు ముగ్గురు బిడ్డలను అందించా..



నా ముగ్గురు బిడ్డలను పోలీసు సేవ చేయడానికి అందించా. మా కుటుంబం గ్రామంలో అనేక మందికి స్ఫూర్తిని నింపింది. ఎందరో పోలీసు ఉద్యోగాలు సాధించారు. మా ఊరి పేరు చెప్పగానే పోలీసు ఊరు అంటున్నారు. ఇది ఎంతో గర్వంగా ఉంది. మరింత మంది పోలీసు కొలువులు సాధించాలి. గ్రామానికి పేరు తీసుకురావాలి.

– గోదావరి రాజమ్మ (94 సంవత్సరాలు), గుర్వాయిపాలెం

ఎంతో గర్వంగా ఉంది



మా ఊరి నుంచి ఎక్కువ మంది పోలీసు శాఖలో సేవలందించడం గర్వంగా ఉంది. పోలీసు సెలక్షన్లలో మా గ్రామ యువత వెళితే కచ్చితంగా కొలువు సాధిస్తారనే నమ్మకం ఏర్పడింది. యువకులు నిత్యం శారీరక దారుఢ్యం పెంపొందించుకునేందుకు ఎంతో కృషి చేస్తారు. మా గ్రామాన్ని పోలీసు ఊరు అని అందరూ అనడం సర్పంచ్‌గా నాకు గొప్పగా ఉంది.

– బత్తిన ఉమామహేశ్వరరావు, సర్పంచ్, గుర్వాయిపాలెం

ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతోనే..



పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేయాలనే కోరిక ముందు నుంచి ఉంది. అప్పటికే మా ఊరు నుంచి అనేక మంది పోలీసు ఉద్యోగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. నేటి యువత ముందుగా ఒక లక్ష్యాన్ని నిర్ణయించి కృషి చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. పోలీసు, ఆర్మీ, నేవీ ఇలా డిఫెన్స్ ఉద్యోగాలకు ప్రయత్నించే యువతీ యువకులు ఉదయపు వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చేయాలి.

– బి.నాగబాబు, ఎస్‌ఐ, ఆకివీడు

గ్రామంలో స్ఫూర్తిని నింపాం



మా తల్లిదండ్రులు గోదావరి రంగయ్య, రాజమ్మ మా సోదరులు ముగ్గురిని పోలీసు ఉద్యోగాలకు ప్రోత్సహించారు. దీంతో గ్రామంలో యువతకు పోలీసు ఉద్యోగాల్లో చేరాలనే స్ఫూర్తి కలిగింది. ఒకరిని చూసి మరొకరు పోలీసు కొలువులు సాధించారు. గ్రామానికి చెందిన అనేక మంది ప్రస్తుతం వివిధ స్థాయిల్లో పని చేస్తున్నారు. గుర్వాయిపాలెం బిడ్డగా నేను ఎంతో గర్వపడుతున్నాను.

– గోదావరి ఉమామహేశ్వరరావు, సీసీఎస్, ఏఎస్‌ఐ, మచిలీపట్నం

సిరుల పట్టు



గుర్వాయిపాలెం గ్రామం (వ్యూ)

- జిల్లాలో పెరుగుతున్న పట్టుసాగు
- సిల్క్ సమగ్ర పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

కడప అగ్రికల్చర్: జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తరిస్తోంది. రైతులకు లాభాలు కురిపిస్తోంది. ప్రభుత్వం కూడా రాయితీలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. దీంతో చాలా మంది రైతులు పట్టు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు సైతం పట్టు పురుగుల పెంపకానికి సంబంధించిన సలహాలు సూచనలను అందిస్తూ అండగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల అభివృద్ధికి సహకారం అందిస్తోంది. పట్టు పురుగుల పెంపంక మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు నర్సరీ కేంద్రాల్లో పెంపకాన్ని చేపట్టింది. కడప నగర శివార్లలోని ఊటుకూరు, మైదుకూరు మండలం వనిపెంట పట్టు పరిశ్రమలశాఖ క్షేత్రంలో మల్బరీ నర్సరీ సాగును చేపట్టారు. మొక్కలు కావాల్సిన రైతులకు ఒక్కో మొక్కను రెండు రూపాయలతో అందిస్తారు. ఈ ఏడాది జిల్లాలో 4 వందల ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటివరకు 250 ఎకరాల్లో సాగు చేశారు.

మండలాల పరిధిలో...

జిల్లాలోని పలు మండలాల పరిధిలో మల్బరీ సాగు చేపట్టారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు మరింత పెరిగింది. మండలాల పరిధిలో 2023–24 సంవత్సరానికి 400 ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు వేంపల్లి, లింగాల, కొండాపురం, ముద్దనూరు, సీకేదిన్నె, ఖాజీపేట, చెన్నూరు. వనిపెంట, పోరుమామిళ్ల, సిద్దవటం, అట్లూరు, చక్రాయపేట మండలాల పరిధిలో 250 ఎకరాల్లో సాగుచేశారు. చాలా కాలంగా వర్షాలు లేక సాగు మందకొడిగా ఉన్నా ప్రస్తుతం జిల్లాలో వానలు పడుతుండటంతో సాగు మరింత పుంజుకోనుంది.

లక్ష్యాన్ని సాధించేందుకు కృషి



ఈ ఏడాది జిల్లాలో 4 వందల ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు 250 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో సాగు ఊపు అందుకోనుంది. త్వరలో లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి.

సిల్క్ సమగ్ర-2 పథకంలో యూనిట్ ఏర్పాటుకు సబ్సిడీ..

యాక్టివిటీ	యూనిట్ విలువ (రూలలో)	కేంద్రంవాటా (రూలలో)	రాష్ట్ర వాటా
మల్బరీ ప్లాన్టేషన్	25,000	16,250	6,250
షెడ్ నిర్మాణం	4,00,000	2,60,000	1,00,000
పరికరాలు	75,000	48,500	18,650
క్రిమి సంహారానికి	5,000	3,250	1,250

ఓసీ, బీసీ, ఇతరులకు

యాక్టివిటీ	యూనిట్ విలువ	కేంద్రం	రాష్ట్రం
మల్బరీ ప్లాన్టేషన్	25,000	12,500	6,250
షెడ్ నిర్మాణం	4,00,000	2,00,000	1,00,000
పరికరాలు	75,000	37,500	18,750
క్రిమి సంహారానికి	5,000	2,500	1,250

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ..

యాక్టివిటీ	యూనిట్ విలువ	ఆర్‌కేవైసీ	లబ్ధిదారుడు
కూలింగ్ సిస్టమ్	25,000	22,500	2,500
రీడింగ్ షెడ్డు ప్లాస్టిక్ నేత్రికలు	15,000	13,500	1,500
పామ్‌పాండ్స్	1,50,000	1,35,000	1,500
షోలార్‌లైట్స్	50,000	45,000	5,000
పామ్ మెకనైజేషన్	1,00,000	90,000	10,000

ఓసీ, బీసీ, ఇతరులు....

యాక్టివిటీ	యూనిట్ విలువ	ఆర్‌కేవైసీ	లబ్ధిదారుడు
కూలింగ్ సిస్టమ్	25,000	12,500	12,500
రీడింగ్ షెడ్డు ప్లాస్టిక్ నేత్రికలు	15,000	7,500	7,500
పామ్‌పాండ్స్	1,50,000	75,000	75,000
షోలార్‌లైట్స్	50,000	25,000	25,000
పామ్ మెకనైజేషన్	1,00,000	50,000	50,000

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943